శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

**21న కేబినెట్**

ప్రైవేటు పాఠశాల ఫీజు నియంత్రణ, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపు విధివిధానాలపై చర్చించే అవకాశం 08

సంపుటి 09, సంచిక: 170 | బుధవారం | 20-05-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



పాలమూరు– రంగారెడ్డికి

# యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ

- ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలి
- నిధుల్లో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటాం
- పెండింగ్ బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనితో పాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ముఖ్యమంత్రి ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీలకమైన సూచనలు చేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని సిఎం చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్‌ఎలు కసిరెడ్డి నారాయణరెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, టి.మేఘా రెడ్డి, కె.రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావు పాల్గొన్నారు.






## ఆర్‌టిసి కార్మికులు కన్నెర్ర చేస్తే బస్సు పయ్య ఆగుతది

- రాజకీయ పార్టీలను అధికారంలో కూర్చోబెట్టే ప్రథమ శక్తి వారిదే
- కార్మికులు ఆగ్రహిస్తే టాటాలు, బిర్లాలు, అంబానీలైనా కాళ్ల బేరానికి రావాల్సిందే
- కార్మికులకు హక్కులు లేకపోతే ఏమి ప్రజాపాలన?
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ భారీ ర్యాలీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి కార్మికులు కన్నెర్ర చేస్తే బస్సు చక్రాలు ఆగిపోవడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధి రథ చక్రం ఆగిపోతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజకీయ పార్టీలను అధికారంలో కూర్చొబెట్టే ప్రథమ శక్తి ఆర్‌టిసి కార్మికులదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరువాయి 12లో

## పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం



సమృద్ధిగా సాగు నీరు, తాగు నీరు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పం : మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/హైదరాబాద్

దేవాదుల, ఎస్‌ఎల్‌బిసి, సీతారామా ప్రాజెక్టులతో సరి సమానంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసి సమృద్ధిగా సాగు నీరు, తాగు నీరు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని నీటిపారుదల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి లతో కలసి మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి తరువాయి 8లో

## ప్రాజెక్టులపై పాదయాత్ర హాస్యాస్పదం



పాలమూరు ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదు: మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలమూరు ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదని, మహబూబ్‌నగర్ జిల్లా బిఆర్ఎస్ మాజీ మంత్రులు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై పాదయాత్ర చేస్తామనడం హాస్యాస్పదమని ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశామని బిఆర్ఎస్ నేతలు చెబుతున్నా, వాస్తవానికి మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూటర్లకు కూడా తరువాయి 8లో

## రష్యా–చైనా బంధం అపూర్వం

వీడియో సందేశంలో రష్యా అధ్యక్షుడుపుతిన్



**బీజింగ్:** చైనా–రష్యా మధ్య వ్యూహాత్మక సమన్వయం ఏర్పడిన 2026వ సంవత్సరం నాటికి 30 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పుతిన్ మంగళ,బుధవారాలలో చైనాలో పర్యటిస్తున్నారు. అదే విధంగా ఈ రెండు దేశాలమధ్యా స్నేహపూర్వక సంబంధాలపై సంతకాలు జరిగి ఈ ఏడాదికి 25 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. 2003 నుండి రష్యా–చైనా అధ్యక్షులు ఇరువురూ ఇప్పటివరకూ దాదాపు 40 సార్లు వివిధ సందర్భాలలో సమావేశాలు నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా పర్యటన పూర్తి చేసిన వారం రోజులలో రష్యా అధ్యక్షుడు కూడా జిన్‌పింగ్‌తో భేటీ కావడం ఒక ప్రత్యేక విశేషం. ఈ సందర్భంగా పర్యటనకు ముందు పుతిన్ ఒక వీడియో సందేశం విడుదల చేస్తూ, రష్యా–చైనా మధ్య మైత్రీబంధం అపూర్వమైనస్థాయికి చేరుకుందని అన్నారు. మన రెండు దేశాల బంధాన్ని పూర్తిస్థాయిలో ప్రోత్సహించడానికి, సామర్థ్యాన్ని వెలికి తీయడానికి చేస్తున్న ఉమ్మడి ప్రయత్నాలలో క్రమతప్పకుండా చేస్తున్న పర్యటనలు ఒక ముఖ్యమైన అంతర్భాగమని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. పరస్పర అవగాహన, విశ్వాసం, ఉభయతారక తరువాయి 12లో



## ఉద్యోగులు, పెన్షనర్ల వివరాలు సేకరించండి

- ప్రభుత్వ ఆదేశం
- న్యూ 'ఎంప్లాయ్స్ హెల్త్ స్కీమ్' అమలుకు అడుగులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' అమలు దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా 'ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్' (ఈహెచ్‌సిటి)ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ తరువాయి 8లో

ఉద్యోగ గరిష్ట వయోపరిమితి

## 44 ఏళ్లకు పెంపు!

రాష్ట్రంలో నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఊరటనిచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాల ప్రత్యక్ష నియామకాల్లో పాల్గొనే అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిని మరో 10 ఏళ్లు పెంచుతూ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జి.ఓ నెంబర్ 86) ఉత్తర్వులను జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఇప్పటివరకు ఉన్న 34 ఏళ్ల గరిష్ఠ తరువాయి 8లో



## ఆర్థిక తుఫాన్ రాబోతోంది!

- అదానీ, అంబానీ లేదా మోదీలను కాదు....
- యువత, కార్మికులు, చిన్న వ్యాపారులను దెబ్బతీస్తది

ప్రజలను విదేశాలకు వెళ్లొద్దన్న మోదీనే విదేశాలకు వెళుతున్నారు

- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపాటు

**న్యూఢిల్లీ/రాయ్‌బరేలి :** ఒక 'ఆర్థిక తుఫాన్' రాబోతోందని, అది అదానీ, అంబానీ లేదా మోదీలను కాకుండా, యువతను, కార్మికులను, చిన్న వ్యాపారులను దెబ్బతీస్తుందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట సమయాలు రాబోతున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో మంగళవారం విలేకరులతో అన్నారు. చాలా ఏళ్లుగా ఎవరూ చూడని ఒక భారీ ఆర్థిక 'తుఫాను' రాబోతోందని తెలిపారు. ప్రధాని స్వయంగా ఇచ్చిన పొదుపు పిలుపును ఆయనే పాటించడం లేదని కూడా రాహుల్ గాంధీ ఆ రోపించారు. చర్యలు తీసుకోవడానికి బదులుగా, నరేంద్ర మోదీ దేశ ప్రజలను విదేశీ పర్యటనలకు వెళ్లవద్దని చెబుతున్నారు, కానీ ఆయనేమో ప్రపంచమంతటా పర్యటిస్తున్నారని, ఇదే ప్రస్తుత పరిస్థితి అని ఆయన అన్నారు. అంబానీ–అదానీ వ్యవస్థ ఎక్కువ కాలం నిలబడదని కూడా ఆరోపించారు. మోదీ అదానీ, అంబానీల వ్యవస్థ— చెక్కు చెదరకుండా ఉండదు, అది కూలిపోతుందన్నారు. దురదృష్టవశాత్తు, ఆ నష్టాన్ని సామాన్య ప్రజలు తరువాయి 8లో



## పెట్రో పెంపు మరోసారి

- పెట్రోల్, డీజిల్‌పై 90 పైసల చొప్పున పెంపు
- వారం రోజుల్లో ధరలు పెరగడం ఇది రెండవసారి
- ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 98.64కి చేరిక
- హైదరాబాద్‌లో రూ. 111.88కి పెంపు

**న్యూఢిల్లీ :** కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోసారి సామాన్యుడి నడ్డి విరిచింది. పెట్రోల్, డీజిల్‌పై 90 పైసలు పెంచి వాహనదారులకు షాక్ ఇచ్చింది. ఇప్పటికే పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో ఎల్‌పిజి కొరత కారణంగా వినియోగదారులు సతమతమవుతుండగా ఇటీవలే వాణిజ్య సిలిండర్‌పై రూ. 900లకుపైగా, పెట్రోల్, డీజిల్‌పై రూ. 3 చొప్పున ధరలు పెంచింది. దీంతో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ ధరల పెంపు కారణంగా నిత్యావసర వస్తువులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతుండగా మరోసారి ధరలు పెంచి నెత్తిన మోయలేని భారం మోపింది. ఒక్క వారంలోనే ధరలు పెరగడం ఇది రెండవసారి. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం తాజా పెంపుతో తరువాయి 8లో

## ఎసిబికి చిక్కిన జలమండలి జిఎం 12

- అనంతకుమార్ నివాసంలో అధికారులు సోదాలు
- భారీగా అక్రమాస్తుల గుర్తింపు
- కిలోల కొద్దీ బంగారం, వెండి, భూ పత్రాలు స్వాధీనం





గల్ఫ్ దేశాల విజ్ఞప్తి మేరకు

## 'ఇరాన్‌పై దాడి ఆపేశా'

- దాడుల విరామం మరికొంతకాలం కొనసాగే అవకాశం
- అణు కార్యక్రమాన్ని వదులుకున్నట్లు లిఖితపూర్వకంగా చెప్పాలి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్:** ఇరాన్‌పై తాజా దాడులు చేయాలన్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్తంభింపజేశారు. ఇరాన్ వైఖరితో విసిగిపోయాననీ, నిర్ణీత ప్రకారం మంగళవారం నుండీ (మే 19) ఇరాన్‌పై 'ఫ్రెష్‌గా' దాడులు మళ్ళీ ప్రారంభించాలని ప్రణాళిక రూపొందించామని, కానీ గల్ఫ్ దేశాలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ దాడులను స్తంభింపజేశామని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన చేసిన కొద్ది గంటలకే మళ్ళీ ఆయన వైట్‌హౌస్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఒక సానుకూల పరిణామం చోటు చేసుకుంటోందని, ఈసారి ఇరాన్ ఒక ఒప్పందానికి చేరువలో ఉందని తాను భావిస్తున్నానని పేర్కొన్నారు. గతంలో చర్చలు స్తంభించిపోయిన తర్వాత జరిగిన ప్రయత్నాల్లో కొన్నిసార్లు తాను ఒక ఒప్పందానికి ఇరాన్ చేరువలో ఉందని భావించాననీ, కానీ అప్పటికీ ఇప్పటికీ పరిస్థితి కొంచెం భిన్నంగా ఉందని కూడా చెప్పారు. "ఇది చాలా సానుకూల పరిణామం, ఐతే ఇది నిజంగా ఏదైనా ఫలితాన్ని ఇస్తుందో లేదో కూడా వేచి చూడాలి" అన్నారు. "మంగళవారం ఇరాన్‌పై జరగాల్సిన దాడులను కొన్ని రోజుల పాటు వాయిదా వేయాలని గల్ఫ్ దేశాలు విజ్ఞప్తి చేశాయని, ఈ విరామం మరికొంతకాలం కొనసాగే అవకాశం ఉందని అన్నారు. అదేవిధంగా అణు కార్యక్రమాన్ని ఇరాన్ వదులుకోవాల్సిందేనని ఆయన పదే పదే నొక్కి చెప్పారు. "అణు కార్యక్రమాన్ని వదులుకున్నట్లు వారు లిఖితపూర్వకంగా తెలియజేయాల్సి ఉంటుంది" అన్నారు. ఐతే చర్చలు ప్రారంభించడానికి అనువైన వాతావరణం లేదని, అందుకు అనుకూలమైన రాయితీలు ప్రకటించడంలేదని అటు ఇరాన్, ఇటు అమెరికా పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ తరువాయి 12లో



## సమర్థవంతంగా ఇంటింటి చెత్త సేకరణ

- తడిచెత్త ప్రాసెసింగ్‌తో వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు
- న్యూఢిల్లీలో స్వచ్ఛ భారత్ మిషన్‌అర్బన్ 2.0 జాతీయ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రైజింగ్–2047 విజన్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర సుస్థిర, సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో తరువాయి 12లో

# గల్ఫ్ యుద్ధంలో రెండు పరిణామాలు

పశ్చిమాసియాలో ఇరాన్–అమెరికా యుద్ధంలో అప్రకటితంగా కొనసాగుతున్న కాల్పుల విరమణ, తెరమాటున చర్చల నేపథ్యంలో రెండు పరిణామాలు గమనించదగినవి. తమ షరతులతో కూడిన శాంతి ప్రతిపాదనలకు అంగీకరించకపోతే ఇరాన్‌ను భూమండలంనుంచి రూపుమాపటానికి ట్రంప్ విధించిన గడువు ముగుస్తుండగా ఆయన దాన్ని వాయిదా వేశారు. యుద్ధ పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని గల్ఫ్‌దేశాలు ఆందోళన వ్యక్తం చేసిన తదుపరి ఇరాన్‌లో గురిపెట్టిన లక్ష్యాలను ధ్వంసం చేసే పథకం అమలును వాయిదా వేసినట్లు ట్రంప్ ధృవీకరించారు. రెండు, రష్యా నుంచి క్రూడ్ ఆయిలు దిగుమతిపై అమెరికా విధించిన ఆంక్షలనుంచి భారత్ తదితర దేశాలకు యిచ్చిన మినహాయింపు ముగియటానికి ఒక రోజుముందు భారత ప్రభుత్వం – ఆంక్షలనుంచి మినహాయింపు రానీ రాకపోనీ రష్యా నుంచి ఆయిలు దిగుమతి చేసుకుంటున్నట్లు పెట్రోలియం మంత్రిత్వశాఖ జాయింటు కార్యదర్శి సుజాతా శర్మ సోమవారం ఢిల్లీలో చెప్పారు. గతవారంలో బ్రిక్స్ దేశాల విదేశాంగమంత్రుల సమావేశానికై ఢిల్లీ వచ్చిన రష్యా విదేశాంగమంత్రి భారత్ ఇంధన అవసరాలు పూర్తిగా తీర్చటానికి తమ దేశం సిద్ధంగా ఉందని చెప్పటం గమనార్హం. గతవారంలోనే అధ్యక్షుడు ట్రంప్ చైనా పర్యటనలో, అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చల్లో హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు చైనా సహాయాన్ని కోరటం తెలిసిందే. రష్యా నుంచి ఆయిలు కొనుగోలుపై అమెరికా ఆంక్షలను నిలుపుచేయాలని, ఇరాన్ నౌకాశ్రయాల దిగ్బంధనాన్ని సడలించాలని జిన్‌పింగ్ ట్రంప్‌కు సూచించినట్లు చెప్పబడుతున్నది. తెరవెనుక ఏమి జరిగిందో చెప్పలేముగాని, రష్యా ఆయిలు కొనుగోలుకు భారత్‌పై ఆంక్షల సడలింపును పొడిగిస్తున్నట్లు అమెరికా అధికారులు ప్రకటించారు. మరోవైపున, గల్ఫ్‌యుద్ధంతో హోర్ముజ్ జలసంధి ద్వారా ఆయిలు రవాణాకు ఇబ్బందులెదుర్కొంటున్న భారత్‌కు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి నిమిత్తం అవసరమైన సామాగ్రి, యంత్రాలకోసం చైనాపై ఆధారపడవచ్చని చైనా కమ్యూనిస్టుపార్టీ అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్‌లో ప్రచురితమైన వ్యాఖ్యానం తెలిపింది. భారత్–చైనాల మధ్య ఉద్రిక్తతలు తగ్గి వ్యాపార వృద్ధి దిశగా అడుగులుపడుతున్న ఈ తరుణం లో భారత్‌కు ఇది శుభవార్తే. భారత్ ఇప్పటికే పునరుత్పాదక విద్యుచ్ఛక్తి ఉత్పత్తిపై అధిక శ్రద్ధ పెడుతున్నది.

ఇరాన్ యుద్ధరంగంలో ప్రతిష్టంభన నెలకొని ఉంది. అమెరికా కాంగ్రెస్ అనుమతిలేకుండా 60రోజులకు మించి యుద్ధం కొనసాగించే అధికారం రాజ్యాంగం రీత్యా అధ్యక్షునికి లేనందున, ఆ ప్రమాదం తప్పించుకునేందుకై ట్రంప్ ఇరాన్‌తో యుద్ధలక్ష్యాలు నెరవేరినందున యుద్ధం విరమిస్తున్నట్లు ప్రకటించారు. కాని ఏమి సాధించారో చెప్పుకోలేక ఇరాన్ మెడలువంచేందుకు సైనిక బెదిరింపులకు ఒడిగడుతున్నారు. అమెరికా–ఇరాన్‌లు పైకి గంభీర ప్రకటనలు చేస్తున్నప్పటికీ, పాకిస్థాన్, ఒమన్ మధ్యవర్తులుగా శాంతి ఒప్పందం కోసం ప్రతిపాదనలు ఇచ్చిపుచ్చుకుంటున్నాయి. ట్రంప్ ఇరాన్ విధ్వంస ప్రకటనలను రెండుసార్లు వాయిదా వేయటం వీటి పర్యవసానమే. ఇరాన్‌తో తీవ్రంగా విభేదించే గల్ఫ్ దేశాలు సైతం ఇరాన్‌పై అమెరికా అతి తీవ్ర చర్యను వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే ఇరాన్ నుంచి ఎదురుదాడికి గురయ్యేది ఈ దేశాలే కదా! ట్రంప్‌కు వెనక్కి తగ్గేందుకు ఏదోక పెద్ద రాయితీ కావాలి. హోర్ముజ్ జలసంధిలో స్వేచ్ఛా రవాణాను సాధించాలి లేదా ఇరాన్ వద్ద ఉన్న బాంబు గ్రేడ్ అణు ఇంధనాన్ని అమెరికాకు అప్పగించాలి, అణుశుద్ధిని ఒక యూనిట్‌కు పరిమితం చేయటానికి ఇరాన్ అంగీకరించాలి. కాగా హోర్ముజ్‌పై రాజీపడటానికి ఇరాన్ తిరస్కరిస్తోంది. ఆ జలసంధిలో నౌకాయానాల నియంత్రణకు తాజాగా ఒక కమిటీని నియమించింది. తమ అణు కార్యక్రమంపై చర్చలకు సంసిద్ధత తెలుపుతూ, శాంతిస్థాపన తర్వాత, మళ్లీ దాడి చేయబోమని అమెరికా హామీ యిచ్చినాక అణుశక్తిపై చర్చలు జరుపుదామని ఇరాన్ ప్రతిపాదిస్తున్నది. అధ్యక్షుడు ట్రంప్ మాత్రం బెదిరింపులతో ఇరాన్‌ను లొంగదీసే ఉద్దేశ్యంతో ఒకవైపు అమెరికా ఆయుధ శక్తిని ప్రదర్శిస్తూ, రెండోవైపున దౌత్య ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరాన్ తాజా జవాబులు సంతృప్తికరంగా లేవని అమెరికా అంటోంది. అందువల్ల యుద్ధం పునరుద్ధరణ ప్రమాదం పొంచి ఉంది. శాశ్వత శాంతి ఒప్పందం కుదరనంతకాలం ప్రపంచం మునిగాళ్లపై కూర్చుని నిత్యభయంతో ఎదురుతెన్నులు చూడవలసిందే!



## అదానీ క్లీన్ చిట్‌తో భారత్ ఎంత మూల్యం చెల్లించాల్సి ఉందో?

**అదానీకి అమెరికా క్లీన్ చిట్ ఇచ్చిందన్నది అసలైన వార్త కాదు. క్లీన్ చిట్ బదులుగా ఎంత డబ్బు చెల్లించారనో లేదా ఎంత పెట్టుబడి పెడతాడనేది కూడా వార్త కాదు. అసలు వార్త ఏమిటంటే 'మోదానీ', ట్రంప్ మధ్య ఒక ఒప్పందం కుదిరి ఉంటుంది లేదా ప్రస్తుతం అది కుదిరే దశలో ఉంది. వార్త అనిపించనిదే అసలైన వార్త. ఈ ఒప్పందానికి ప్రతిఫలంగా భారతదేశం ఎంత మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది? దీని పర్యవసానంగా మీరు ఎంతటి భారాన్ని భరించాల్సి వస్తుంది? ఇదే అసలైన వార్త.**

- రాజకీయ వ్యాఖ్యాత యోగేంద్రయాదవ్




## తేనెటీగలు : మానవాళి, పర్యావరణ హితవరులు

అంతర్జాతీయ తేనెటీగల పెంపకందారుల సమాఖ్య చొరవతో ఐరాస సర్వసభ్య సమావేశం నిర్ణయం ప్రకారం ప్రతి ఏటా 20 మే రోజున ప్రపంచ తేనెటీగల దినోత్సవం (వరల్ బీ డే) పాటించడం 2018 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ మానవాళిపై పాటు సకల జీవరాశులు, ధరిత్రి పరిరక్షణలో తేనెటీగల పాత్ర కీలకం అని గుర్తు చేసుకుంటూ ఈ మూగజీవాలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. మానవాళి మనుగడ ప్రతి జీవి ఉనికి అత్యవసరం అని తెలుసుకుంటూ జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో నేటి డిజిటల్ మనిషి కృషి చేయడం కొనసాగించాలి. జీవుల మనుగడకు ప్రమాదం ఏర్పడితే అన్నీ ఉన్నా మనిషికి బతకడానికి ఆరోగ్యం కరువు అవుతుందని తెలుసుకోవాలి. ఆధునిక తేనెటీగల పెంపకంలో మార్గదర్శకుడైన ఆంటోన్ జాన్సా (1734 – 1773) జన్మదినం సందర్భంగా ప్రపంచ తేనెటీగల దినోత్సవం నిర్వహించుకుంటున్నామని గమనించాలి.

**అత్యంత కష్టజీవి తేనెటీగ :**

శతాబ్దాలుగా, ఈ నేలపై అత్యంత కష్టపడి శ్రమించే జీవుల్లో ఒకటైన తేనెటీగలు మనకు, పర్యావరణాలకి ఎంతో మేలును చేస్తున్నాయి. తేనెటీగలు సమకూర్చే తేనె అతి తియ్యని సహజ పోషకాహారం. తేనెటీగలతో పాటు ఇతర క్రిమికీటకాలు ప్రకృతిలో అతి ముఖ్యమైన పరాగ సంపర్కం సుసాధ్యం చేయడానికి నిరంతరం విధిగా నిర్వహిస్తున్నాయి. మనం తీసుకునే ఆహారంలో 75 శాతం కన్న ఎక్కువ పంటలు, 90 శాతం వరకు అడవి పూల మొక్కల జాతులు పరాగ సంపర్కం పైననే ఆధారపడి ఉన్నాయి. పరాగ సంపర్కంతో పాటు పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య పరిరక్షణ లాంటి అతి ముఖ్యమైన విధుల నిర్వహణలో తేనెటీగలు నిమగ్నం అయి ఉన్నాయి. పెరుగుతున్న కాలుష్యం, పురుగు మందులను విచక్షణారహితంగా వాడడం, ఆధునిక వ్యవసాయం, అటవీ నిర్మూలన, పెరుగుతున్న పట్టణీకరణ, మానవ కార్యకలాపాలు, వాతావరణ ప్రతికూల మార్పుల వల్ల తేనెటీగలు అంతరించే ప్రమాదం ఏర్పడింది. తేనెటీగల ప్రాధాన్యం, ప్రయోజనం, పరిరక్షణ పట్ల అవగాహన కల్పించటానికి ఈ వేదికలు ఉపయుక్తంగా ఉన్నాయి. తేనెటీగల సాగు మన జీవనోపాధి కావాలి.

**మానవాళి, భూగ్రహ హితవరి తేనెటీగ :**

ప్రపంచ తేనెటీగల దినోత్సవం–2026 ఇతివృత్తంగా మానవాళి, భూగ్రహంతో తేనెటీగల సమన్వయ జీవనాలు అందరి భాగస్వామ్యంతో సుస్థిరత వైపు అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నేడు తేనెటీగలు, పరాగ సంపర్కాలు, కీటకాల జనాభా తగ్గడం పట్ల మన దృష్టి సారించాలి. తేనెటీగల సంరక్షణకు ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు, పౌర సమాజం వాటి సంరక్షణకు నడుం బిగించాలి. నేడు తేనెటీగల పెంపకం ఒక వ్యవసాయ అనుబంధ వృత్తిగా కొనసాగుతున్నది. తేనెటీగల ఆవాసాలను రక్షించడం, వాటి పెంపకాలను చేపట్టడం, ప్రభుత్వాల ప్రోత్సాహం లాంటివి చేపట్టాలి. తేనెటీగలతో పాటు ఇతర పరాగ సంపర్క క్రిమి కీటకాలు ఎదుర్కొంటున్న ముప్పుల పట్ల అవగాహన కల్పించడం, సుస్థిర పద్ధతుల ద్వారా తేనెటీగలను పరిరక్షించుకోవడం మన లక్ష్యం కావాలి. తేనెను ఆస్వాదించి తేనెటీగలను తేనెటీగల పెంపకాన్ని ఎపికల్చర్ అని పిలుస్తాం. ఇది ఒక వ్యవసాయాధారిత పరిశ్రమ. నేడు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను అందిస్తున్నది. దీని వల్ల తేనె, మైనం లభించడమే కాకుండా తోటల్లో పంట దిగుబడి 30 శాతం వరకు పంచడానికి ఉపయోగపడుతుంది. తేనెటీగలు అంతరించకుండా చూసుకోవడానికి వాటి పరిరక్షణకు నడుం బిగించాలి. ఈగలే కదా అని నిర్లక్ష్యం చేస్తే మన ఆరోగ్యం, ఆహార భద్రతలకు ముప్పు కలుగుతుందని తెలుసుకొని తెలివిగా ప్రవర్తిద్దాం.

*(20 మే ప్రపంచ తేనెటీగల దినోత్సవం సందర్భంగా)*

# సబ్కా సాత్.. సబ్కా వికాస్‌లో బిసిల స్థానం ఎక్కడ?



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

భారత ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయం అనే భావన కేవలం రాజకీయ నినాదం కాదు. అది కోట్లాది అణగారి వర్గాల ఆశలు, ఆవేదనలు, హక్కులు, ఆత్మ గౌరవం, రాజ్యాంగ పరిరక్షణల సమాహారం. ముఖ్యంగా ఇతర వెనుకబడిన వర్గాలు (ఒబిసిలు/బిసిలు) దేశ జనాభాలో అత్యంత పెద్ద వర్గంగా ఉన్నప్పటికీ, అధికార నిర్మాణాల్లో, విద్యా అవకాశాల్లో, ఉద్యోగాల్లో, రాజకీయ ప్రాతినిధ్యంలో తమ జనాభాకు తగిన స్థానం ఇప్పటికీ పొందలేదనే భావన బలంగా పెరుగుతోంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తాను ఒబిసి వర్గానికి చెందిన నాయకుడిగా చెప్పుకుంటూ పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్నప్పటికీ, బిసి సమాజం ఎదుర్కొంటున్న ప్రశ్నలు మాత్రం ఇంకా సమాధానం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఒక బిసి నాయకుడు అధికారంలో ఉండటం మాత్రమే సరిపోతుందా? లేక బిసి సమాజానికి నిజమైన సాధికారత కలిగిందా? అనే ప్రశ్న ఇప్పుడు దేశవ్యాప్తంగా వినిపిస్తోంది.

భారతదేశంలో సామాజిక న్యాయ రాజకీయాలకు కీలక మలుపు తీసుకువచ్చింది, మండల కమిషన్ అమలు. 1979లో ఏర్పాటు చేసిన మండల్ కమిషన్ సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు 27 శాతం రిజర్వేషన్లు సిఫార్సు చేసింది. 1990లో వాటి అమలు భారత రాజకీయాలను శాశ్వతంగా మార్చింది. అయితే మూడు దశాబ్దాలు గడిచినా మండల్ ఆత్మ పూర్తిగా అమలుకాలేదనే విమర్శ కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, ప్రైవేట్ రంగంలో లేవు. న్యాయవ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లేదు. ఉన్నత విద్యాసంస్థల్లో అనేక రిజర్వ్‌డ్ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ప్రమోషన్లలో స్పష్టత లేకపోవడం, కొన్నివర్గాలకే అవకాశాలు కేంద్రీకృతమవుతున్నాయనే విమర్శలు బలపడుతున్నాయి. దీంతో మండల్ రాజకీయాలు నిజంగా సామాజిక న్యాయానికా? లేక ఎన్నికల గణితానికా? అనే ప్రశ్న మళ్లీ ముందుకొస్తోంది.

ఇప్పుడు దేశవ్యాప్తంగా బిసి సమాజం ప్రధానంగా అడుగుతున్న డిమాండ్ కులగణన. ఎందుకంటే జనాభా ఎంత ఉందో తెలియకుండా హక్కుల పంపిణీ ఎలా సాధ్యమవుతుంది? స్వతంత్ర భారతదేశంలో 1931 తర్వాత పూర్తిస్థాయి కులగణన జరగలేదు. ఇప్పటికీ పాత గణాంకాలనే ఆధారంగా చేసుకుని విధానాలు రూపొందించడం పెద్ద విరోధాభాసంగా మారింది. దేశంలో ఒబిసిలు ఎంతమంది ఉన్నారు? ఏ వర్గం ఎంత వెనుకబడి ఉంది? విద్య, ఉద్యోగాలు, భూమి యాజమాన్యం, ఆదాయ స్థాయిలో వారి పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు ఖచ్చితమైన సమాధానాలు లేకుండానే సంక్షేమ విధానాలు అమలవుతున్నాయి. అందుకే డేటా లేకుండా న్యాయం ఎలా? అనే ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోంది. 2025లో కేంద్ర కేబినెట్ జాతీయ జనగణనలో భాగంగా సమగ్ర కులగణన చేపడతామని ప్రకటించడంతో బిసి సమాజంలో ఆశలు పెరిగాయి. కానీ ఆ తర్వాతి ప్రక్రియల్లో స్పష్టత లేకపోవడం అనుమానాలకు దారితీసింది. 2026లో ప్రారంభమైన గృహ లెక్కింపులో ఒబిసి కుటుంబాల ప్రత్యేక గణన స్పష్టంగా కనిపించకపోవడంతో కులగణన నిజంగానే జరుగుతుందా? లేక అది మరో రాజకీయ హామీగానే మిగిలిపోతుందా? అనే సందేహం పెరిగింది. కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడేవారు దేశాన్ని మళ్లీ కులాలుగా విభజిస్తుందని అంటున్నారు. కానీ భారత సమాజం ఇప్పటికీ కులాల ఆధారంగానే అవకాశాలను పంచుకుంటోంది. ఉద్యోగం, వివాహం, రాజకీయ టికెట్, గ్రామీణ సామాజిక సంబంధాలు, అన్నింటిలోనూ కుల ప్రభావం స్పష్టంగానే ఉంది. అలాంటప్పుడు కుల అసమానతలను లెక్కించడం తప్పా? లేక వాటిని దాచిపెట్టడమే తప్పా? అనే ప్రశ్న ప్రభుత్వాల ముందు నిలుస్తోంది.

బిసి మహిళల సమస్య మరింత క్లిష్టమైనది. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయంగా ప్రచారం చేసినప్పటికీ, అందులో ఒబిసి మహిళలకు ప్రత్యేక ఉపకోటా లేకపోవడం తీవ్ర చర్చకు దారితీసింది. సామాజికంగా వెనుకబడిన మహిళల పరిస్థితి, అగ్రవర్ణ మహిళల పరిస్థితితో సమానంగా ఉండదు. గ్రామీణ బిసి మహిళలు కుల, లింగ, ఆర్థిక వెనుకబాటుతనాల మూడంచెల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉపకోటా లేకుండా మహిళా రిజర్వేషన్ అమలు చేస్తే అసలు ప్రయోజనం సామాజికంగా బలమైన వర్గాలకే పరిమితమవుతుందనే భయం బిసి సంఘాల్లో వ్యక్తమవుతోంది. సామాజిక న్యాయం అంటే అందరికీ ఒకే మోతాదు కాదు, అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించడమే అసలు సూత్రం. తెలంగాణ రాష్ట్రం ఈ చర్చలో కీలక కేంద్రంగా మారింది. రాష్ట్రంలో బిసిల జనాభా అధికమని పేర్కొంటూ విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేలా అసెంబ్లీ బిల్లు ఆమోదించింది. కానీ దానిపై కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం రాష్ట్రంలో అసంతృప్తిని పెంచుతోంది. ఇక్కడ ప్రశ్న చాలా స్పష్టంగా ఉంది, ఒకవైపు బిసిల అభ్యున్నతి గురించి మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం, మరోవైపు బిసి రిజర్వేషన్ల పెంపుపై ఎందుకు వెనుకంజ వేస్తోంది? రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును ఎందుకు ఆమోదించడం లేదు?

రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితి కూడా మరో పెద్ద చర్చ. ఇందిర సాహ్నీ తీర్పు తర్వాత ఈ పరిమితి అమల్లోకి వచ్చింది. కానీ ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి జనాభా కలిపి భారీ శాతంలో ఉన్నప్పుడు ఈ పరిమితి సామాజిక న్యాయానికి అడ్డంకిగా మారుతోందని అనేక సంఘాలు వాదిస్తున్నాయి.ఇదే సమయంలో కేంద్రం ఆర్థిక బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లు కల్పించింది. అంటే రాజ్యాంగ సవరణల ద్వారా కొత్త రిజర్వేషన్లు ఇవ్వగల సామర్థ్యం ప్రభుత్వానికి ఉందని ఇది చూపించింది. అయితే జనాభా ఆధారంగా ఒబిసి రిజర్వేషన్ల పెంపుపై మాత్రం స్పష్టత లేకపోవడం ప్రశ్నలను మరింత పెంచింది. బిసిల కోసం ప్రత్యేక ఒబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా బలపడుతోంది. దేశంలో అనేక వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉన్నప్పటికీ, జనాభాలో అతిపెద్ద వర్గమైన ఒబిసిల కోసం సమగ్ర విధానాలు రూపొందించే శక్తివంతమైన ప్రత్యేక వ్యవస్థ ఇంకా లేదు. ఇది కేవలం పరిపాలనా సమస్య కాదు, విధాన ప్రాధాన్యతకు సూచిక. బడ్జెట్ కేటాయింపుల విషయంలో కూడా బిసి సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. దేశ జనాభాలో భారీ శాతం ఉన్న ఒబిసిల సంక్షేమానికి కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. బిసి విద్యార్థుల హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి, సంప్రదాయ వృత్తుల ఆధునికీకరణ, చిన్న వ్యాపారాలకు రుణాలు వంటి అంశాల్లో సమగ్ర దృష్టి కనిపించడం లేదని అనేక సంస్థలు చెబుతున్నాయి. ఒబిసిలకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలన్న డిమాండ్ కూడా వేగంగా ముందుకు వస్తోంది. ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టిలకు పార్లమెంట్, అసెంబ్లీల్లో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, ఒబిసిలకు అలాంటి రాజ్యాంగ రక్షణ లేదు. పార్టీలు టికెట్లు ఇవ్వడం వారి రాజకీయ లెక్కలపై ఆధారపడి ఉంటుంది, అది రాజ్యాంగ హామీ కాదు. అందుకే జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి.

తెలంగాణ విభజన హామీల అంశం కూడా ఈ చర్చలో కీలకంగా మారింది. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, గిరిజన విశ్వవిద్యాలయం వంటి హామీలు పూర్తిగా అమలుకాలేదనే భావన రాష్ట్రంలో బలంగా ఉంది. ముఖ్యంగా బిసి వర్గాలు అభివృద్ధి, ఉపాధి అవకాశాల పరంగా తమకు న్యాయం జరగలేదని భావిస్తున్నాయి. బిసి రాజకీయాల పరిణామాన్ని పరిశీలిస్తే ఒక ముఖ్యమైన విషయం స్పష్టమవుతుంది. ఒకప్పుడు ప్రాంతాలు, కులాలు, వృత్తుల ఆధారంగా విభజించబడి ఉన్న బిసి వర్గాలు ఇప్పుడు సమగ్ర రాజకీయ చైతన్య దిశగా కదులుతున్నాయి. ఉత్తర భారతంలో మండల్ ఉద్యమం ఈ మార్పుకు కారణమైతే, దక్షిణ భారతంలో సామాజిక న్యాయ ఉద్యమాలు ఈ చైతన్యానికి పునాది వేశాయి. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న మార్పులు కూడా బిసి రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. సంప్రదాయ వృత్తులు సంక్షోభంలో ఉన్నాయి. గ్రామీణ ఉపాధి తగ్గుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు క్షీణిస్తున్నాయి. ప్రైవేటీకరణ పెరుగుతోంది. విద్య ఖరీదైపోతోంది. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్లు మాత్రమే కాకుండా ఆర్థిక సాధికారత కూడా అత్యంత కీలకంగా మారింది.

బిసి యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ఇదే ప్రధాన కారణం. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగం సామాజిక ఎదుగుదలకు ప్రధాన మార్గం. కానీ ఇప్పుడు కాంట్రాక్ట్ విధానం, ప్రైవేటీకరణ కారణంగా అవకాశాలు తగ్గుతున్నాయి. అందుకే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ శిక్షణ, చిన్న వ్యాపారాలకు ఆర్థిక మద్దతు వంటి అంశాలు మరింత ప్రాధాన్యం పొందుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, పిఎం ఆవాస్ యోజన, జన్ ధన్ వంటి పథకాలు బిసి వర్గాలకు కూడా ప్రయోజనం చేకూర్చాయి. కానీ బిసి సంఘాల వాదన ఏమిటంటే, సాధారణ పేదరిక నిర్మూలన పథకాలు మాత్రమే సరిపోవు. సామాజిక వెనుకబాటుతనాన్ని ఎదుర్కొనే ప్రత్యేక విధానాలు కూడా అవసరం.

ఒక గ్రామీణ బిసి కుటుంబానికి గ్యాస్ కనెక్షన్ రావడం మంచిదే. కానీ అదే కుటుంబానికి ఉన్నత విద్యలో అవకాశం లేకపోతే, ఉద్యోగంలో ప్రాతినిధ్యం లేకపోతే, రాజకీయ నిర్ణయాల్లో స్థానం లేకపోతే పూర్తి సామాజిక సమానత్వం ఎలా సాధ్యమవుతుంది? అనే ప్రశ్న నిలుస్తోంది.

బిసి వర్గాల్లో అంతర్గత అసమానతల చర్చ కూడా పెరుగుతోంది. కొన్ని బలమైన కులాలు ఎక్కువ అవకాశాలు పొందుతున్నాయని, అత్యంత వెనుకబడిన వర్గాలు ఇంకా అంచుల్లోనే ఉన్నాయని విమర్శలు ఉన్నాయి. అందుకే ఉపవర్గీకరణ అంశం కూడా ముందుకు వచ్చింది. కానీ దీనిపై జాతీయ స్థాయిలో స్పష్టమైన విధానం కనిపించడం లేదు.

తెలంగాణలో బిసి రాజకీయ చర్చ ఇప్పుడు కేవలం రిజర్వేషన్లకే పరిమితం కావడం లేదు. ఆర్థిక వనరుల పంపిణీ, డిజిటల్ అవకాశాలు, విద్యా ప్రాప్తి, సంప్రదాయ వృత్తుల ఆధునికీకరణ, మహిళా సాధికారత, చిన్న పరిశ్రమల ప్రోత్సాహం వంటి విస్తృత అంశాలకు విస్తరిస్తోంది.

ప్రస్తుతం భారత రాజకీయాల్లో గుర్తింపుల రాజకీయాలు బలంగా ఉన్నాయి. ఒక వర్గానికి చెందిన నాయకుడిని ముందుకు తెచ్చి ఆ వర్గ మద్దతు పొందడం సాధారణ వ్యూహంగా మారింది. కానీ ప్రతీకాత్మక ప్రాతినిధ్యం మరియు వాస్తవ సాధికారత మధ్య పెద్ద తేడా ఉంది.

> *బిసి సమాజం అడుగుతున్న ప్రశ్నలన్నీ చివరికి అదే రాజ్యాంగ సూత్రాన్ని గుర్తు చేస్తున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎన్నికల సభల ప్రసంగాల్లో కాదు, చట్టాల్లో ఉండాలి. బడ్జెట్‌లలో ఉండాలి. విధానాల్లో ఉండాలి. సంస్థల్లో ఉండాలి. అమల్లో కనిపించాలి. అప్పుడే సబ్కా సాథ్, సబ్కా వికాస్ అనే నినాదం నిజమైన అర్థం పొందుతుంది. అప్పుడే ఒక బిసి నాయకుడు అధికారంలో ఉండటం సామాజిక న్యాయ చరిత్రలో నిజమైన మలుపుగా నిలుస్తుంది. లేకపోతే అది కేవలం రాజకీయ ప్రతీకగా మాత్రమే మిగిలిపోతుంది.*

ఒక బిసి నాయకుడు ప్రధానమంత్రి కావడం చారిత్రాత్మకమే కావచ్చు. కానీ అదే సమయంలో బిసి వర్గాల విద్యా స్థాయి, ఉద్యోగ ప్రాతినిధ్యం, భూమి యాజమాన్యం, ఆదాయ స్థాయి, రాజకీయ శక్తి పెరిగిందా? అనే ప్రశ్నలకు గణాంకాలతో సమాధానం చెప్పాల్సిందే.ప్రస్తుతం బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్న చివరికి ఒక్కటే, మా జనాభాకు తగ్గ హక్కులు ఎక్కడ? ఇది కేవలం ఎన్నికల సంఖ్యల రాజకీయమే కాదు. అవకాశాల సంఖ్య, ఉద్యోగాల సంఖ్య, విద్యా సీట్ల సంఖ్య, బడ్జెట్ కేటాయింపుల సంఖ్య, రాజకీయ ప్రాతినిధ్యం గురించి కూడా.

బిసి మహిళల ప్రశ్న, విద్యా అసమానతలు, ఆర్థిక వెనుకబాటుతనం, ప్రైవేటీకరణ ప్రభావం, ఇవన్నీ కలిపి సామాజిక న్యాయ చర్చను మరింత లోతుగా తీసుకెళ్తున్నాయి. అందుకే ఇప్పుడు బిసి సమాజం కేవలం సంక్షేమ పథకాలు కాదు, పాలనా నిర్మాణాల్లో భాగస్వామ్యం కోరుతోంది. కేవలం ఎన్నికల హామీలు కాదు,అమలు కోరుతోంది. కేంద్ర ప్రభుత్వం కులగణనపై స్పష్టమైన టైమ్‌లైన్ ఇవ్వాలి. బిసి రిజర్వేషన్లపై స్పష్టమైన విధానం ప్రకటించాలి. మహిళా రిజర్వేషన్‌లో ఉపకోటా అంశంపై చర్చ జరపాలి. ప్రత్యేక ఒబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు, బడ్జెట్ కేటాయింపుల పెంపు, తెలంగాణ విభజన హామీల అమలు వంటి అంశాల్లో స్పష్టత తీసుకురావాలి. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలకూ బాధ్యత ఉంది. బిసి రాజకీయాలను కేవలం ఎన్నికల నినాదాలుగా కాకుండా, దీర్ఘకాలిక సామాజిక మార్పు కార్యక్రమాలుగా చూడాలి. విద్య, ఆరోగ్యం, ఉపాధి, డిజిటల్ ప్రాప్తి, మహిళా సాధికారత, సంప్రదాయ వృత్తుల ఆధునికీకరణపై సమగ్ర దృష్టి అవసరం. తెలంగాణలో పెరుగుతున్న బిసి చైతన్యం దేశ రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది. ఎందుకంటే ఇది కేవలం ఒక రాష్ట్ర సమస్య కాదు. ఉత్తరప్రదేశ్ నుంచి తమిళనాడు వరకు, బీహార్ నుంచి కర్ణాటక వరకు ఒబిసి రాజకీయాలు భారత ఎన్నికల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. భారత ప్రజాస్వామ్యం ఇప్పుడు ఒక కీలక దశలో నిలిచింది. సంఖ్యల ఆధారంగా నిజమైన ప్రాతినిధ్యాన్ని అందిస్తుందా? లేక ప్రతీకాత్మక రాజకీయాలతోనే కొనసాగుతుందా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు హక్కు కాదు. అది సమాన అవకాశాలు, సమాన గౌరవం, సమాన ప్రాతినిధ్యం. బిసి సమాజం అడుగుతున్న ప్రశ్నలన్నీ చివరికి అదే రాజ్యాంగ సూత్రాన్ని గుర్తు చేస్తున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎన్నికల సభల ప్రసంగాల్లో కాదు, చట్టాల్లో ఉండాలి. బడ్జెట్‌లలో ఉండాలి. విధానాల్లో ఉండాలి. సంస్థల్లో ఉండాలి. అమల్లో కనిపించాలి. అప్పుడే సబ్కా సాథ్, సబ్కా వికాస్ అనే నినాదం నిజమైన అర్థం పొందుతుంది. అప్పుడే ఒక బిసి నాయకుడు అధికారంలో ఉండటం సామాజిక న్యాయ చరిత్రలో నిజమైన మలుపుగా నిలుస్తుంది. లేకపోతే అది కేవలం రాజకీయ ప్రతీకగా మాత్రమే మిగిలిపోతుంది.

# దేశాన్ని కష్టాల్లోకి నెట్టి - పొదుపు మంత్రాన్ని జపిస్తున్న మోదీ!

మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారు హైదరాబాద్ పర్యటనలో భాగంగా మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మాట్లాడుతూ దేశప్రజలకు దేశ ఆర్థిక పరిస్థితి వివరిస్తూ పెరుగుతున్న చమురుధరలు ద్రవ్యోల్బణంతో క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న దృష్ట్యా పౌరులు దుబారాల అదుపు, పొదుపు చర్యలు తీసుకోవాలంటూ కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు. వారు పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, అమెరికా ఇరాన్ యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రపంచం పైన, మన దేశం పైన ప్రతికూల ప్రభావాన్ని చూపి పౌరుల్ని కఠిన నిర్ణయాలకు సిద్ధమవ్వాలని చెప్పడమంటే ఎప్పుడు? ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెనువెంటనే! పోనీ, ముందుగా ప్రభుత్వం కొన్ని దుబారా నియంత్రణ, పొదుపు చర్యలు చేపట్టి మార్గదర్శకంగా నిలస్తున్న తర్వాతే పౌరుల్ని కోరిందా? అంటే, అది లేదు! అమెరికా ఇరాన్ వార్ రెండున్నర మాసాలుగా కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ హోర్ముజా జలసంధి మూసివేయడంతో ఆయిల్ ధరలతో పాటు రవాణాలో తీవ్ర జాప్యంతో ధరలు పెరుగుతున్నవి. భారత్‌పై తీవ్ర ప్రభావం ఉంటున్నదని పార్లమెంటులో చర్చల సందర్భంగా ప్రతిపక్షాలు అనేక సూచనలు చేసినప్పటికీ.. ప్రధాని మోదీ మాత్రం తగిన నిల్వలున్నాయి ధరలు పెంచబోమని చెప్పిండే తప్పా ఎలాంటి పొదుపు చర్యలు తీసుకోక పోగా..5 రాష్ట్రాలు ఎన్నికలు జరిగిపోయిన తరువాత ఆయిల్ పైన ఇతర సరుకుల పైన ధరలు పెంచడం మొదలైంది. ఇది ప్రధాని మోదీ అవలంబించిన రాజకీయ అవకాశవాదం. గత 12 సంవత్సరాలుగా మోదీ అనుసరిస్తున్న విధానాలను పరిశీలించితే... 2014లో మోదీ అధికారంలోనికి వచ్చినప్పుడు ఐదేళ్లలో ప్రజలకు ప్రశాంతమైన, పారదర్శకమైన జీవితాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.2016లో అర్ధరాత్రి ఆగమేఘాలపై పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు 50 రోజులు గడువు కోరారు. అప్పుడు ప్రారంభమైన దేశ ఆర్థిక వ్యవస్థ పతనం, కోవిడ్ కాలంలో మరింత క్షీణించింది. ఇటీవలి కాలంలో రష్యా ఉక్రేన్ యుద్ధం, ట్రంపు ప్రతీకార సుంకాలు, వలసల వ్యతిరేక విధానాలు, తాజాగా అమెరికా ఇరాన్ యుద్ధంతో మన దేశం అన్ని రంగాల్లో వెనుకబాటు పట్టడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి దాపురించింది. నిన్న మొన్నటి వరకు దేశం మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతున్నదని, జిడిపి, బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నదని గొప్పలు చెప్పుకొని జబ్బలు చరుచుకున్న కేంద్ర పాలకులు యూటర్న్ తీసుకున్నారు. ఆర్థిక రంగ వైఫల్యం పై ఆరోపణల నుంచి బయటపడేందుకు 'చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు' ప్రధాని ఇప్పుడు పొదుపు సూత్రాలు వల్లించారు. ఏడాది పాటు బంగారం కొనకుండా ఆపేయాలి, పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలి, ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపాలి. అలా చేస్తే విదేశీ మారక నిలువలు పెరుగుతాయి, వ్యవసాయంలో రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించాలని, వ్యవసాయం లో డీజిల్ పంపుల స్థానంలో సోలార్ పంపులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వ్యక్తిగత వాహనాలను తగ్గించి ప్రజా ట్రాన్స్ పోర్ట్ ను ఉపయోగించాలని నీతి సూత్రాలను వల్లించా రు. ఈ పొదుపు చర్యలను మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుండే చేపడితే బాగుండేదని.. వారికి ఇప్పుడు గుర్తొచ్చిందా! అని అడుగుతున్నారు. ఇంధన సంక్షోభ పరిస్థితుల నేపథ్యం లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య భారీగా తగ్గించి.. కేవలం రెండు వాహనాల కాన్వాయ్ తోనే ప్రయాణిస్తున్నారు. పొదుపు మంత్రం పాటించాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చిన వేళ తానే స్వయంగా పాటిస్తున్నారని, బిజెపి పాలిత రాష్ట్రాలలో ఆచరించాలని, ఇప్పటికే ఏపి, తెలంగాణలో వాహనాల వాడకాన్ని తగ్గిస్తున్నారని వార్తలొస్తున్నాయి. ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల వాడకం తగ్గించుకుంటే ఇంకా మంచిది.

**ధరల పెరుగుదలకు నాంది:**

ఈ నెల 14 అర్ధరాత్రి నుండి గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందు. దీని ప్రభావంతో ఇక నిత్యావసర వస్తువులు, ఎరువులు ధరలు పెరిగి దేశ ప్రజానీకం యావత్తు ముప్పు తిప్పలు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదేనా మోదీ 12 ఏండ్ల పాలనలో ప్రజలకు ఇచ్చే అచ్చే దిన్? ఏమి కొనాలి, ఏం తినాలి అనే స్థాయికి దేశం దిగజారింది. నిరుద్యోగం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, ఉపాధి లేమితో లక్షలాది కుటుంబాలు కునారిల్లుతున్నాయి. పుండుమీద కారం చల్లినట్టు మోదీ పొదుపు సూత్రాలు ప్రజల్లో మరిన్ని భయాలు సృష్టిస్తున్నాయి.

60 ఏళ్లపాటు కాంగ్రెస్ పాలనలో దేశం ఏమీ అభివృద్ధి చెందలేదని చెప్పి, 2014 లో కేంద్రంలో గద్దె ఎక్కిన మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ 12 ఏళ్ల పాలనలో ఏమి సాధించిందో ఇకనైనా తెలపాలి. 2014లో రూపాయి మారక విలువ డాలర్‌తో పోలిస్తే 55 రూపాయలుగా ఉంటే.. నేడు రూ.96కు పతనమైంది. మోదీ అధికారం చేపట్టిన నాటికి విదేశీ రుణం 446 బిలియన్ డాలర్లు ఉంటే.. నేడు 755 బిలియన్ డాలర్లకు చేరుకుంది. నాడు ప్రతి భారతీయుడిపై రూ.48,296 అప్పు ఉంటే ఇప్పుడు రూ.1,48,000 ఉన్నది. మోదీ దేశాన్ని మరిన్ని కష్టాల గోతిలోకి నెట్టారు. కానీ ఇంకా సమయం అడుగుతూనే ఉన్నారు. తీరా ఇప్పుడు దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు వికసిత్ భారత్ 2047 వరకు గడువు కోరుతున్నారు. ప్రధాని మోదీ స్వభావాన్ని 12 ఏండ్లుగా గమనిస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. విజయము ఆయన ఖాతాలో, వైఫల్యాలను ఇతరుల ఖాతాలో జమ చేయడం ఆయన థియరీ. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమై సుమారు రెండున్నర నెలలు గడుస్తున్నా, యుద్ధంతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు మోదీ సరియైన చర్యలు తీసుకోలేదు.

దేశంలో ఏదైనా సంక్షోభం వస్తే చేతులెత్తేయడం, నీటుగా దేశభక్తి ముసుగు తొడిగి మోదీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం కోవిడ్ కాలంలో, నేడు పశ్చిమాసియా సంక్షోభంలో ఇదే ధోరణి మోదీ ప్రదర్శిస్తున్నారు. ఆత్మ నిర్భర్ భారత్, గతి శక్తి, స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్ వంటి నినాదాలతో దేశం పరుగులు పెడుతున్నదని లేని గొప్పలు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. సమస్యలు, సంక్షోభాలు ఏర్పడితే చాకచక్యంగా వ్యవహరించి తప్పించుకుంటారు. మోదీ పాలనలో కార్పొరేట్ దిగ్గజాలు భారీ సంపదను పోగేసుకుంటున్నాయి. కానీ సుమారు 80 శాతం ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు ఏమీ మెరుగుపడలేదని పలు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని పాలకులకు ధ్యాస లేదు. అందువల్లనే మన దేశాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ గాలి బుడగలా తయారయింది.

మహనీయుడు లెనిన్ ఇలా చెప్పాడు 'పాలకుల విధానాలు, మాటల్లోని అంతరార్థం ప్రజలు గ్రహించలేనంత కాలం మళ్ళీమళ్ళీ మోసపోతూనే ఉంటారు'. సుమారు శతాబ్దం క్రితం ఆయన చెప్పిన మాటలు నేటికీ వాస్తవమే కదా.

ఉజ్జిని రత్నాకర్ రావు,
9490952646

పెట్రోల్ డీజిల్ ధరలు

# మళ్లీ పెంచడం దారుణం

## ధరలు నియంత్రించకుంటే బిజెపి పతనం తప్పదు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** పెట్రోల్, డీజిల్ ధరలను ఒకవైపు తగ్గించాలని ప్రజలు ఆందోళన చేస్తుండగా మళ్లీ ధరలను పెంచడం దారుణమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పెట్రోల్, డీజిల్ చార్జీలను మూడు రోజుల క్రితమే మూడు రూపాయలు పెంచిన బిజెపి ప్రభుత్వం, మళ్లీ మంగళవారం పెట్రోల్, డీజిల్ పై 90 పైసలు పెంచడం దారుణమని శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని అన్నారు. పెట్రో ధరల పెంపుతో రవాణా, నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పది రోజుల క్రితం వాణిజ్య, గృహ వినియోగ సిలిండర్ ధరలను భారీగా పెంచి కనికరం లేకుండా సామాన్య ప్రజలపై బిజెపి ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని అన్నారు. గడిచిన 12 ఏళ్లుగా ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పాలకులు ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరూ నిరసించాలని పిలుపునిచ్చారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించని ఎడల ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని, లేని పక్షంలో బిజెపి పతనం ఖాయమని అన్నారు.

హుజూర్‌నగర్ ఫుడ్‌పార్క్ భూనిర్వాసితులకు

# ఎకరాకు రూ.40 లక్షల పరిహారం

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పశ్యపద్మ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలో నిర్మించనున్న ఫుడ్ పార్క్ కోసం1041 సర్వే నంబర్‌లో పలువురి రైతులను నుంచి సేకరిస్తునన 138 ఎకరాలకు గాను ఎకరాకు రూ.40లక్షల చొప్పున భూ పరిహారాన్ని అందించడంతో పాటు రైతుల ప్రయోజనాలను కాపాడాలని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ విజ్ఞప్తి చేశారు. మంగళవారం పశ్యపద్మ నేతృత్వంలో భూమిని కొల్పోతున్న పలువురు రైతులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పశ్యపద్మ మాట్లాడుతూ ఫుడ్ పార్క్ కోసం సేకరిస్తున్న 138 ఎకరాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ప్రస్తుత మార్కెట్ విలువ కంటే చాల తక్కువగా ఉందన్నారు. మరోవైపు భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులు తమ జీవనాధారాన్ని కొల్పోయిన తర్వాత వారి కుటుంబాల భవిష్యత్తు , జీవనోపాధి దెబ్బ తినే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో రైతులకు గౌరవప్రదంతో కూడిన న్యాయమైన పరిహారం అందించాల్సిన అవసరముందని మంత్రికి వివరించారు. అదేవిధంగా ఫుడ్ పార్క్‌ను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఏర్పాటు చేయడంతో పాటు సేకరించిన ఈ భూముల్లో కేవలం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను మాత్రమే నెలకొల్పాలని కోరారు. ఎట్టి పరిస్థితులోని కాలుష్యాన్ని కలిగించే పరిశ్రమలను అనుమతించరాదని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భూములు కోల్పోతున్న రైతుల్లో ఎవరికైనా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆసక్తి ఉంటే వారికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని పశ్యపద్మ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

85 వేల టన్నుల సామర్థ్యంతో

# అత్యాధునిక గిడ్డంగుల నిర్మాణం

### టిజి ఆగ్రోస్- టిజి వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మధ్య ఒప్పందం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర గిడ్డంగులకార్పొరేషన్ 85 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో అత్యాధునిక గిడ్డంగులకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకు సంబంధించి మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో టిజి ఆగ్రోస్ టిజి వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఒయూ) కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా 23 ఎకరాల ప్రభుత్వ భూమిలో టిజి వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ సొంత నిధులతో 15 నెలల్లో 85 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆధునిక గిడ్డంగులను నిర్మించనుంది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులు తమ పంట ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ గిడ్డంగులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మార్కెట్ పరిస్థితులను అనుసరించి రైతులు సరైన సమయంలో తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.అలాగే ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించడంలో కూడా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు. భూముల మార్పిడి ద్వారా ప్రభుత్వ ఆస్తులు సమర్థవంతంగా వినియోగంలోకి రావడంతో పాటు రైతులకు మరింత మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.రాష్ట్రంలో వ్యవసాయ మౌలిక వసతుల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపర్చేందుకు మరిన్ని చర్యలు చేపడతామని మంత్రి స్పష్టం చేశారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని

# మీడియా వృత్తిదారులు ముందుకు సాగాలి

### పలువురు సీనియర్ జర్నలిస్టులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు కొనసాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీ అనుబంధ సభ్యులు పాల్గొన్నారు. మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి.ముకుంద్ రెడ్డి జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. సమావేశంలో ఐ.వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని పుస్తకాలను అకాడమికి అందజేస్తానని తెలిపారు. మాజీ ఎంఎల్‌సి అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమికి కృతజ్ఞతలు తెలిపారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమి డిజిటల్ క్లాసులు, ఇంక్యూబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో కాలానుగుణ మార్పులు అవసరమని, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని తెలిపారు. మహిళా జర్నలిస్టులు, గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పలువురు వక్తలు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మక్కెన సుబ్బారావు, కె.రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్.నాగేష్ కుమార్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్, దిలీప్ రెడ్డి, మాడభూషి శ్రీధర్, జగన్, ఆర్.వి.రామారావు, ఎస్.వినయ్ కుమార్, వై.నరేందర్ రెడ్డి, కె.విరాహత్ అలీ తదితరులు పాల్గొని మీడియా రంగంలో వస్తున్న మార్పులు, డిజిటలైజేషన్, జర్నలిస్టుల శిక్షణ, మీడియా చట్టాలు, సోషల్ మీడియా ప్రభావం, పుస్తక ప్రచురణలు, అకాడమి భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ, డిజిటలైజేషన్, మీడియా ఆధునీకరణ దిశగా అకాడమీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమావేశానికి హాజరైన ప్రముఖులందరిని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు శాలువాలతో సత్కరించారు.



జిహెచ్‌ఎంసి ఉద్యోగులు, కార్మికుల..

# సమస్యల పరిష్కారంపై చొరవ చూపండి

### ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కోరిన ఎంఎస్‌ఎంయు అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ అయిన తెలంగాణ జన సమితి (టిజెఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టియుసి) వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు యూనియన్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఏ.వి.ఎస్. గాంధీ, సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కె. రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ఎస్. ఉమేష్ బాబుతో పాటు మహమ్మద్ రఫీక్, జహీరుద్దీన్, మురళి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. జిహెచ్‌ఎంసి ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రొఫెసర్ కోదండరామ్‌తో ఆదిల్ షరీఫ్ చర్చించారు. ఈ సమస్యలను జిహెచ్‌ఎంసి యాజమాన్యం, తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చొరవ చూపాలని వారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కోరారు.

# పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు




### మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రభుత్వం సబ్సిడి ద్వారా అందిస్తున్న పచ్చి రొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను రైతులు విస్తృతంగా వినియోగించి భూమిలో సేంద్రియ పదార్థాల శాతాన్ని పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రి పంటల సాగులో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలు, భూసారం పెంపు చర్యలు, అధిక ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కల్పించారు. పచ్చి రొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసర పంటలను దున్నిపెట్టడం ద్వారా భూమి సారవంతం అవుతుందని, రసాయన ఎరువుల అవసరం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. పచ్చిరొట్ట పంటల వినియోగంతో యూరియా వాడకం తగ్గడమే కాకుండా, యూరియా వాడినప్పటికంటే ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని మంత్రి తెలిపారు. దీని వల్ల రైతుల సాగు ఖర్చులు తగ్గి, భూమి ఆరోగ్యం మెరుగుపడి, దీర్ఘకాలంలో అధిక ఉత్పాదకత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 1.26 లక్షల ఎకరాల నల్లబీడు (ఆల్కలైన్) భూములు ఉన్నాయని, ఇలాంటి భూముల్లో జిప్సం వినియోగించడం ద్వారా నేల గుణాత్మకత మెరుగుపడి, సాగుకు అనుకూలంగా మారుతుందని చెప్పారు. భూమి సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు అనుసరించడంలో రైతులు ముందుండాలని పిలుపునిచ్చారు.రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా అధిక దిగుబడి, అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు.ఈ సందర్భంగా మంత్రి పలువురు రైతుల అభిప్రాయాలను ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. గోపి, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత విమర్శలు కాదు.. రైతుల కోసం మాట్లాడండి

### మంత్రి అడ్లూరి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి ఎంపి అరవింద్ కుటుంబ రాజకీయ ప్రస్థానం మొదలైందే కాంగ్రెస్ పార్టీతో అని అలాంటి వ్యక్తి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని మాట్లాడటం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ధర్మపురి అరవింద్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడారు. ప్రజా సమస్యలు, రైతాంగం, కేంద్ర నిధులు, రాష్ట్ర హక్కులపై మాట్లాడాల్సిన బాధ్యత గల ప్రజాప్రతినిధులు దానిని విస్మరించి ఇతరులను వ్యక్తిగతంగా విమర్శించడం సరికాదని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బిజెపిలా ఎవరో నాగపూర్‌లో కూర్చొని జారీ జేసే ఆదేశాలను అమలు చేసే పార్టీ కాంగ్రెస్ కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను కలుపుకొని నడిచే ప్రజాస్వామ్య పార్టీ అని స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి తమ్ముళ్లను ఉద్దేశించి ఎంపి అరవింద్ మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుబట్టిన మంత్రి నిజామాబాద్‌లో మీ తమ్ముళ్లు చేస్తున్న అరాచకాలపై తాము మాట్లాడలేమా? అని ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై మాట్లాడాలని, వారికి చేతనైతే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మొక్కజొన్నకు మద్దతు ధర ఇప్పించాలని మంత్రి డిమాండ్ చేశారు. మూడోసారి అధికారంలోకి వస్తామని అహంకారంగా మాట్లాడిన పార్టీ మెడలు వంచి, ప్రజలను ఒప్పించి, ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారంలోకి వచ్చిన నాయకుడు రేవంత్ రెడ్డి అని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి సామాన్య జీవితం నుంచి ఎదిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిలిచిన బలమైన నాయకుడన్నారు.

**టచ్‌లో ఉన్న కాంగ్రెస్ నేతల పేర్లను జగదీష్‌రెడ్డి బయటపెట్టాలి**

బిఆర్‌ఎస్‌తో టచ్‌లో ఉన్న కాంగ్రెస్ నేతల పేర్లను మాజీమంత్రి జగదీష్‌రెడ్డి బయట పెట్టాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇతర పార్టీలపై విమర్శలు చేయడం కాదని ముందు వాళ్ల కుటుంబ తగాదాలు సరిచేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేశామని మంత్రి తెలిపారు. మిగిలిన రెండు గ్యారంటీలను కూడా దశలవారీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీతనం ముఖ్యం. వ్యక్తిగత విమర్శలు కాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సమస్యలు, రైతాంగ సమస్యలు, రాష్ట్ర హక్కుల కోసం మాట్లాడితే ప్రజలు గౌరవిస్తారు అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు.

# త్వరలో మండల స్థాయిలో సిఎం ప్రజావాణి: డాక్టర్ జి.చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర, జిల్లా స్థాయిలో కొనసాగుతున్న ప్రజావాణిని డివిజన్ స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం విస్తరించిందని, రానున్న కాలంలో మండల స్థాయిలో కూడా ప్రజావాణిని నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని సిఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలో ప్రజావాణి అమలు తీరుపై పైలెట్ ప్రాజెక్టు నివేదికను చిన్నారెడ్డి, సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రగతిశీల భావజాలం ఉంటే ప్రజావాణికి వచ్చే సమస్యల మూలాలు అర్థమై వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. ప్రజావాణికి వివిధ సమస్యలతో వచ్చే దరఖాస్తుదారుల పట్ల అధికారులు, సిబ్బంది సానుకూల ధోరణితో స్పందించాలని, అప్పుడే పిటిషనర్ల ముఖంలో సంతోషం చూడగలుగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హర్ష, ఆనందిత, అభిషేక్, అఖిల్, సిఎం ప్రజావాణి అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి

# తీసుకురాగల నాయకుడు రేవంత్‌రెడ్డి

### ఎంపి మల్లు రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగల నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, దక్షిణాదిలో పార్టీ బలోపేతం కోసం ఆయన కృషి చేస్తున్నారని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి తెలిపారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆనంతుల శ్యామ్ మోహన్, ఈరవత్రి అనిల్, చరణ్ కౌశిక్ యాదవ్, బాలరాజులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, తెలంగాణ వెస్ట్ బెంగాల్ లేదా బీహార్ కాదని, ఇక్కడ సిఎంగా ఉన్నది రేవంత్ రెడ్డి అని అన్నారు. జిహెచ్‌ఎంసి కార్పొరేటర్ అభ్యర్థులుగా ఎవరికి వారు ప్రకటించుకోవడం, యూత్ కాంగ్రెస్ నేతలు తామే పోటీ చేస్తున్నట్లు ప్రచారం చేయడం పార్టీ దృష్టికి వచ్చిందని, ఇలాంటి చర్యలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని మల్లు రవి స్పష్టం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఫిర్యాదు మేరకు రామసహాయం కృష్ణ కిషోర్ రెడ్డి, హరిప్రసాద్‌ల వాదనలు విన్నామని, పార్టీ బలోపేతానికి కలిసి పనిచేస్తామని ఇద్దరు నేతలు హామీ ఇచ్చారని వెల్లడించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు సంబంధించిన వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుంటుందని తెలిపారు.

# ఎస్ఎఫ్, వైఎఫ్ మాజీ నాయకులు మోటూరు కృష్ణప్రసాద్ మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత జాతీయ ఉద్యమ జాతీయ కన్వీనర్, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ మాజీ నాయకులు మోటూరు కృష్ణ ప్రసాద్ (68) మంగళవారం తెల్లవారు జామున మరణించారు. ఆయన అంత్యక్రియలు ఈనెల 21వ తేదీన పురానాపూల్‌లోని స్మశాన వాటికలో జరగనున్నాయి. విద్యార్థి దశలో ఎఐఎస్‌ఎఫ్‌లో చేరిన కృష్ణ ప్రసాద్ హైదరాబాద్ నగరంలో స్టూడెంట్ ఫెడరేషన్ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఉర్దూ, ఆంగ్లం, హిందీ, భాషలలో ప్రావీణ్యం కల్గిన కృష్ణ ప్రసాద్ మంచి వక్త, సాహితీ అభిమాని. మేధావిగా, సైంటిస్టుగా అనేక పరిశోధనలు చేసి సైన్స్ అభివృద్ధి కి తన సేవలను అందించారు. పరిశోధనలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న పీడన వివక్ష అసమానతలపై పోరు చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో భాగమయ్యాడు. కృష్ణ ప్రసాద్ మృతి పట్ల పలువురు సిపిఐ నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల నేతలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేయడం తో పాటు సంతాపం ప్రకటించారు.

**కృష్ణ ప్రసాద్ మృతి పట్ల కూనంనేని సాంబశివరావు సంతాపం**

ఎం. కృష్ణ ప్రసాద్ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం బాధ కలిగించిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు సాంబశివరావు ప్రగాఢ సానుభూతినితెలిపారు. కృష్ణ ప్రసాద్ తనకు మంచి మిత్రుడని ఆయన అకాల మరణం తీవ్రంగా కలిచివేసిందని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్‌కె.నారాయణ అన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.





**ప్రగతిశీల ఉద్యమాలకు తీరనిలోటు : ఇటి నరసింహ**

ప్రజల సమస్యలు పరిష్కరించలేని పాలకులు మత రాజకీయాలు చేస్తున్న సందర్భంలో లౌకిక ప్రజాస్వామ్య భావజాలం పెంపొందించడం కోసం జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేయడం కోసం పట్టుదలతో తన బాధ్యతను నిర్వర్తించాడు.పౌర ప్రజాస్వామిక హక్కుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక ఏర్పాటులో మేధావులను బుద్ధి జీవులను ఏకం చేయటంలో తన కర్తవ్యాన్ని నిర్వహించడన్నారు.అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తులను శక్తులను ఐక్యం చేయడం కోసం విరామలేకుండా కృషి చేశాడు. భారత పాలకవర్గం ప్రజా ఉద్యమంపై కొనసాగిస్తున్న దమనకాండక వ్యతిరేకంగా ప్రకృతి వనరులు కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న రాజ్యానికి వ్యతిరేకంగా జరిగిన ప్రతి ఉద్యమంలో తన భాగస్వామి అయ్యారని గుర్తు చేసుకున్నారు. ఫాసిస్ట్ పాలన కొనసాగుతున్న నేడు కృష్ణ ప్రసాద్ లాంటి ఉద్యమ నాయకుడు మరణించడం అత్యంత విషాదకరమని, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సంతాపం వ్యక్తంచేశారు. కృష్ణ ప్రసాద్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నివాళి అని వారి కుటుంబ సభ్యులకు బంధుమిత్రులకు ఈటి నరసింహ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**ఎఐవైఎఫ్ సంతాపం**

కృష్ణ ప్రసాద్ (కెపి) ఆకస్మిక మరణం పట్ల అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) రాష్ట్ర సమితి తీవ్ర విచారం వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. యువజన ఉద్యమంలోనూ, కమ్యూనిస్టు పార్టీలోనూ ఆయన ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో, ప్రజల పక్షాన నిరంతరం పనిచేసిన పోరాటయోధుడు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేందలు కొనియాడారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామిక హక్కులు, యువత సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీమన్నారు. ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించకుండా ఉద్యమాన్ని జీవిత లక్ష్యంగా తీసుకుని పనిచేసిన ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు వారు పేర్కొన్నారు. ఎఐవైఎఫ్‌రాష్ట్ర 2వ మహాసభల ఆహ్వాన సంఘ ఛైర్మెన్ గా వ్యవహరించి, మహాసభల విజయవంతం కోసం అవిరాళంగా కృషిచేశారని వారు గుర్తు చేసుకున్నారు.

GHMC
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
చింతల్ సర్కిల్-54, క్యూబిజెడ్, సిఎంసి.
NIT No. 04/DB/EE-III/CNL/C-54/QBZ/CMC/2026-27, Dated: 19.05.2026, పని పేరు: ఎస్‌డబ్ల్యుడి & సిసి రోడ్ వేయడం, పెయింటింగ్, టాయిలెట్స్ (3 పనులు), అంచనా మొత్తం: రూ.12.45 లక్షలు, ప్రారంభ తేదీ & సమయం: 20.05.2026@ 3:00 P.M., బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 25.05.2026@ 3:00 P.M., టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III,
సిఎన్‌ఎల్ సి-54, సిఎంసి.
DIPR R.O. No. : 2647-PP/CL/ADVT/2026-27, Date: 19-05-2026

తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాదు.
మెమో నెం. 3875/Endts.-11/A1/2026, తేది : 24-04-2026 ప్రకారం తెలంగాణ చారిటబుల్ & హిందూ రెలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ & ఎండోమెంట్స్ చట్టం 30/1987లోని సెక్షన్ 6 మరియు 43 ప్రకారం, ప్రభుత్వము ద్వారా ఉపవిభాగం (1) సెక్షన్ 146 కింద ప్రచురించబడి మరియు నమోదు చేయబడి, చట్టం 33/2007 ద్వారా సవరణ చేయబడినది. జి.ఓ.ఎం.ఎస్. నెం.649, రెవెన్యూ (ఎండోమెంట్స్-I) శాఖ, తేదీ: 20-06-1981 అనుసరించి శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరీ దేవస్థానం (నారాయణాశ్రమము), కూకట్‌పల్లి గ్రా॥ & మం॥, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు రేనోవేషన్ కమిటీ ఏర్పాటు కొరకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది.
ఆసక్తి కలిగిన హిందూ మత వ్యక్తులు పైన తెలిపిన దేవస్థానంకు రేనోవేషన్ కమిటీ నియామకం కొరకు ఫారం-IIలో వారి దరఖాస్తులను వార్త పత్రికలో ఈ నోటిఫికేషన్ ప్రచురణ జరిగిన తేదీ నుండి 10 రోజులలోగా శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, రంగారెడ్డి జిల్లా వారికి సమర్పించగలరు.
సం/- ప్రిన్సిపాల్ సెక్రటరీ టు గవర్నమెంట్,
రెవెన్యూ, ఎండోమెంట్, తెలంగాణ, హైదరాబాదు.
DIPR R.O. No. : 2632-PP/CL/ADVT/2026-27, Date: 19-05-2026

## నీటి సంపులో పడి చిన్నారి మృతి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** బుడిబుడి అడుగులతో ఇంటి ముందర అల్లరి చేస్తూ తిరగాల్సిన ఓ చిన్నారి, పెద్దల క్షణిక నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోవడం బొల్లారం గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ హృదయ విదారక ఘటన గ్రామస్తులను కంటతడి పెట్టించింది. గ్రామానికి చెందిన లింగస్వామి, మల్లేశ్వరి దంపతులకు నలుగురు సంతానం. అందులో చిన్నారి లాస్యశ్రీ (3) ఇంట్లో అందరికీ ఎంతో ముద్దుబిడ్డ. ఎప్పుడూ చిలిపిగా ఆడుకుంటూ ఇల్లంతా తిరిగే చిన్నారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం మల్లేశ్వరి ఉదయం పనుల నిమిత్తం వనపర్తి పట్టణానికి వెళ్ళింది. చిన్నారి లాస్యశ్రీని భర్త లింగస్వామి వద్ద వదిలి వెళ్లినట్లు తెలిపారు. అనంతరం పనులు ముగించుకుని తిరిగి వస్తూ కొర్లకుంట స్టేజ్ వద్దకు చేరుకున్న మల్లేశ్వరి, తనను తీసుకెళ్లేందుకు భర్తకు ఫోన్ చేసింది. దీంతో లింగస్వామి చిన్నారిని ఇంట్లోనే వదిలి ద్విచక్ర వవాహనంపై భార్యను తీసుకురావడానికి వెళ్ళినట్లు తెలిసింది. ఈ సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారి లాస్యశ్రీ ప్రమాదవశాత్తు ఇంట్లో ఉన్న నీటి సంపు (హౌస్ సంప్) వద్దకు వెళ్లింది. ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## రజాక్‌కు రూ.5లక్షల ఎల్‌ఓసి పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే విజయుడు



**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పల్లెపాడు గ్రామానికి చెందిన పి,రజాక్ తండ్రి దివాన్ సాహెబ్‌కు మంజూరైన రూ.5లక్షలు విలువైన ఎల్ ఓసి పత్రాన్ని ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టు జోగురాములు మరణం తీరనిలోటు

### ఐజెయు రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లాలోని గోపాల్‌పేట మండలంలో జర్నలిస్టుగా ప్రజా సమస్యల కోసం నిరంతరం పరితపిస్తూ పనిచేస్తున్న జోగు రాములు అకాల మరణం జర్నలిస్ట్ లోకానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టియుడబ్ల్యుజె, ఐజెయు రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వెలుగు దినపత్రిక జర్నలిస్ట్ మరణం తెలిసిన వెంటనే రాష్ట్ర కార్యదర్శి వెంట తెలంగాణ టియుడబ్ల్యుజె, ఐజెయు నాయకులు వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవరాదు, రాజు, రాష్ట్ర హౌసింగ్ సైట్స్ మెంబర్ శ్రీనివాసరావు ఈశ్వర్, తదితరులు మరణించిన జర్నలిస్టు జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించి జర్నలిస్టు సంఘం తరపున రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌తో చర్చించి తగిన న్యాయం చేసి, ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## వృద్ధాశ్రమం, బాలసదనం సిబ్బంది అందుబాటులో ఉండి చూసుకోవాలి

### సీనియర్ సివిల్ జడ్జి వింధ్యనాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మంగళవారం నారాయణపేట పట్టణంలోని బారం బావి దగ్గర ఉన్న వృద్ధాశ్రమం, బాలసదనం హోమ్‌ని సీనియర్ సివిల్ జడ్జి వింధ్యనాయక్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోమ్‌లో హాజరుపట్టికను పరిశీలించారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి వృద్ధులని ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హోమ్‌లో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ వృద్ధులకి, పిల్లలకి ఎలాంటి సమస్యలు ఉన్నా కూడా సంబంధిత అధికారికి వెంబడే తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోజు ఆహార దినపట్టికను అడిగి వసతులను, దిన వస్తువులను ఆహార ధాన్యాల నాణ్యత, తాగు నీరు, పరిశుభ్రత, రిజిస్టర్లను, సిసిటీవి ఫుటేజ్‌లను, మూవ్మెంట్ రిజిస్టర్స్, ఆఫీస్ అర్డర్స్ ప్రకారం అడ్మిషన్స్ తీసుకుంటున్నారా, ఆఫీసర్ ఆర్డర్ ప్రకారం సంబంధించిన వాళ్లకు అప్పచెపుతున్నారా లేదా తగిన రిజిస్టర్లు చూశారు.

## మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మండంలోని తోటపల్లి గ్రామం జోగు లలితమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామ బిఆర్‌ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోగు రమణమ్మ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, లింగయ్య, పరుశురాములు, వెంకటయ్య, నాగార్జున, బంగారయ్య, సాయిలు, నరసింహ, బాలయ్య, బంగారయ్య, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ విజయ మృతి సమాజానికి తీరని లోటు

### ప్రజల డాక్టర్‌గా ఆయన చేసిన సేవలు ఎనలేనివి



**ప్రజాపక్షం/కల్వకుర్తి రూరల్ :** ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ మృతి సమాజానికి తీరని లోటు అని వందేమాతరం షటిల్ బ్యాట్మింటన్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వి ఎం ఎఫ్ షటిల్ కోర్టులో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విఎమ్‌ఎఫ్ అసోసియేషన్ అధ్యక్షులు శశాంక్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ మాట్లాడుతూ అనతి కాలంలోనే డాక్టర్ విజయ్ ప్రజా వైద్యునిగా గొప్ప పేరు పొందారని వారు అన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందడం కల్వకుర్తి ప్రజానీకానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఆకర్షించారు. కార్యక్రమంలో కిషోర్ రెడ్డి, దుబ్బ నాగేష్ జూలూరి, ప్రకాష్, అంజి, బాబురావు, మురళీ, శ్రీను, విజయ్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు, కుంటల అభివృద్ధితోనే...

# భూగర్భ జలాలు పెరుగుదల

### జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చెరువులు, కుంటలు అభివృద్ధి చేసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం, సాతాపూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నాపగుంపు నుంచి పెద్దగుంట వరకు కొనసాగుతున్న ఫీడర్ ఛానల్ పనులను జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించి, అనంతరం ఉపాధి హామీ కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి అభివృద్ధికి ఫీడర్ ఛానల్ పనులు కీలకమని, జల్‌జీవన్ మిషన్ పనులను వేగంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు వేతనాలు సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే సాగునీటి వనరులు మెరుగుపడి గ్రామంలోని సుమారు 50 మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని, చెరువులు, కుంటలు, కాలువల అభివృద్ధితో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పనులు కేవలం ఉపాధి కల్పనకే కాకుండా గ్రామాఅభివృద్ధికి దోహదపడేలా ఉండాలని, పనిస్థలాల్లో కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్‌డిఎ చిన్న ఓబులేసు, మిషన్ భగీరథ ఇఇ సుధాకర్ సింగ్, పెద్దకొత్తపల్లి మండల తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలి**

**రైతులకు సకాలంలో చెల్లింపులు జరగాలి**

**నాగర్‌కర్నూల్ :** ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఉన్నారు. మంగళవారం కోడేరు మండల పరిధిలోని పసుపుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, ధాన్యంలో ఉన్న తేమశాతాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు జరుగుతున్నదా లేదా అనే అంశంపై అధికారులు, సిబ్బందిని అడిఇ జిల్లా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు న్యాయమైన ధరతోపాటు సకాలంలో చెల్లింపులు అందేలా కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటే కొనుగోలు ఆలస్యం అవుతుందని రైతులకు స్పష్టంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని విక్రయించగలిగేలా కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వ, తూకం విధానం, రికార్డు నిర్వాహణ, టోకెన్ విధానం వంటి అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వారి అభిప్రాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న చిన్నపాటి సమస్యలను కూడా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది, అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## వనపర్తిలో రోడ్డెక్కిన అన్నదాత

### ఐకెపి కేంద్రాలు తెరిచి 45 రోజులైనా కొనుగోళ్లు శూన్యం

### ధాన్యానికి నిప్పు పెట్టి రైతుల రాస్తారోకో

**ప్రజాపక్షం/వనపర్తి :** తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ జాప్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా వరి ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నా, అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల వద్ద వారాలతరబడి పడిగాపులు కాస్తున్నా కొనుగోళ్లు సాగడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ విషయంలో మొండివైఖరిని విడనాడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**రోడ్డుపై ధాన్యం పోసి నిరసన :** వనపర్తి మండలంలోని రాజపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వనపర్తి నుండి కొత్తకోటకు వెళ్లే ప్రధాన రహదారిపై వరి ధాన్యం బస్తాలను అడ్డంగా వేసి రాస్తారోకో చేపట్టారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 45 రోజులు గడుస్తున్నా, ఒక్క బస్తా కూడా తూకం వేయలేదని రైతులు కన్నెర్ర చేశారు. ఖాళీ బస్తాలను రోడ్డుపై వేసి నిప్పు పెట్టారు.

**నిలిచిన రవాణా..** రైతుల రాస్తారోకోతో వనపర్తి కొత్తకోట మార్గంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. “రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ఇన్ని ఇబ్బందులు పడాలా? ” అని ప్రశ్నించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, రాజపేట కేంద్రంలో తూకాలు ప్రారంభించకపోతే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్లయ్య, ఉప సర్పంచ్ చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ జయరాములు, ముఖ్య నాయకులు సుదర్శన్ రెడ్డి, మాధవ రెడ్డి, రైతు ప్రతినిధులు తిరుపతయ్య, తెలుగు నారాయణ, మోహన్ రెడ్డి, సత్యా రెడ్డి, శంకర్ రెడ్డి తో పాటు పెద్ద సంఖ్యలో మహిళా రైతులకు మద్దతు తెలిపారు.

## అన్‌లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండలంలో ఈదురుగాలులు, అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఖాజా మైనుద్దీన్ నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రానికి సమీపంలోని ప్రభుత్వగోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాంలో త్వరితగతిన అన్‌లోడ్ చేసి భద్రపరచాలని హమాలీలకు సూచించారు. వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రస్తుతం ఉష్ణోగ్రత్తలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో హమాలీలు తమ తహసీల్దార్ సూచించారు. పని సమయంలో తరచుగా నీరు తాగాలని, ఎండ తీవ్రత నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా హమాలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గోదాంలో నిల్వ సామర్థ్యం, ధాన్యం రవాణా ఏర్పాట్లు, హమాలీల పనితీరు, భద్రతా చర్యలు తదితర అంశాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కురుమూర్తి, జిపిఒ గోపాల్, విఆర్‌ఎ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

### ఇద్దరికి గాయాలు



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని కొట్ర గ్రామ రెవెన్యూ శివారులో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. మృతురాలు వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జాజాల జయమ్మ(34)గా గుర్తించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, జయమ్మ తన భర్త జాజాల జనార్దన్‌తో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటూ ఫంక్షన్ హాల్‌లో కూలీ పనిచేస్తుండగా, జనార్దన్ తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. కోనేటిపూర్‌లో జరిగిన ఒక ఫంక్షన్‌కు తన చిన్న కూతురు దాలికతో పాటు, భర్త జనార్దన్, జయమ్మలు హాజరై తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. జయమ్మకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె గాయత్రి(17) బాసర ఐఐటిలో ఎంపిసి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కుమారుడు లోకేష్(12), చిన్న కుమార్తె దాళిక (9) ఉన్నారు. భర్త జనార్దన్, దాలికకు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జయమ్మ మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. స్థానికులు మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## బ్యాంకుల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు అవసరం

### మక్తల్ సిఐ రామ్‌లాల్

**ప్రజాపక్షం/మక్తల్ :** మంగళవారం సిఐ రామ్‌లాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీ రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మక్తల్‌లోని బ్యాంక్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను తనిఖీలు నిర్వహించి, బ్యాంక్ అధికారులకు భద్రతాపరమైన సూచనలు చేశారు. అనంతరం బ్యాంకుల వద్ద కస్టమర్లకు లావాదేవీలు జరిపే సమయంలో డబ్బు ఇంటికి తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రామ్‌లాల్ మాట్లాడుతూ బ్యాంకులలో, ఎటిఎంల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రతిరోజు లావాదేవీలు జరపడానికి వచ్చే కస్టమర్లు అప్రమత్తంగా ఉండాలని, అధిక మొత్తంలో డబ్బులు డ్రా చేసే సమయంలో, తీసుకొని వెళ్లే సమయంలో ఏమరపాటుగా ఉండరాదని, తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఎటిఎంలో డబ్బులు డ్రా చేసే సమయంలో కొత్త వ్యక్తులకు ఎటిఎం కార్డ్స్ ఇవ్వరాదని, అపరచిత వ్యక్తులు చెప్పే మాటలను నమ్మరాదని తెలిపారు. కావున బ్యాంకుకు వచ్చే ప్రజలు, కస్టమర్లు జాగ్రత్తలు పాటించాలని, ఎక్కువ మొత్తంలో డబ్బులు ఉంటే ఇద్దరు, ముగ్గురు ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని సిఐ తెలిపారు.

## నిరుద్యోగులకు ఐదేళ్ల వయోపరిమితి అమలు చేయాలి

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే గరిష్ట వయోపరిమితిని 34 సంవత్సరాల నుంచి 44 సంవత్సరాలకు పెంచుతూ విడుదల చేసిన జీవో నెం: 86ను సవరించి, ఒక సంవత్సరం పాటు కాకుండా కనీసం ఐదు సంవత్సరాల పాటు అమలు చేయాలని మంగళవారం ఉట్కూర్ మండలంలోని బిజ్వార్ గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగులు హెచ్.నర్సింహా, రాధాకిషన్, శివ అమర్, సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా పదేళ్ల వయోపరిమితి పెంపు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలాగే ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు. అయితే జీవోలో పెంచిన వయోపరిమితి కేవలం ఒక సంవత్సరం పాటు మాత్రమే వర్తిస్తుందని పేర్కొనడం వల్ల నిరుద్యోగులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలగదని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## 4నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్

### ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు జమ్మిచెడు కార్తీక్

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** పారిశుద్ధ్య కార్మికులకు 4 నెలల జీతాలు చెల్లించాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు జమ్మిచేడు కార్తీక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జమ్మిచేడు కార్తీక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వెంటనే వాటిని పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, గ్రామ పంచాయతీ కార్మికులు మద్దిలేటి ప్రభుదాసు, రామాంజనేయులు, శ్రీను, భాస్కర్, శ్రీనివాసులు, రాఘవేంద్ర, తిమ్మప్ప పాల్గొన్నారు.



## రైతుల సమస్యపై వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రియాంక

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల రైతుల సమస్యపై జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహ పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌ను కొంత మంది రైతులు కలిసి, తాము కొనుగోలు కేంద్రంలో విక్రయించిన ధాన్యంపై మరికల్ వెంకటేశ్వర రైస్ మిల్లు యజమాని కోత విధించారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించినర కలెక్టర్ వెంటనే సివిల్‌సప్లై అధికారి బాల్‌రాజ్ కు ఫోన్ చేసి, రైతుల ఫిర్యాదు పై విచారణ నిర్వహించి సాయంత్రం లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ తక్షణ స్పందనకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్ల మరమ్మతులు చేపట్టాలని సిపిఎం కరపత్రాలు విడుదల

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల పరిధిలోని వివిధ గ్రామాల దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గుడెబాల్లూరు గ్రామంలో మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్‌హెచ్ 167 గుడెబాల్లూర్ నుండి ముడుమాల వరకు మరమ్మతులు చేసి డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఎన్‌హెచ్ 167 టై రోడ్ నుంచి మురార్ దొడ్డి వరకు, చేగుంట నుండి అయినాపూర్ వరకు బిటి రోడ్డు మరమ్మతులు చేయాలని అన్నారు. పాడైపోయిన రోడ్డు వల్ల ప్రయాణం చేస్తున్న ప్రజలు ప్రమాదాలకు గురై తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రయాణం అంటేనే బాధగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు భరత్ కుమార్, మండల నాయకులు బోల్లబోడి దేవప్ప, వడ్డే రాజు, అవసలి కిట్టు, చిట్టి వెంకటేష్, బసప్ప హనిమీ రెడ్డి, సుబ్రమణ్యం, మురార్దొడ్డి తిమ్మప్ప, పంతిగి ఆంజనేయులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా పట్టివేత

### పది తులాల బంగారు కారు రికవరీ

### సిఐ, ఎస్ఐలను అభినందించిన జిల్లా ఎస్పీ, డిఎస్పి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో గల బస్టాండ్ వద్ద దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జడ్చర్ల పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం నాడు పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు దోపిడీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హర్యానాకు చెందిన ఐదుగురు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి బస్టాండ్లలో దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈనెల 7వ తేదీన జడ్చర్ల బస్టాండ్‌లో ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు కట్‌చేసి ఏడు తులాల బంగారు ఆభరణాలను, అదేవిధంగా 18న మరో ప్రయాణికుల వద్ద మూడు తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారని వివరించారు. బస్టాండ్ టార్గెట్ చేసి ప్రయాణికులను గమనిస్తూ విలువైన వస్తువులు ఉన్న ప్రయాణికులను గుర్తించి బస్సులో ప్రయాణించి దోపిడీకి పాల్పడి, వారు తెచ్చిన కారులో తిరిగి ప్రయాణం చేస్తారని ఆయన పేర్కొన్నారు. సందీప్ అనే వ్యక్తి లీడర్‌గా వ్యవహరిస్తూ అనేక దోపిడీలు చేస్తున్నాడని, ఆయన వెంట హర్యానాకు చెందిన అశోక్ ప్రవీణ్ రాజేష్ సచిన్‌లు గ్యాంగ్ ఏర్పడి దోపిడీలకు పాల్పడుతున్నారని వివరించారు. చోరీ చేసిన బంగారం తీసుకుని బస్సులో నుంచి మధ్యలో దిగి వెనుక వస్తున్న వారి కారులో తిరిగి గమ్యస్థానాలు చేరుకుంటారని తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి ఆదేశాల ప్రకారం దొంగలను గుర్తించేందుకు పక్కా పథకం ప్రకారం ఫ్లైఓవర్ కింద నిఘా వేశామని, ఈ క్రమంలో హర్యానాకు చెందిన కిరాయి వాహనంలో ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పద పరిస్థితిలో కనిపించగా పట్టుకొని విచారిస్తే దోపిడీలకు పాల్పడుతున్నది తామేనని చెప్పినట్టు తెలిపారు. చోరి చేసిన పది తులాల బంగారాన్ని రికవరీ చేశామని, కారుతోపాటు దొంగలను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. అభినందించిన ఎస్పీ జడ్చర్ల పట్టణంలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్న జడ్చర్ల సిఐ కమలాకర్, ఎస్ఐ మల్లేష్‌లను ఎస్పీ జానకి అభినందించినట్లు డిఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా వీరికి రివార్డు అందిస్తున్నామని, చాకచాక్యంగా వ్యవహరించి తొందరగా దొంగలను పట్టుకున్నందుకు వారికి శుభాకాంక్షలు తెలిపారు. సిఐ, ఎస్ఐల వెంట కానిస్టేబుల్ విష్ణు, నర్సింహ, రాజు ఉన్నారని వారిని అభినందించినట్లు తెలిపారు.

ఈ మేర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని డిఎస్పీ వెంకటేశ్వర్లు వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో సిఐ కమలాకర్, ఎస్ఐ మల్లేషలు పాల్గొన్నారు.

## హోంగార్డ్ బాలకృష్ణ మృతికి జిల్లా పోలీస్ శాఖ నివాళి

**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద పోలీస్ స్టేషన్లో హోంగార్డ్ గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ సెలవుల పై సొంత ఊరు కొత్తపల్లి మండలం, గోకుల్ నగర్ కు వెళ్లిగా తీవ్రమైన చమటలతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్ నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆర్ఐ విజయ్ భాస్కర్, హోంగార్డ్ ఇంచార్జి ఆర్ఎస్ఐ శివశంకర్ లు బాలకృష్ణ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులార్పించారు. అలాగే పోలీస్ శాఖ తరపున తక్షణ సహాయంగా రూ. 10.000/ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ.. హోంగార్డ్ బాలకృష్ణ మృతి పోలీస్ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. బాలకృష్ణ కుటుంబ సభ్యులకు జల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని, వారికి తగిన సహాయం, న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## మధ్యవర్తులు, పైరవీలు, కమీషన్లకు తావులేకుండా ప్రభుత్వ సాయం

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గం లోని ఎనిమిది మండలాలకు చెందిన 323 మంది లబ్ధిదారులకు ఆయన స్వయంగా ఈ చెక్కులను అందజేశారు. యాదగిరిగుట్ట మండలం, పట్టణంలో 61 మందికి, తుర్కపల్లిలో 42, ఆత్మకూరులో 39, బొమ్మలరామారంలో 37, రాజపేటలో 31, గుండాలలో 29, మూటకొండూరులో 28, ఆలేరులో 22 మందితో పాటు మిగతా ప్రాంతాలకు చెందిన 35 మంది కలిపి మొత్తం 323 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనకు కొత్త అర్థం తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతి సంక్షేమ పథకాన్ని ఎంతో పారదర్శకంగా ప్రజలకు అందిస్తోందని కొనియాడారు. మధ్యవర్తులు, పైరవీలు, కమీషన్లకు తావులేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య, వివిధ గ్రామాల సర్పంచులు వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ హితం కోసం పాటుపడాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : సమాజ హితం కోసం, మంచి పనుల కోసం పాటుపడాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ హితవు పలికారు. మంగళవారం కేసుల్లో సస్పెక్ట్ షీట్స్, హిస్టరీ షీట్స్, గంజాయి కేసుల్లో షీట్స్ ఉన్న వ్యక్తులకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో డివిజన్ స్థాయి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. గతంలో చేసిన పనుల నుండి పాఠాలు నేర్చుకొని సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. అసాంఘిక చర్యలకు, నేరాలకు పాల్పడుతూ ప్రజాజీవనానికి భంగం కలిగిస్తే రౌడీషీట్స్, సస్పెక్ట్ షీట్స్ నమోదు చేస్తామన్నారు. పిడి యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ప్రతినెల కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని, అందరిపై పోలీసు నిఘా ఉన్నదన్నారు. ప్రస్తుత జీవనశైలి, ఎలాంటి పనులు చేస్తున్నారు అని గమనిస్తున్నామని హెచ్చరించారు. మంచి ప్రవర్తన కలిగి ఉంటే ఎలాంటి ఫైరవీలు లేకుండా క్షుణ్ణంగా పరిశీలన చేసి చట్టప్రకారం షీట్స్ ఎత్తి వేస్తామని స్పష్టం చేశారు. గరిడేపల్లి, మేళ్లచెరువు, మునగాల, మోతె పోలీసు స్టేషన్ల నందు నమోదైన హత్య కేసుల్లో జీవిత ఖైదీ శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఎస్‌ఐలు ఏడుకొండలు, సాయిరాం, శివతేజ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ఐజెయు కృషి

టియుడబ్ల్యుజె, ఐజెయు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/మునగాల:** జర్నలిస్టుల సంక్షేమానికి టియుడబ్ల్యూజే, ఐజెయు కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో సభ్యత్వ నమోదుకు మంచి విశేష స్పందన వచ్చిందని అన్నారు. మండల స్థాయిలో పనిచేసే జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పరిష్కరిస్తామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేసేఏకైక సంఘం టియుడబ్ల్యుజె, ఐజెయు అని అన్నారు. ఈ సభ్యత్వ నమోదులో ఐజెయు నాయకులు కోట రాంబాబు, సీనియర్ జర్నలిస్టు తాటికొండ శ్రీనివాస్, జర్నలిస్టులు నర్సింహరావు, శివ, సిహెచ్ సీతరాం, ఎస్‌కె దస్తగిరి, తుమ్మల వెంకటేశ్వర్లు, బెజవాడ గోవర్ధన్, బంగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విపత్తుల నిర్వహణలో ఎన్‌సిసి స్ఫూర్తిదాయకంగా నిలవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : విపత్తు లను సమర్ధవంతంగా ఎదుర్కోవాలంటే సమాజాన్ని సమాయత్త పరచాలని అందుకు సుశిక్షితులైన మానవ వనరుల అవసరం ఉందని డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి అన్నారు.మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వేదికగా మంగళవారం ఏర్పాటు చేసిన యువ ఆపద మిత్ర శిక్షణ కార్యక్రమానికి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎన్‌సిసి క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. అనేక రకాల విపత్తు లను సమర్ధవంతంగా ఎదుర్కోవాలంటే సమాజాన్ని సమాయత్త పరచాలని అందుకు సుశిక్షితులైన మానవ వనరుల అవసరం ఉందన్నారు. వారం రోజుల శిక్షణ తరగతుల్లో ఎన్‌సిసి క్యాడెట్లు, దేశానికి సవాళ్లు విసురుతున్న అనేక విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనే నైపుణ్యాలను అందిపుచ్చుకొని సమాజానికి అందించాలని పిలుపునిచ్చారు. కల్నల్ శశిధర్ రావు మాట్లాడుతూ క్రమశిక్షణ,దేశ రక్షణ,సమాజ హితం ఎన్‌సిసి ద్వారా సాధ్యమని క్యాడెట్లు శ్రద్ధతో పాల్గొని మానవ వనరుగా దేశానికి ఉపయోగపడాలన్నారు. అనంతరం జిల్లా అగ్నిమాపక సిబ్బంది తమ అధునాతన పరికరాలను ప్రదర్శిస్తూ విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ అడిషనల్ పిడి జి హరీష్ కుమార్, యూసఫ్ ఉద్దీన్,31వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్ రావు,కాల్నల్ మాధవరావు,సుబేదార్ రఘువీర్,జి మచ్చేందర్, నాగార్జున బెటాలియన్ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం
# రైతుల కళ్లల్లో కన్నీళ్లు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండలంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిలువ ఉండిపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. వర్షాలు పడే పరిస్థితి ఉండడంతో తడిసిపోతుందని భయంతో రైతులు కంటిమీద కునుకు లేకుండా రైతుల కళ్ళల్లో కన్నీళ్లే మిగిలి కేంద్రాల వద్ద కాపలా కాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికి నుండి 43 లారీలు మాత్రమే తూకం వేశామని ఇప్పటికి సరిపడా లారీలు ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం మిల్లులకు తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని కొన్నిచోట్ల రూపం పూర్తయిన ధాన్యం కూడా రోజులు గడిచిన తరలించకపోవడంతో గన్నీ సంచులు పేరుకుపోయాయి. దీంతో కొత్తగా తీసుకొచ్చే ధాన్యాన్ని నిల్వ చేసేది కూడా స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.





**నాసిరకం గన్ని బ్యాగులు పంపిణీ పై రైతులు ఆగ్రహం**
ప్రభుత్వ సరఫరా చేసిన గన్ని బ్యాగులు నాసికంగా ఉన్నాయని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపిన గన్నీసంచులు నాణ్యతలేమితో ఉండడంతో ధాన్యం నింపగానే చినిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు .దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నిసంచుల కొరత తో పాటు పంపిణీ చేసిన సంచులు కూడా పనికిరాకపోవడంతో దాన్యం నిలువ చేయడం కష్టంగా మారిందన్నారు. సంచులు చినిగిపోవడంతో ధాన్యం నేలపాలై నష్టపోతున్నారని రైతులు వాపోయారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా నాశీరకం గన్నీ బ్యాగులను సరఫరా చేయడం దారుణమని రైతు సంఘం నాయకులు మండిపడ్డారు.

**అకాల వర్షాలు హెచ్చరికతో రైతుల గుండెల్లో గుబులు**
అకాల వర్షాలు వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు మొదలై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అప్పుల భారం మరోవైపు ప్రకృతి విపత్తులతో రైతన్న ఆదుకోవాలని కోరుతున్నా..ప్రభుత్వం మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. గ్రామాల్లో కల్లాల వద్ద ధాన్య రాశులుగా పేరుకుపోయి ఉండగా కనీసం టార్పాలిన్‌లు కూడా అందుబాటులో లేక రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఒక్క వాన పడితే ఏడాది శ్రమ మట్టి పాలు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో రైతులు తమ ధాన్యాని రోడ్ల పక్కనే నిల్వ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అకాల వర్షాల ముప్పు ముందే తెరిచిన ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదనీ వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.



## శత్రువుల స్త్రీలను కన్నతల్లిగా గౌరవించిన మహనీయుడు ఛత్రపతి శివాజీ

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహిళలకు అత్యున్నత గౌరవం ఇవ్వడమే హిందూ సంస్కృతి అని, యుద్ధంలో శత్రువుల స్త్రీలను సైతం కన్నతల్లితో సమానంగా పూజించిన గొప్ప చరిత్ర ఛత్రపతి శివాజీ మహారాజ్‌ది అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని జటావత్‌తండాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టోత్సవ వేడుకలు మంగళవారం కన్నుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శివాజి మహారాజ్ విగ్రహానికి రిబ్బన్ కట్ చేసి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజి మహారాజ్ జీవితం మానవాళికి ఎన్నో గొప్ప పాఠాలను, విలువలను నేర్పుతుందన్నారు. పరాయి పాలన, పరమత సహనం లేని శక్తులుగా ధీటుగా ఎదురించి హిందూ స్వరాజ్యాన్ని స్థాపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## వారంలోగా ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పూర్తి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశం



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్)/నూతనకల్/మద్దిరాల/తుంగతుర్తి/తిరుమలగిరి/నాగారం** : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రానున్న వారం రోజుల్లో నిర్దేశిత కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని రైస్ మిల్లతో పాటు, పాతర్లపహాడ్ గ్రామంలోని అరోహి రైస్ మిల్లును సందర్శించి ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రకియను అడిగి తెలుసుకున్నారు. నూతనకల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. మద్దిరాల మండల కేంద్రం, గుమ్మడివల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటి ఆవరణలోని కొనుగోలు కేంద్రంతోపాటు, వెంపటి గ్రామం, రావులపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేశారు. తిరుమలగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. నాగారం మండలం ఈటూరి గ్రామంలోని సోమేశ్వర రైస్ మిల్లును సందర్శించి అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకు పాయింట్లను గుర్తించినట్లు వెల్లడించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రానున్న వారం రోజులు అత్యంత కీలకమని కాబట్టి అధికారులు, మిల్లుల యజమానులు సమన్వయంతో పనిచేసి లారీలను వేగంగా అన్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు హమీసింగ్, శ్రీనివాసరావు, తబిత, దయానంద్, వ్యవసాయ శాఖ ఏఓ రుహి, ఎంపిడిఓ శేషుకుమార్, ఏడిఏ రమేష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**ప్రజాపక్షం/మర్రిగూడ** : ఓటరు జాబితా సంస్కరణల పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని చండూరు ఆర్‌డిఓ వి.శ్రీదేవి హెచ్చరించారు.మంగళవారం మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులుకు నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, తప్పులు లేకుండా నిర్వహించాలని సూచించారు. ప్రతి బీఎల్‌వో క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను సేకరించి ఓటరు జాబితా నుంచి తొలగించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే నకిలీ ఓటర్ల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకే వ్యక్తి పేరు వేర్వేరు ప్రాంతాల్లో నమోదై ఉంటే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి ఒకే చోట మాత్రమే ఓటు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛత ప్రజాస్వామ్య బలానికి ముఖ్యమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.సమావేశంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు,ఎన్నికల విభాగం సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## రైతులు అధైర్య పడొద్దు... చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు



ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్** : రైతులు ఎవరు అధైర్య పడవద్దని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రవెల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా వడ్ల కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు మూసి పరివాహక ప్రాంతంలో 30 వేల మెట్రిక్ టన్నుల బాయిల్ కోట పెంచాలని ప్రభుత్వాన్ని కోరగా వెంటనే స్పందించి మంత్రిగారు మంజూరు చేశారన్నారు. రైతులు మూసి పరివాహ ప్రాంతంలో ఎకరానికి 80 బస్తాల ట్యాబ్ పరిమితిని ఎమ్మెల్యే చేరువతో 100 బస్తాలకు పెంచడం జరిగిందని తెలిపారు. అందులో ధాన్యానికి సరిపడా గోదాము లేకపోతే ఈ ప్రాంతంలో ఉన్న ఫంక్షన్ హాల్ కూడా తీసుకొని ధాన్యాన్ని నిల్వ చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా జూలూరు. రుద్ర వల్లి బ్రిడ్జి నిర్మాణా పనులు వెంటనే చేపట్టాలని ప్రభుత్వం 18.5 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని తెలిపారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని ప్రభుత్వం చివరి గింజ వరకు దాన్యం కొనుగోలు చేస్తుందని ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తుందని రైతుల ఖాతాల్లో 48 గంటల్లో డబ్బులు జమ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దక్కిందన్నారు. గతంలో వడ్ల కొనుగోలు చేసినప్పటికీ డబ్బులు రాక రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం ఒక నెలలోనే వడ్లు కొనుగోలు చేసి వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫోటోల శ్యామ్ గౌడ్, పిఎసి వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, సర్పంచులు పంజాల శ్రీనివాస్ గౌడ్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## కెసిఆర్ పాలనలో రైతులకు ద్రోహం చేసి వారి ఖజానా నింపుకున్నారు

డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత ఎద్దేవా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పది సంవత్సరాల తెలంగాణ పాలనలో కేసీఆర్,ఆయన చెంచాలు రైతులకు ద్రోహం చేసి వారి ఖజానా నింపుకున్నారని డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఎద్దేవా చేశారు. మంగళవారం పట్టణంలోని యాదవ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏక కాలంలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ అంటూ రైతులను ముంచిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. కెసిఆర్ పాలనలో సుమారు పదివేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని కల్లాల వద్ద రైతులు చనిపోయిన సంఘటనలు నేటికీ గుర్తుకు ఉన్నాయన్నారు. ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసి హింసించిన సంఘటనలు ప్రజలు మర్చిపోలేదన్నారు. వరి వేస్తే ఉరి అని రైతులను మోసం చేసింది కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు. దేశ భక్తుడు, నిజాయితీపరుడైన మంత్రి ఉత్తంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించం బిఆర్ఎస్ నాయకుల నాలుక తెగ కోస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాల రవీందర్ రెడ్డి, బోడ స్వామి,పగిళ్ల రాజు, చర్లపల్లి గౌతమ్,మధగోని వెంకన్న, వావిళ్ళ దేవదాస్, నాగరాజు,పొట్ట మధు,శరత్, వినీత్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల సరఫరాపై కట్టుదిట్టమైన నిఘా

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సిసి కెమెరాలు:జిల్లా ఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ** : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ,రోడ్డు ప్రమాదాల నివారణ,మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విదంగా సమర్ధవంతగా పని చేయాలనీ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నేర సమీక్ష సమావేశం లో జిల్లాలో నమోదైన పోక్సో,గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి,పెండింగ్ కేసుల స్థితి, కోర్టు విచారణలు,నేరస్తులకు శిక్షలు పడేలా తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ యు ఐ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి కోర్టుల్లో చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయాలని అధికారులను సూచించారు.అదేవిధంగా కోర్టు అధికారులతో సమన్వయం చేస్తుకుం టూ సీసీ నంబర్లు పెండింగ్, వారెంట్ల అమలు, పెండింగ్ సమన్ల తక్షణ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని,రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. దొంగతనాలు, చోరీలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాల నివారణకు రాత్రి, పగలు గస్తీలు నిర్వహించాలని, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు.ఈసమావేశంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, ఎస్‌బీ డిఎస్‌పి మల్లారెడ్డి, నల్లగొండ డిఎస్‌పిలు శివరాం రెడ్డి,రాజశేఖర రాజు,శ్రీనివాసరావు,రవి,లక్ష్మీనారాయణ,సీఐలు,ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీంకు ఎస్‌సి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లాలో చదువుతున్న ఎస్‌సి విద్యార్థిని విద్యార్థులు కొరకు 202627 విద్యా సంవత్సరమునకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఇంగ్లీష్ మీడియం 1వ తరగతి (డే స్కాలర్), 5వ తరగతి (రెసిడెన్సియల్) విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె. దయానంద రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం తేది.01.04.2026 తర్వాత రూ.1,50,000 లోపు గ్రామీణ ప్రాంతములలో నివసించే వారికి, రూ.2లక్షల లోపు పట్టణ ప్రాంతంలో నివసించే వారికి ఉండాలన్నారు. కుల, ఆదాయ, నివాస, జనన ధృవీకరణ పత్రము (మీ సేవచే ధృవీకరణ పత్రము), రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ప్రస్తుతము చదువుతున్న పాఠశాల బోనోఫైడ్, రెండు పాసు పోర్ట్ సైజు ఫోటోలతో సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయము నందు దరఖాస్తు ఫారములు పొందాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములను తేది.06.06.2026 సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయములో సమర్పించాలని కోరారు. ఈ పథకమునకు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ సభ్యులలో గతములో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నందు గానీ, బెస్ట్ అవైలబుల్ స్కీం కింద గాని చదువుతున్నట్లు అయితే ఇప్పుడు దరఖాస్తు చేసుకునుటకు అవకాశం లేదన్నారు. 1వ తరగతిలో దరఖాస్తు చేసుకొనుటకు తేది.13.06.2020 నుండి 12.06.2021 వరకు గల మధ్య కాలములో జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. దీనికి సంబంధించిన కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో తేది.10.06.2025 ఉదయం 11 గంటలకు డ్రా తీయబడుతుందన్నారు. ఆలస్యముగా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని పేర్కొన్నారు.

## పేదల జోలికి వస్తే ఊరుకోం



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : సూర్యాపేటలో పేదల భూములు, ఇళ్ళ నిర్మాణాల విషయంలో జరుగుతున్న అన్యాయాలను సహించబోమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధి గాంధీనగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నల్లు ఉమాజ్యోతిరెడ్డి, నల్లు చిత్రరంజన్ రెడ్డిపై కేసు నమోదైనప్పటికి ఇప్పటి వరకు సరైన చర్యలు తీసుకోలేదన్నారు. జగదీష్ రెడ్డి ప్రోత్సాహంతో అక్రమాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. చట్టబద్ధంగా అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు చేపడుతున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న ఇనుప సామాగ్రి, రాడ్లు వంచే యంత్రాలను మున్సిపల్ సిబ్బంది బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, టౌన్ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఆత్మకూర్ మండల పార్టీ అధ్యక్షుడు బొల్లె సైదులు, సైదులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

ఎల్‌బి నగర్ ఎంఎల్ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సెంట్రింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పఎల్‌బి నగర్ ఎంఎల్ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బియన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని టీచర్స్ కాలనీలో సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఏ మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు భద్రతా పరికరాలు అందించాలని, పని సమయంలోప్రమాదాలకు గురైన వారికి తగిన నష్టపరిహారం కల్పించాలని ప్రభుత్వానికి కోరారు. అనంతరం కార్మికులకు కార్మిక కార్డును అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, మాధవరం నర్సింహారావు, మల్లేష్ గౌడ్, అధ్యక్షులు నర్సింహా, రాఘవేంద్ర, కార్యదర్శి గోవిందు, అంజి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే సమ్మెబాట



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికై సమ్మెబాట పట్టినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నడికూడ ఆంజనేయులు యాదవ్ వివరించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు యాదవ్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై గత ఆరు సంవత్సరాల నుండి పోరాటం చేస్తున్నామని ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సెంట్రింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రంగంపల్లి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు సబావత్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి పత్లావత్ రమేష్ నాయక్, కోశాధికారి టేశాధికారి నర్సింహులు, శ్రీనునాయక్, చందు, అలిబాయి, రాములు, చౌలపల్లి రవి, రామచంద్ర, సూర్య, రమేష్ పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నూతన అధ్యక్షులు కృషి చేయాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన వివిధ మండలాల అధ్యక్షులను, మున్సిపాలిటీల అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. కేశంపేట మండల అధ్యక్షుడిగా ఏ.రమేష్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడిగా రాయికల్ శ్రీనివాస్, నందిగామ మండల అధ్యక్షుడిగా కుమార స్వామి గౌడ్, కొత్తూరు మండల అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి, కొందుర్గు మండల అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి, జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షుడిగా జాకారం శేఖర్, షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా నల్లమోని శ్రీధర్, కొత్తూరు మున్సిపల్ అధ్యక్షుడిగా జాండగూడెం సుదర్శన్ గౌడ్‌లను ఎన్నుకోవడం అభినందనీయమని కరుణాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడంతోపాటు పార్టీని బూత్ స్థాయి నుండి పటిష్టం చేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## పశువుల రవాణాలో నిబంధనలు పాటించాలి : డిసిపి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** జంతువులపై క్రూరత్వం నివారణకు, పశువుల సురక్షిత రవాణాలో నియమ నిబంధనలను పాటించాలని మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మాల్ గ్రామంలోని పశువుల సంతను అయన పరిశీలించారు. పశువుల యజమానులు, వ్యాపారులు రవాణా డ్రైవర్లు అక్రమ వధను నివారించాలన్నారు. డ్రైవర్లు తప్పని సరిగా చెల్లుబాటు అయ్యే పత్రాలను కలిగి ఉండాలన్నారు. పశు వైద్యాధికారులు రవాణాకు ముందు పశువు అరోగ్య పరిస్థితిని పరిశీలించి పిట్ నేస్ సర్టిపికేట్టు జారి చేయాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహింపట్నం ఎసిపి రాజు, యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి,ఎస్ఐ మధు కుమార్, పోలిస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి సైనికుడిలా పని చేయాలి

ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన మండల అధ్యక్షులు సైనికుల్లా పని చేయాలని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యులుగా నియమితులైన మేడిపల్లి గ్రామానికి చేందిన మోటే శ్రీశైలం ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర యువనాయకులు అభిషేక్‌రెడ్డిని కలిసి శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సంధర్బంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తకు ఎలాంటి అపద వచ్చిన ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ముచ్చర్ల సంపత్,ఉప సర్పంచ్ మధుకర్‌రెడ్డి,అడాల గణేశ్,మాజీ సర్పంచ్ ఎరుకలి బాల్‌రాజ్, గ్రామ శాఖ అధ్యక్షులు కంపకూరి బాల్‌రాజ్, జంగారెడ్డి, మహెశ్, మల్లేశ్, జంగయ్య, మేడిపల్లి గ్రామానికి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాట్సాప్ మీసేవలోకి మరిన్ని జిహెచ్‌ఎంసి సేవలు

## ప్రజలకు అందుబాటులో తొమ్మిది కొత్త సేవలు.. రాష్ట్ర ఐటి, కమ్యూనికేషన్స్ శాఖ కీలక నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా పౌరులకు మరో భారీ ఊరటనిచ్చింది. జిహెచ్‌ఎంసి పరిధిలోని మరికొన్ని కీలక పౌర సేవలను ఇకపై మీసేవ వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా సులభంగా పొందేలా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత పారదర్శకంగా, వేగంగా సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డి) విభాగం ప్రకటించింది. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ సేవలను మరింతగా ఆధునీకరిస్తున్నారు. 2025 నవంబర్ 18న ప్రారంభమైన ఈ అదనపు డిజిటల్ వాట్సాప్ ఛానల్‌కు ప్రజల నుంచి ఇప్పటికే విశేష స్పందన లభిస్తోందని చెప్పారు.

### మంచి స్పందన లభిస్తోంది : ఐటి, కమ్యూనికేషన్స్ శాఖ కమిషనర్

వాట్సాప్ ఆధారిత మీసేవకు ప్రజల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ప్రజలు ఎక్కువగా జనన ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పోలీస్ చలానాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, బిఐఈ ఫలితాల కోసం ఈ




వేదికను ఎక్కువగా వినియోగిస్తున్నారు. నిరంతరం డిజిటల్ సేవలను విస్తరించడం ద్వారా ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో విశ్వసనీయతను పెంచడమే కాకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమను తగ్గించడమే తమ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ ఐటి, కమ్యూనికేషన్స్ శాఖ కమిషనర్ తెలిపారు.

### కొత్తగా అందుబాటులోకి వచ్చిన 9 సేవలు..

- ఆస్తి పన్ను పునఃసమీక్ష
- జనన ధ్రువీకరణ పత్రంలో సవరణలు
- మరణ ధ్రువీకరణ పత్రంలో సవరణలు
- బర్త్ హోమ్ (ఇంటి వద్ద జనన నమోదు)
- డెత్ హోమ్ (ఇంటి వద్ద మరణ నమోదు)
- ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ
- ఆస్తి పత్రాల్లో పేరు సవరణ
- ప్రాపర్టీ ట్యాక్స్ (ఆస్తి పన్ను) సేవలు
- ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ (వ్యాపార లైసెన్స్ పునరుద్ధరణ)

### వాట్సాప్ ద్వారా సేవలు పొందే విధానం..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పౌరులు ఎవరైనా తమ మొబైల్ ఫోన్ ద్వారా చాలా సులభంగా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చు.

**స్టెప్ 1 :** మొదటగా మీ మొబైల్‌లో 8096958096 నెంబర్‌ను 'మీసేవ తెలంగాణ' పేరుతో సేవ్ చేసుకోవాలి.

**స్టెప్ 2 :** వాట్సాప్ ఓపెన్ చేసి, ఆ నంబర్కు 'హాయ్' అని మెసేజ్ పంపాలి.

**స్టెప్ 3 :** చాట్‌బాట్ మెనూలో మీకు కావలసిన సేవను ఎంచుకుని, అక్కడ కనిపించే 'ఓపెన్ సర్వీస్' ఆప్షన్ క్లిక్ చేయాలి.

**స్టెప్ 4 :** స్క్రీ వచ్చే ఫారమ్‌లో అడిగిన వివరాలను పూర్తి చేసి, అవసరమైన రుసుము చెల్లిస్తే మీ దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది.

## సహజ ప్రసవాల సంఖ్య పెంచాలి

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సహజ ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా చూడాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి ఆదేశించారు.
మంగళవారం రాజేంద్ర నగర్ మండలం మైలార్ దేవ్ పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఓ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను, హాజరు పట్టికను,హాస్పిటల్ లోని బెడ్లను,మెడిసిన్ ఎక్స్పైరీ డేట్ లను హాస్పిటల్ ఆవరణను పరిశీలించారు. గర్భిణీలకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.అన్ని రకాల వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరిగేలా చూడాలని ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా క్లీనిక్ ఏర్పాటు చేయాలని,అదేవిధంగా మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. రక్తహీనత ఉన్నవారికి సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని వారు వేచి ఉండే ప్రాంతంలో కూర్చునే ఏర్పాట్లు, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు చేరుకోవాలని, వైద్యులు మరియు సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సేవా భావంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### యువత నైపుణ్యాలు పెంచుకుంటే

## భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి




**ప్రజాపక్షం/రంగారెడ్డి :** యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళి" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా "యూత్ అండ్ స్పోర్ట్స్" థీమ్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ లో "కెరీర్ స్కిల్ డెవలప్‌మెంట్ డే ఎంపవర్ స్కిల్స్, ఎంపవర్ ఫ్యూచర్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను చేసుకొని స్వయం ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలను పొందాలని యువతకు సూచించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ కోర్సులపై జిల్లా స్థాయిలో వర్చువల్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పిస్తూ పలు అంశాలపై వివరాలు అందించారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎల్ శ్రీలత, జిల్లా యువజన సేవలు, క్రీడల అధికారి (డివైఎస్ఓ )స్వర్ణలత, క్రీడా కోచ్‌లు, సిబ్బంది, యువత పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన ఎమ్మెల్యే వీర్లపల్లి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాలకు భూ సేకరణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీటి ప్రాజెక్టులు ఎంతో ముఖ్యమని, త్వరత గతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. భూ సేకరణకు అవసరమైన నిధులు త్వరగా మంజూరు చేసేందుకు అధికారులు కృషి చేయాలని, జాప్యం లేకుండా చూడాల్సిన బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

## జిల్లాస్థాయి సభలకు ప్రత్యేక ఏర్పాట్లు

-రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న నిర్వహించే జిల్లాస్థాయి సభలను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మే 22వ తేదీన జిల్లాస్థాయి సభలు సమర్ధవంతంగా నిర్వహించాలనే ప్రభుత్వ సూచనల మేరకు రంగారెడ్డి జిల్లాలో జిల్లాస్థాయి సభను నిర్వహించేందుకు అనువైన వేదికను ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సభను ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాస్థాయి సభలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, మంత్రులకు, ఎంపిలు, ఎమ్మెల్సీలకు, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాస్థాయి సభను రాష్ట్ర గీతంతో ప్రారంభించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చదివి వినిపించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ అభివృద్ధి పథకాల పై చర్చించాలని, జిల్లాస్థాయి సభలో ఆర్డీఓలు, తహశీల్దార్, ఎంపిడిఓ, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఉండేలా చూడాలని సూచించారు. మహిళలు వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని, ప్రదర్శన కోసం స్క్రీన్ మరియు ప్రొజెక్టర్ ఏర్పాటు చేయాలని, వేసవి కాలం అయినందున త్రాగునీరు, నీడ కోసం ఏర్పాట్లు చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ బ్యానర్ ప్రదర్శించాలని సూచించారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి జిల్లాస్థాయి సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.. ఈ జూమ్ మీటింగ్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌లు (రెవెన్యూ)కె చంద్రా రెడ్డి, డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి (లోకల్ బాడీస్) , డిఆర్ఓ శారద, జిల్లా పరిషత్ సిహెచ్ కృష్ణారెడ్డి, సిపిఓ సౌమ్య, డిపిఓ వి సురేశ్ మోహన్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పంచాయతీలో, పోలీస్‌స్టేషన్‌లో న్యాయం లేదంటూ

## ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళ

ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా స్పందించని పోలీసులు

నాచావుకు వారే కారణమంటూ సూసైట్ నోట్, గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు

**ప్రజాపక్షం/కొందుర్గు:** రాజకీయ కక్షలను దృష్టిలో పెట్టుకొని తమపై తీవ్ర దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనే మనస్థాపంలో చెన్నమ్మ (50) అనే మహిళ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగెళ్ళపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి కుమారుడు ఎద్దు సందీప్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తంగెళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎద్దు నరేష్, సురేష్, లక్ష్మమ్మ, అనిత, స్వరూపలు మా అమ్మపై తీవ్రపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు అనేక మార్లు దాడులకు పాల్పడ్డారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాలుగు రోజుల క్రితం కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే మా అమ్మ తీవ్ర మనస్థాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. నా మృతికి ఎద్దు నరేష్, సురేష్, లక్ష్మమ్మ, అనిత, స్వరూపలే కారణమంటూ సూసైట్ నోట్ సైతం రాసినట్లు మృతురాలి కుమారుడు సందీప్ తెలిపారు. ఫిర్యాదు చేసిన తరువాత పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తే రాలేదని, కేసు నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని, అందుకే మా అమ్మ ఆత్మహత్య చేసుకుందని వివరించారు. రాజకీయ కక్షలను దృష్టిలో పెట్టుకొని మా కుటుంబంపై వ్యక్తిగత దాడులు చేయడంతో పాటు మానసికంగా చిత్రహింసలకు గురి చేశారని మృతురాలి కుమారుడు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సకాలంలో స్పంధించకపోవడం తోనే ఇంతపెద్ద సంఘటన చోటు చేసుకుందని వాపోయారు. తనకు న్యాయం చేయాలని, పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

### బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేశాం

కొందుర్గు ఎస్ఐ రవీందర్‌నాయక్

కొందుర్గు మండల పరిధిలోని తంగెళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎద్దు చెన్నమ్మ, ఆమె కుమారుడు ఎద్దు సందీప్‌లు ఈనెల 14వ తేదిన ఫిర్యాదు చేశారని కొందుర్గు ఎస్ఐ రవీందర్‌నాయక్ వివరించారు. దాయాదుల మధ్య జరిగిన ఘర్షనలు కాబట్టి గ్రామంలోని పెద్దల సమక్షంతో సమస్యను పరిష్కరించుకోవాలని స్థానిక సర్పంచ్‌కు సైతం సూచించినట్లు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే వారిని పిలిపించేందుకు యత్నించగా రాలేదు..దాంతో సమస్య పరిష్కారం అయిందని భావించినట్లు తెలిపారు. కానీ ఎద్దు చెన్నమ్మ మనస్థాపంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంటుందని అనుకోలేదని వివరించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదుపై నింధితులను అదుపులోకి తీసుకొని విచారిస్తామని తెలిపారు.

### ధాన్యం తరలింపునకు రవాణా సౌకర్యాలు

## అందుబాటులో ఉండేలా చర్యలు



అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ధాన్యం తరలింపు కోసం రవాణా సౌకర్యాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ఆదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లోని పిపిసి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భం గా రైతులతో మాట్లాడారు. వరి తరలింపు కోసం రవాణా సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని పిపిసి ఇన్‌చార్జ్‌కు సూచించారు. అంతకు ముందు ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ లో ఉన్న బాలబాలికలకు విద్యా, వినోద, అవగాహన పరమైన పర్యటనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఓ.ఎస్ హోమ్, అంజనీదేవి చారిటబుల్ ట్రస్ట్, దక్కన్ ఫౌండేషన్, పవన్ ఫౌండేషన్ సంస్థలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు హైదరాబాద్‌లోని పర్యాటక ప్రదేశాలైన రామోజీ ఫిలిం సిటీ, మృగవని నేషనల్ పార్క్, శిల్పారామం, బొటానికల్ గార్డెన్ లను సందర్శించారు. పిల్లలు ఈ పర్యాటక ప్రాంతాలను ఆసక్తిగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ పర్యటన ద్వారా పిల్లలకు ప్రకృతి, పర్యావరణం, జంతు సంరక్షణ, చలనచిత్ర రంగం మరియు పర్యాటక రంగంపై అవగాహన పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసం కలిగేలా కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారి ఎల్.శ్రీలత, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ జె హరీష్, అధికారి ఫారెస్ట్ డిపార్ట్మెంట్, టూరిజం డిపార్ట్మెంట్, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### యశ్వంత్‌వర్మపై ఆరోపణలు.. లోక్‌సభ స్పీకర్‌కు

# విచారణ కమిటీ నివేదిక

- నిర్ణీత సమయంలో పార్లమెంట్ ఉభయ సభల ముందు ప్రవేశపెడతామని లోక్‌సభ సచివాలయం వెల్లడి



**న్యూఢిల్లీ :** తన అధికారిక నివాసంలో లెక్కల్లో చూపని నగదు లభించిందన్న ఆరోపణలపై తొలగింపు చర్యలు ప్రారంభించిన జస్టిస్ యశ్వంత్‌వర్మపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతోన్న కమిటీ తన నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. న్యాయమూర్తుల (విచారణ) చట్టం 1968 ప్రకారం...చట్టబద్ధమైన అవసరాలకు అనుగుణంగా సోమవారం సమర్పించిన నివేదికను పార్లమెంట్ ఉభయ సభల ముందు సమయానికి ప్రవేశపెడతామని లోక్‌సభ సచివాలయం తెలిపింది. సాధారణంగా జూలై 3వ వారంలో ప్రారంభమయ్యే వర్షాకాల సమావేశాల్లోనే తదుపరి పార్లమెంట్ సమావేశమయ్యే అవకాశం ఉంది. ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని 2025 ఆగష్టు 12న స్పీకర్ ఏర్పాటు చేశారు. 2025 మార్చి 14వ తేదీ రాత్రి జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీ అధికారిక నివాసంలోని ఒక స్టోర్‌రూమ్‌లో అగ్నిప్రమాపక సిబ్బంది భారీ మొత్తంలో కాలిపోయిన కరెన్సీని కనుగొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. యశ్వంత్ వర్మ అప్పుడు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఉండి, అనంతరం తన మాతృసంస్థ అయిన అలహాబాద్ హైకోర్టుకు తిరిగి వచ్చారు. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ నగదు దాచిపెట్టినట్లు ఆరోపణలు ఉన్న నిర్దిష్ట స్టోర్ రూమ్‌పై జస్టిస్ యశ్వంత్ వర్మకు 'ప్రత్యక్ష' లేదా 'పరోక్ష నియంత్రణ' ఉందని నిర్ధారించింది. 2025 జూలైలో 200మందికి పైగా ఎంపీలు న్యాయమూర్తిని తొలగించండి అనే ఒక తీర్మానంపై సంతకాలు చేశారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టంలో పేర్కొన్న విధానం ద్వారా మాత్రమే సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తిని ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించగలదు. గతేడాది ఆగష్టులో స్పీకర్ బిర్లా ఆరోపణలను పరిశీలించడానికి ముగ్గురు సభ్యులతో కూడిన న్యాయమూర్తుల విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. అయితే పార్లమెంట్ ద్వారా తొలగించబడే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్‌వర్మ ఇటీవల అలహాబాద్ హైకోర్టు జడ్జిగా రాజీనామా చేయడంతో ఆయనపై తొలగింపు చర్యలు 'నిష్ఫలం' అయ్యాయి. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియమాకం, తొలగింపు ప్రక్రియ తెలిసిన వ్యక్తులు చెప్పినదాని ప్రకారం...ఒక సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, ఒక న్యాయమూర్తి రాష్ట్రపతికి రాజీనామాను సమర్పించి, అతడు లేక ఆమె ఆ ప్రతిని బహిరంగపర్చిన వెంటనే వారు 'రాజీనామా చేసినట్లు'గా భావించబడతారు. న్యాయమూర్తి రాజీనామా రాష్ట్రపతి ఆమోదానికి లోబడి ఉండదని వారు తెలిపారు. ప్రొసీజర్ ప్రకారం..రాష్ట్రపతి అధికారిక ఆమోదం ఇస్తారు. ఆ తర్వాత న్యాయశాఖ, లా మినిస్ట్రీ ద్వారా నోటిఫై చేయబడుతుంది. జస్టిస్ యశ్వంత్‌వర్మ పేరు ఇప్పటికీ అలహాబాద్ హైకోర్టు సిట్టింగ్ జడ్జిగా కనిపిస్తుంది. 'సుప్రీంకోర్టు తీర్పు, పూర్వపు తీర్పుల ప్రకారం జస్టిస్ యశ్వంత్‌వర్మ రాజీనామా చేసి ప్రస్తుతం సాధారణ పౌరుడుగా ఉన్నారు. దీని ప్రకారం ఒక మాజీ న్యాయమూర్తిని పార్లమెంట్ తొలగించజాలదు' అని ఈ ప్రక్రియ గురించి తెలిసిన ఒక వ్యక్తి చెప్పారు. వాస్తవానికి జస్టిస్ వర్మ 62ఏళ్ల వయసును పూర్తిచేసుకుని 2031 జనవరి 5న పదవీవిరమణ చేయాల్సి ఉంది. వర్మ సిట్టింగ్ జడ్జిగా ఉన్నప్పుడు విచారణ కమిటీ తన పనిని ప్రారంభించింది. ఆయన తదనంతర రాజీనామా కమిటీ పనితీరుపై ఎలాంటి ప్రభావం చూపలేదు. 'ఆరోపణలపై ప్యానెల్ విచారణ జరిపినప్పుడు అది జ్యుడీషియల్ వర్క్‌గా పరిగణించబడుతుంది. వారు తమ పనిపై ఒక నివేదికను సమర్పించారు. ఇది దానికి సమాంతరమైన విషయం' అని న్యాయరంగ నిపుణుడు చెప్పారు. నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తర్వాత, ఉభయ సభలు ఏమి నిర్ణయిస్తాయే వేచి చూడాల్సి ఉందని ఆయన చెప్పారు.

### స్వచ్ఛ ఇంధనం, డిజిటలైజేషన్, వాణిజ్యంపై...

# ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేద్దాం

- నార్డిక్ దేశాల ప్రధానులతో చర్చల్లో ప్రధాని మోదీ
- 3వ భారత్–నార్డిక్ శిఖరాగ్ర సమావేశానికి ముందు వారితో వేర్వేరుగా సమావేశాలు

**ఓస్లో :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఐస్‌లాండ్, ఫిన్‌లాండ్, డెన్‌మార్క్ ప్రధాన మంత్రులలతో వేర్వేరుగా సమావేశమై స్వచ్ఛఇంధనం, వాణిజ్యం, సుస్థిరత, డిజిలైజేషన్ వంటి రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే మార్గాల విషయమై చరించారు. 3వ భారత్–నార్డిక్ శిఖరాగ్ర సమావేశానికి ముందు ప్రధానమంత్రి మోదీ ఈ సమావేశాలను నిర్వహించారు. ఐస్‌లాండ్ ప్రధానమంత్రి క్రిష్టున్ ఫ్రోస్టాడోట్టిర్, ఫిన్‌లాండ్ ప్రధానమంత్రి పెట్టెరి ఓర్పో, డెన్‌మార్క్ ప్రధానమంత్రి మెట్టె ఫ్రెడ్రిక్‌సెన్‌లతో జరిపిన చర్చల సందర్భంగా భారత్ ఈ మూడు నార్డిక్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల మొత్తం గమనం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు.'ఐస్‌లాండ్ ప్రధాని క్రిష్టున్ ఫ్రోస్టాడోట్టిర్‌తో ఒక అద్భుత సమావేశం జరిగింది. ఐస్‌లాండ్‌తో స్నేహానికి భారతదేశం ఎంతో విలువ ఇస్తుంది' అని ఐస్‌లాండ్ ప్రధాన మంత్రితో సమావేశం అనంతరం మోదీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. స్వచ్ఛ ఇంధనం, మత్స్య పరిశ్రమ, సుస్థిరత, భూతాప



శక్తి, కార్బన్ సంగ్రహణ, నిల్వ వంటి రంగాలలో సంబంధాలను మెరుగుపర్చుకునే మార్గాలపై ఇరు పక్షాలు చర్చించాయని ఆయన అన్నారు.'నీలి ఆర్థికవ్యవస్థకు సంబంధించిన రంగాలలో ఐస్‌లాండ్ ప్రావీణ్యం ప్రశంసనీయం. చరిత్రాత్మక భారత్–ఇఎఫ్‌టిఎ టిఇపిఎ వాణిజ్య పెట్టుబడి సంబంధాలకు కూడా ఊపునిస్తుందని మేము ఆశిస్తున్నాం' అని మోదీ అన్నారు.విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ప్రకారం...ఓస్లోలో జరిగిన 3వ భారత్–నార్డిక్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా మోదీ ఫ్రోస్టాడోట్టిర్‌ల మధ్య జరిగిన చర్చల్లో పునరుత్పాదక ఇంధనం, ఆవిష్కరణలు, డిజిటల్ టెక్నాలజీలు, సృజనాత్మక ఆర్థికవ్యవస్థ, ఆర్కిటిక్ సహకారం, ప్రజల మధ్య ఇచ్చిపుచ్చుకోవడం వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. 'పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై కూడా నాయకులు తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు' అని ఆయన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. ఫిన్‌లాండ్ ప్రధానమంత్రి ఓర్పోతో జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడిలో సహకారాన్ని పెంపొందించడం, డిజిటలైజేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, 5జి, 6జి, క్వాంటం టెక్నాలజీలు, సుస్థిరత, పునరుత్పాదకశక్తి, వలయాకార ఆర్థికవ్యవస్థల గురించి మోదీ చర్చించారు. వారు ఆవిష్కరణ, విద్య, చలనశీలత, ప్రజల మధ్య సంబంధాల గురించి కూడా చర్చించారని జైస్వాల్ తెలిపారు. మోదీతోపాటు నార్వే, డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్‌లాండ్, స్వీడన్ దేశాల నాయకులు పాల్గొంటున్న 3వ భారత్–నార్డిక్ శిఖరాగ్ర సమావేశానికి ఓస్లో ఆతిథ్యం ఇస్తోంది. 5దేశాల పర్యటనలో భాగంగా మోదీ స్వీడన్ నుంచి నార్వేకు చేరుకున్నారు. ప్రధానమంత్రి మోదీ మే 15 నుండి 20 వరకు యుఎఇ, నెదర్‌ల్యాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీలలో పర్యటిస్తున్నారు.ఈ పర్యటనలో భాగంగా నరేంద్రమోదీ నార్వే నుంచి ఇటలీకి వెళ్ల నున్నారు. రెక్జావిక్‌లోని భారత రాయబార కార్యాలయం వెబ్‌సైట్ ప్రకారం...భారతదేశం, ఐస్‌లాండ్ సన్నిహిత సాంస్కృత సంబంధాలను పంచుకుంటున్నాయి. ఐస్‌లాండ్ వాసులు యోగా, శాస్త్రీయ సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలతో సహా భారతీయ సంస్కృతిపై ఆసక్తి చూపుతున్నారు. ఐస్‌లాండ్‌లో ప్రస్తుతం సుమారు 600మంది భారతీయులు నివసిస్తున్నారు.భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓస్సూర్, వెర్కిస్, ఆల్వోటెక్, మారెల్ వంటి ఐస్‌లాండిక్ సంస్థలతో ఈ రెండు దేశాలు బలమైన వ్యాపార భాగస్వామ్యాలను కొనసాగిస్తున్నాయి.

# కుక్కల కారుణ్య మరణానికి 'సుప్రీం' అనుమతి

- తరచుగా కుక్క కాట్లతో ప్రజల భద్రతకు నిరంతర ముప్పుగా ఉన్నచోట కారుణ్య మరణాన్ని ఆశ్రయించవచ్చని ఆదేశం

**న్యూఢిల్లీ :** మానవ ప్రాణాలకు ముప్పును అరికట్టేందుకు, రేబిస్ సోకిన, నయంకాని వ్యాధులతో బాధపడుతున్న లేదా ప్రమాదకరమైనవిగా భావించిన వీధి కుక్కలకు కారుణ్య మరణాన్ని (యూథనేషియా) సుప్రీంకోర్టు మంగళవారం తొలిసారిగా అనుమతించింది. దేశంలో పెరుగుతున్న వీధి కుక్కల జనాభాను ఎదుర్కోవడానికి జస్టిస్‌లు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పలు ఆదేశాలు జారీ చేసింది. వీధి కుక్కలకు కారుణ్య మరణం విధించడమే తాము అధికారులకు, పౌర సంస్థల అధికారులకు జారీ చేస్తున్న అత్యంత ముఖ్యమైన ఆదేశమని ధర్మాసనం పేర్కొంది. వీధి కుక్కల జనాభా ఆందోళనకర స్థాయికి చేరిన ప్రాంతాలలో, తరచుగా కుక్క కాట్లతో ప్రజల భద్రతకు నిరంతర ముప్పుగా ఉన్నచోట పౌర అధికారులు కారుణ్య మరణాన్ని ఆశ్రయించవచ్చని అది పేర్కొంది. పశు వైద్య నిపుణుల అంచనా తర్వాత, జంతువులపై



క్రూరత్వ నివారణ చట్టం 1960, జంతు జనన నియంత్రణ నియమాలు 2023, ఇతర వర్తించే చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా ఈ చర్యతో పాటు ఇతర చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చని ధర్మాసనం తెలిపింది. ఢిల్లీలో వీధి కుక్కల కాటు వలన పిల్లలో రేబీస్ వ్యాధి వ్యాపిస్తోందన్న మీడియా నివేదికపై, గత ఏడాది జూలై 28న సుమోటోగా స్వీకరించిన కేసులో సుప్రీం కోర్టు ఈ ఉత్తర్వులను జారీ చేసింది. వీధి కుక్కలను వేరే చోటికి తరలించడం, వాటికి సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయడంపై తాను గతంలో ఇచ్చిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను మంగళవారం కోర్టు కొట్టివేసింది. గౌరవప్రదంగా జీవించే హక్కులో, కుక్క కాటు దాడుల నుండి హాని కలిగే ప్రమాదం లేకుండా స్వేచ్ఛగా తిరిగే హక్కు కూడా ఇమిడి ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రజా ప్రదేశాల నుండి పట్టుకున్న కుక్కలకు టీకాలు వేయడం/సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేసిన తర్వాత వాటిని తిరిగి అదే ప్రదేశంలో వదలకూడదన్న తన గత ఆదేశాన్ని అమలు చేసేలా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. జంతు జనన నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేయడానికి చర్యలు తీసుకోవాలని కూడా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. 'ప్రతి జిల్లాలో అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది, శస్త్రచికిత్స సౌకర్యాలు, సహాయక లాజిస్టిక్స్‌తో కూడిన పూర్తిస్థాయి ఎబిసి (జంతు జనన నియంత్రణ) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి' అని ధర్మాసనం పేర్కొంది. 'పిల్లలు, అంతర్జాతీయ ప్రయాణికులు, వృద్ధులు కుక్క కాటు ఘటనలకు బాధితులైన కఠిన వాస్తవ పరిస్థితులను కోర్టు విస్మరించజాలదు' అని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గత సంవత్సరం నవంబర్ 7న, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రైల్వే స్టేషన్ల వంటి ప్రాంతాలలో కుక్క కాటు ఘటనలు 'ఆందోళనకరంగా పెరగడాన్ని కోర్టు గమనించి, వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స, టీకాలు వేసిన తర్వాత వాటిని నిర్దేశిత ఆశ్రయాలకు తరలించాలని ఆదేశించింది.

# బిజెపిలో నాయకత్వ లక్షణాలు కొరవడ్డాయ్

### దూరదృష్టి లోపించింది : ఖర్గే



**న్యూఢిల్లీ :** ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. సామాన్యులను దోచుకోవడం, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి అమెరికా నుంచి 'ఫ్రీ పాస్' కల్పించడం ప్రధాని రాజీపడిన విధానాన్ని చూపిస్తోందని ఆయన ఆరోపించారు. బిజెపికి దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు కొరవడ్డాయన్నారు. ఆర్థిక రంగంలో మోదీ విఫలమయ్యారని, ఆయన ప్రభుత్వం తమ వైఫల్యాలపై ఆత్మపరిశీలన చేసుకొని, అందరినీ కలుపుకొని పరిష్కారాలు కనుగొనాలని ఖర్గే సూచించారు. వారం లోపే పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు సుమారు 90 పైసలు పెంచడంపై ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'ధరల పెంపు జరిగిన కేవలం నాలుగు రోజుల తర్వాత, మోదీ ప్రభుత్వం మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. పొదుపు గురించి ఉపన్యాసాలు ఇస్తూ, తమ వైఫల్యాల భారాన్ని ప్రజలపై మోపుతూ, అందుకు రంగం సిద్ధం చేసిన ఈ ప్రయత్నం పూర్తి స్థాయిలో కొనసాగుతోంది' అని ఖర్గే 'ఎక్స్' ఛానెల్‌లో ఆరోపించారు. సామాన్య ప్రజలను దోచుకుంటూ, అదానీకి అమెరికా నుంచి స్వేచ్ఛనివ్వడం — ఇదే మోదీజీ రాజీపడిన విధానం అని కాంగ్రెస్ అధినేత ఆరోపించారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్‌పై ఉన్న అన్ని క్రిమినల్ ఆరోపణలను యుఎస్ న్యాయ శాఖ శాశ్వతంగా ఉపసంహరించుకోవడాన్ని ఖర్గే ప్రస్తావించారు. రష్యా చమురు కొనుగోలు అంశాన్ని ఖర్గే ప్రస్తావిస్తూ 'తాను 'విశ్వగురువు' అని తప్పుడు గర్వంతో గాలిని నింపే మోదీజీ, రష్యా చమురు కొనుగోలుకు ఇచ్చిన అనుమతిని ఒక నెల పొడిగించమని అమెరికాను బతిమాలారు. ఆయన ఇలా చేసిన ప్రతిసారీ, 140 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఈ స్థాయికి దిగజారలేదు. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే: ప్రభుత్వం ప్రకారం, దీనికి అనుమతి ఉన్నట్లయితే, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు భారాన్ని సామాన్య ప్రజలపై ఎందుకు మోపుతున్నారు? అని ఆయన ప్రశ్నించారు. సంక్షోభం వచ్చినప్పుడు బిజెపి నాయకులు ఎన్నికలతో బిజీగా ఉన్నారని, ఆ తర్వాత దోపిడీ కోసం ఒక ప్రణాళికను రూపొందించడానికి వారు తప్పుడు మాటలు అల్లారని, ఈలోగా అత్యంత ప్రియమైన మిత్రుడిని కూడా గట్టెక్కించారని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. విదేశాల్లో ప్రాయోజిత ప్రచార కార్యక్రమాలు చేసినంత మాత్రాన విశ్వగురువు అయిపోరు... మోదీ జీ, ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడాలని సూచించారు.

# ఎస్‌పి-కాంగ్రెస్ పొత్తు కొనసాగుతోంది

### సీట్లు కాదు, విజయమే తమ సూత్రం : అఖిలేశ్ యాదవ్



**న్యూఢిల్లీ :** ఎన్నికల్లో పొత్తులపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పష్టతనిచ్చారు. తమ భాగస్వాములతో పొత్తు భవిష్యత్ ఎన్నికలలో కూడా కొనసాగుతుందని, సీట్లు కాదు, విజయమే తమ సూత్రం అని అన్నారు. అమర్ ఉజాలా పత్రిక నిర్వహించిన ఒక కార్యక్రమంలో యాదవ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి ప్రచారం చేస్తారా అని ప్రశ్నించగా, పొత్తులను నడపడంలో తమ పార్టీకి అపారమైన అనుభవం ఉందని, ఈ ఏర్పాటు వల్ల తమ మిత్రపక్షాలకు ఎల్లప్పుడూ ప్రయోజనం చేకూరేలా చూసుకుంటుందని అన్నారు. 'మేము అనేక పొత్తులు పెట్టుకున్నాము. మాకు పొత్తుల అనుభవం ఉంది, సమాజ్‌వాదీ పార్టీ ఎల్లప్పుడూ తన మిత్రపక్షాలకు ప్రయోజనాలు చేకూర్చింది. మేము ఎవరినీ ఎప్పుడూ మోసం చేయలేదు. నేడు ఉన్న పొత్తు ముందుకు కూడా కొనసాగుతుంది' అని అఖిలేశ్ బదులిచ్చారు. భవిష్యత్ పొత్తు చర్చలు సీట్ల కోసం బేరసారాల చుట్టూ కాకుండా, ఎన్నికల విజయాన్ని సాధించడం చుట్టూ తిరుగుతాయని ఆయన అన్నారు. 'కూటమిలో సీట్ల ప్రశ్న ఉండదు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా, సమస్య సీట్ల గురించి కాదు, విజయమే అని నేను చెప్పాను. అదే సూత్రం మళ్లీ పనిచేస్తుంది. ప్రశ్న సీట్ల గురించి కాదు, విజయమే అవుతుంది' అని ఆయన అన్నారు. కులు, అలాగే శాశ్వత ఉద్యోగం పొందని 69,000 మంది శిక్షామిత్రులే ప్రతిపక్ష ముఖమని యాదవ్ అన్నారు.

**పత్రికా ప్రకటన**

**Hasini Chit Funds Private Limited**

ఈ ప్రకటన ద్వారా అందరికీ తెలియజేయునది ఏమనగా, మా సంస్థ కార్యాలయం పాత చిరునామా: 7-7-305/1, కాపువాడ, అలంకార్, హనుమకొండ నుండి క్రింది కొత్త చిరునామాకు మారినది.

ఇ.నెం. 1-9-1231/2/5, 1వ అంతస్తు, శ్రీ లక్ష్మి గణపతి ఆలయం పక్కన, 80 అడుగుల రోడ్డు, సహకార నగర్, హంటర్ రోడ్, హనుమకొండ 506002.

కావున మా సంస్థకు సంబంధించిన అన్ని రకాల లేఖా వ్యవహారాలు, సమాచారము మరియు కార్యాలయ సంబంధిత పనులు ఇకముందు పై కొత్త చిరునామాకు పంపగలరు.

ఇట్లు
హాసిని చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్
హనుమకొండ.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 58 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD- Branch**
**... Disputant**
AND
**SAYYAD GOUSIYA & Others**
**... Opponents**

3. Mr. Mohammad Dasthagiri, S/o, Jahangeer, Age: 39 Years, Occ: Office Subordinate, O/o: Bondugula, H.No: 2-36, Kolluru, Alair, Nalgonda.
5. Mr. Syed Saleemuddin, S/o, Zaheeruddin, Age: 60 Years, Occ:Driver, O/o: DMHO Karimnagar, H.No: 1-79/1, Veenavanka, Karimnagar.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 57 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD- Branch**
**... Disputant**
AND
**CHERPALLI SHYAM SUNDER & Others**
**... Opponents**

2. Mr. Ballem Sathya Prakash, S/o, Yaddiah, Age: 33 years, Occ: AE-1/Maint/Cables/Metro East, O/o. Assistant Engineer Maintenance/ Cables/ Metro-East/ Tstransco, Hyderabad, H.No: 2-150/49/44/37, Mother Theresa Colony, Balagi Nagar, Vikalanguda, Apartment, Shameerpet, RangaReddy.
3. Ms. Damera Rajani Kumari, W/o, Polamari Suresh Babu, Age: 44 Years, Occ: Branch Maneger,Officer Sacle-III,Emp Id:3904, O/o. APGVB Warangal, H.No: 10-55, C.C Nagar Cherlapally, HCL Post, Kapra Ranga Reddy.
4. Ms. Bhupathi Sowjanya, W/o, Praveen, Age: 37 Years, Occ: Work Assistant B, Emp Id:7477, O/o. Nuclear Fuel Complex, Hyderabd, H.No: 3-10-1/664, Nehru Nagar, Mallapur, Ranga Reddy, Road No:5, Medchal.
5. Mr. Jannaikode Murali, S/o, Ramalingaiah, Age: 41 Years, Occ:Junior Lineman, O/o. Superintending Engineer, OMC/Metro-East/OU Campus, H.No: 2-106, Old Village Katepally, Atmakur,Yadadri Bhongir.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M**. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 99 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD-Branch**
**... Disputant**
AND
**KANUKUNTLA VIJAY KIRAN & Others**
**... Opponents**

2. Mr. Kondeti Vikranth, S/o, Sridhar, Age: 30 Years, Occ: Business, H.No: 4-78, Indira Colony, Wardhannapet, Warangal.
3. Mr. Ambala Shashi Kiran, S/o, Shedrak, Age: 39 Years, Occ: Business, H.No: 2-6-47, Ruthurford Colony, Circuit Road, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 98 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD-Branch**
**... Disputant**
AND
**ARROJU SRINIVAS & Others**
**... Opponents**

4. Mr. Pagidi Chembula Kanakachari, S/o, Yadagiri Age: 29 Years, Occ: Private Employee, H.No: 3-102/1, Peddapahad,Jangon.
5. Mr. Chinthakindhi Prabhakar, S/o, Yadagiri, Age: 35 Years, Occ: Private Employee, H.No: 3-37, Machupahad, Narmetta, Jangaon.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 96 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD- Branch**
**... Disputant**
AND
**NAMOJU MAHENDRA CHARY & Others**
**... Opponents**

1. Mr. Namoju Mahendra Chary, S/o. Rajamouli, Age: 37 years, Occ:Private Employee, H.No: 6-1-004p, Suryapet Road, Near Bharath Petrol Pump, Jangaon.
2. Mr. Ravva Narender, S/o, Mallesham, Age: 38 years, Occ: Business, H.No: 2-25/A, Near School, Velverthy, Nalgonda.
3. Mr. Morla Rajasekhar, S/o, Venkateshwar Rao, Age: 36 Years, Occ: Business, H.No: 6-6-125/D/1, Opp: HanumanTemple, Ghandhinagar, Kavatiguda, Hyderabad.
4. Mr. Chinthakindi Prabhakar, S/o, Yadagiri, Age: 36 Years, Occ: Business, H.No: 3-37, Machupahad, Narmetta, Jangaon.
5. Mr. Ganagani Somanadh, S/o, Harinadh, Age: 31 Years, Occ:Private Employee, H.No:6-1-9/1101, Near NMR Garden, Suryapet Road, Jangaon.
6. Ms. Vishwanadhula Umarani, D/o, Venkatachary, Age: 29 years, Occ: House Wife, H.No: 2-55, Parvathapur, Ward No.3, Ghatkesar, Medpally, Ranga Reddy.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 82 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD-Branch**
**... Disputant**
AND
**ROLLAKANTI SHANKAR & Others**
**... Opponents**

4. Mr. Gourarapu Raju, S/o, Yakaiah, Age: 41 Years, Occ: Private Employee, H.No: 2-96, Chowtapalle, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 64 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD-Branch**
**... Disputant**
AND
**ZAREENA KHATOON & Others**
**... Opponents**

2. Mr.Mohammed Tariq Khan, S/o, Sulthan Khan, Age: 42 Years, Occ: LP GR-II, Emp Id: 2155253, O/o.MPUPS Nagaram Lingala, Ghanpur, H.No:5-8-34, Laskar Bazar, Hanamkonda, Warangal.
4. Mr. Malleboina Saidulu, S/o, Nrayana, Age: 40 Years, Occ: Asst. Reserve Sub Inspector, Emp Id: 729, O/o. 17th BN TSSP Siricilla, H.No: S3-22, Rajaram Nagar, APSP 7th Battalion, Dichpally, Nizamabad.
5. Mr.Rachapally Swamy, S/o, Lingaiah Age: 36 Years, Occ: Asst. Reserve Sub Inspector, Emp Id: 274, O/o.17th BN TSSP, Siricilla,H.No:2-8-143/1,Ambedkar Colony, Tammikunta, Karimnagar.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 61 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD-Branch**
**... Disputant**
AND
**GARREPELLY GOVARDHAN & Others**
**... Opponents**

2. Mr. Banoth Shankar Lal, S/o, Hanuma, Age: 49 Years, Occ: Sr. Assistant, O/o. MPDO, Ghanpur, H.No: 1-89, Kothaguda, Warangal.
3. Mr. Vajja Kumara Swamy, S/o, Kommaiah, Age: 51 Years, Occ: SA, O/o. Govt TWAHS, Seethanagar, Gudur, Mahabubabad, H.No: 3-85/3, Rajinigudem, Mulugu.
4. Mr. Mamidala Rambabu, S/o, Kommalu, Age: 43 Years, Occ: Business, H.No: 3-222, Kamalapuram, Narsampet, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 60 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD-Branch**
**... Disputant**
AND
**ROLLAKANTI SRAVAN KUMAR & Others**
**... Opponents**

3. Mr. Jadala Sandeep, S/o, Srinivas, Age: 62 Years, Occ: Private Employee, H.No:1-118/1, Thurpuwada, Indurthy, Kesamudram, Mahabubabad.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ARB.NO. 59 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD- Branch**
**... Disputant**
AND
**LINGALA KANAKASWAMY & Others**
**... Opponents**

1. Mr. Lingala Kanaka Swamy, S/o, Venkataiah, Age: 49 years, Occ: Agriculture, H.No: 1-85, Machupahad, Narmetta, Jangaon.
2. Mr.Kompelli Raju, S/o,Narsaiah, Age: 43 years, Occ: Agriculture, H.No: 1-120/1, Machupahad, Narmetta, Jangaon.
4.Mr. Arigela.Saraiah, S/o, Venkata Narsaiah, Age: 47 Years, Occ: Agriculture, H.No: 2-3-55/1, 4th Ward Machupahad, Narmetta, Jangaon.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

# ఇరాన్ భారీ బహుమతి

**ట్రంప్–నెతన్యాహూలను నరకానికి సాగనంపితే..**

హత్యచేసినవారికి 50 మిలియన్ యూరోలు
బిల్లు సిద్ధం చేస్తున్న ఇరాన్ పార్లమెంటు
ఇప్పటికే 2.90 లక్షలమంది మద్దతుదార్ల సంసిద్ధత



**టెహ్రాన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ, అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ లను హతమార్చడం తమ హక్కు అని ఇరాన్ జాతీయ భద్రత, విదేశీ విధాన కమిటీ అధిపతి ఇబ్రహీం అజీజ్ చెప్పారు. వారిని నరకానికి సాగనంపిన ఏ ముస్లింకైనా లేదా సంస్థకైనా యాభై మిలియన్ యూరోలు (58.23 మిలియన్ డాలర్లు) నగదు బహుమతి ఇస్తామని, ఈ మేరకు ఇరాన్ పార్లమెంటు ఒక బిల్లును సిద్ధం చేస్తోందని ప్రభుత్వ టీవీకి చెప్పారు. బ్రిటన్ టెలిగ్రాఫ్ పత్రిక ఈ విషయం వెల్లడించింది. ఈ విషయానికి అంతర్జాతీయస్థాయిలో ప్రచారం ఇవ్వాలని కోరారు. ఇందుకు ఇష్టమైనవారు ఒక వెబ్‌సైట్ ద్వారా తమ మద్దతును నమోదు చేసుకోవాలని, ఒక ఎస్‌ఎంఎస్ ద్వారా తమ నంబర్ పంపించి తమ భాగస్వామ్యాన్ని ధృవీకరించుకోవాలని కోరారు. ఈ నగదు బహుమతి ఇవ్వడానికి ఇప్పటికే అనేక మంది దాతలు ముందుకు వచ్చి 25 మిలియన్ డాలర్లు సమకూర్చారని చెప్పారు. సహజంగా మత ఛాందస ముస్లిం సమాజంలోని ప్రభుత్వాలు ముస్లిం ద్రోహులను హతమార్చాలని కోరుతూ ఫత్వా జారీ చేస్తాయి. గతంలో అనేకమంది సాహితీవేత్తలకు ఇలాంటి ఫత్వాలు జారీ అయ్యాయి. కానీ టెహ్రాన్ ప్రతిపాదించిన బిల్లు ఇరాన్ – అమెరికా–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తత తీవ్రతను, ద్వేషాన్ని సూచిస్తోంది. తనను చంపేందుకు యత్నిస్తే ఇరాన్‌ను భూమ్మీద నుంచి తుడిచిపెట్టేందుకు అమెరికా చాలా కఠినమైన నిర్ణయాలు తీసుకుంటుందని ట్రంప్ గతంలో హెచ్చరిక చేశారు. మధ్యవర్తి పాకిస్తాన్ ద్వారా సోమవారం ఇరాన్ ఒక కొత్త ప్రతిపాదన, ఆ ప్రతిపాదనను ట్రంప్ తిరస్కృతి, వైట్‌హౌస్ మారకపోతే బాంబులతో చర్చలు కొనసాగించాల్సి వస్తుందని హెచ్చరికల మధ్య ఈ బహుమతి ప్రణాళిక తెరమీదకు వచ్చింది. ఇరాన్ సర్వాధినేత ఆయతొల్లా అలీ ఖమేనీతో పాటు ఆయన రెండో భార్య, కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు అనేకమంది జనరల్స్ ఫిబ్రవరి 28న అమెరికా చేసిన గగనతల బాంబు దాడుల్లో హతమయ్యారు. దీంతో ఇరాన్ తీవ్ర ప్రతీకారజ్వాలతో రగిలిపోతోంది. ఒక ఫత్వాతరహాలో ఈ బిల్లును త్వరలో ఇరాన్ పార్లమెంటు ఆమోదించే అవకాశం ఉంది. వారిని హత్య చేయడం ఇరాన్‌కున్న హక్కుగా అజీజ్‌ ట్రంప్, అపకీర్తిని మూటకట్టుకున్న అవమానకరమైన ప్రధానమంత్రి నెతన్యాహూ, సెంట్‌కామ్ కమాండర్ కమాండర్ లను లక్ష్యంగా చేసుకుని ఈ హత్యలు జరగాలని మేం కోరుకుంటున్నాం" అని అజీజ్ చెప్పారు. "మా ఇమామ్ ఖమేనీ ఏ విధంగా అమరుడయ్యారో అదేవిధంగా అమెరికా అధ్యక్షుడు కూడా హతమారిపోవాలి, ప్రపంచంలో ఏ ముస్లిం అయినా లేదా ఇరాన్ పౌరుడు, సంస్థ అయినా ఈ హత్యలు చేయవచ్చు, వారిని ఎదుర్కోవచ్చు. ఎవరైనా సాహసోపేతమైన,చట్టపరమైన వ్యక్తి ఈ మతపరమైన,సిద్ధాంతిక పరమైన లక్ష్యాన్ని చేపట్టి పూర్తి చేస్తే వారికి ఈ బిల్లు ప్రకారం యాభై మిలియన్ యూరోల నగదు బహుమతి చెల్లించాల్సి ఉంటుంది" అని అజీజ్ చెప్పారు. వాస్తవానికి మార్చి నెలారంభంలోనే ఇరాన్‌లోని మొబైల్ వినియోగదారులకు ఈ టెక్స్ట్ మెసేజ్ లభ్యమైంది. ఇప్పుడు అది త్వరలో బిల్లుగా మారి చట్టరూపం దాల్చబోతోంది. ట్రంప్‌ను హత్య చేసేందుకు బహుమతి ఇవ్వనున్నాం, అంతర్జాతీయ ప్రచారం చేయాలని ఆయన ప్రోత్సహించారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు 2024లో కూడా ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కుట్ర చేశారు. ఈ విఫల కుట్రను అమెరికా న్యాయశాఖ బహిర్గతం చేసింది. ఇరాక్‌లో ఉన్న ఐఆర్‌జిసి కుడ్స్ ఫోర్స్ కమాండర్ ఖాసిం సులేమానీని హత్య చేయాలని 2020లో ట్రంప్ ఆదేశాలు జారీ చేసినప్పటినుండి ట్రంప్‌కు హత్యా బెదిరింపులు పెరిగాయి.

# ఊహకు మించిన వేగంతో ఎబోలా వ్యాప్తి

131 మంది మృతి : డబ్ల్యుహెచ్ఓ ఆందోళన
కాంగోకు 4.70 టన్నుల సామగ్రి సహాయం






**కిగాలీ:** డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా దేశాలలో ఎబోలా వైరస్ శరవేగంగా వ్యాపిస్తోంది. దీంతో మృతుల సంఖ్య ఇరవైనాలు గ్గంటల వ్యవధిలో 88 నుండి 131కి పెరిగాయి. డి.ఆర్.కాంగోలో కొత్తగా మరో 513 కేసులు నమోదయ్యాయి. ఎబోలాను గ్లోబల్ హెల్త్ ఎమర్జె న్సీగా ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 4.70 మిలియన్ టన్నుల ఆహారం, ఔషధాల సహాయాన్ని డి.ఆర్.కాంగోకు పంపించింది. మొదట ఊహించిన దానికంటే శరవేగంగా ఈ వ్యాధి వ్యాపిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిపతి టెడ్రోస్ అథనోమ్ ఘెబ్రేయెసెస్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికార ప్రతినిధి హెచ్చరిక జారీ చేశారు. కేసులను ముందుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని లేకపోతే ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిపోతుందని రెడ్‌క్రాస్ సంస్థ హెచ్చరించింది. ఈ పరిస్థితిపై కాంగో అధ్యక్షుడు ఫెలిక్స్ షిసెకెడి సమీక్షా సమావేశం నిర్వహించారు. మరోవైపు తూర్పు ఆఫ్రికాలో పొరుగు దేశాలు తీవ్ర భయాందోళన చెందుతున్నాయి. ఉగాండా–కాంగోల పొరుగున ఉన్న రువాండా దేశం తన పశ్చిమప్రాంత రుబావు జిల్లా (కాంగోకు సరిహద్దు) సరిహద్దులను మూసివేసింది. గోమా, రుబావు–గిసెన్యీ ప్రాంతాల సరిహద్దుల మూసివేత కొంతకాలం కొనసాగుతుందని ప్రకటించింది. మే నెల 15వ తేదీన కాంగోలో ఎబోలా వైరస్ లక్షణాలు ప్రజల్లో వెలుగుచూసినప్పటి నుండీ మరణాలు ప్రారంభమయ్యాయి. కాంగో, ఉగాండా దేశాలలో 1976 నుండి గడచిన యాభై సంవత్సరాలలో ఇరవైసార్లు ఎబోలా వైరస్ వ్యాప్తి చెందింది. ఇది అనేక రకాలుగా మార్పు చెంది కొత్త వైరస్‌లను పుట్టించింది. ప్రస్తుతం బండి బుగ్యు వైరస్ విస్తరించింది. ఈ వైరస్‌కు టీకా లేదు. ఈ వైరస్ ఇప్పటికి మూడుసార్లు ప్రబలింది. ఏప్రిల్ 24న ఈ వ్యాధి గురించి మొదట సందేహాలు తలెత్తాయి. ఐతే అంతకంటే ముందుగానే ఈ వైరస్ మానవశరీరంలో ప్రవేశించి ఉండవచ్చునని భావిస్తున్నారు. కాంగో ఇటూరీ ప్రాంతంలో మూడు ఎబోలా చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆ దేశ ఆరోగ్యశాఖామంత్రి శామ్యూల్ రోజెర్ కంబా చెప్పారు. దేశంలోని ఆసుపత్రులు ఇప్పటికే ఎబోలా బాధితులతో కిక్కిరిసిపోయాయి. ఇటూరీలో అతిపెద్ద నగరం బునియాలో భారీగా ఎబోలా కేసులు నమోదవుతున్నాయి. దీంతో ప్రత్యేక కేంద్రాలు తెరిచారు. అటు ఎబోలా, ఇటు హంటావైరస్ రెండు వ్యాధులకు ఒకేవిధమైన లక్షణాలు ఉన్నాయి. తీవ్రమైన శరీర ఉష్ణోగ్రత, తలనొప్పి, కడుపునొప్పి, ఊపిరి ఆడకపోవడం, విరోచనాలు, అంతర్గత రక్తస్రావం, శరీరంపై దద్దుర్లు, కిడ్నీలు సరిగ్గా పనిచేయకపోవడం వంటివన్నీ ఈ రెండు వ్యాధులలోనూ ఉమ్మడి లక్షణాలుగా తేలాయి. గతంలో ఈ వ్యాధి గినియా,సియెర్రా లియోన్, అమెరికా, బ్రిటన్, ఇటలీ, పశ్చిమ ఆఫ్రికా దేశాలకు విస్తరించింది. ఈ వ్యాధివల్ల 11,325 మంది ఈ దేశాల్లో మరణించారు.

## పూర్తి చేస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మణాల పురోగతి పై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి,ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎంఎల్‌ఎలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, నీటిపారుదలశాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, ఇఎన్‌సి రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ 10ఏళ్ల పాలనలో పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మరో 15 రోజుల్లో ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై పునఃసమీక్షా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.అందుకు గాను ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రాజెక్టుల పనుల పురోగతి పై సమగ్రమైన నివేదికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.పెద్ద ఎత్తున మట్టి పేరుకపోయి నీటి సామర్థ్యం నిల్వ 8టిఎంసిల దిగువకు పడిపోయిన జూరాల ప్రాజెక్టు పూడిక తీసి నీటి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వీలుగా డిఆర్ఐ.పి కు ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు.పూడిక తీత పనులతో నీటి సామర్థ్యం నిల్వలు గణనీయంగా పెరగడమే కాకుండా రిజర్వాయర్ భద్రత,నిర్వహణ మరింత మెరుగు పడుతుందన్నారు. ప్రధానంగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90శాతం పూర్తి అయ్యాయని బిఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా సత్యదూరమని, ఆ ప్రచారం ముమ్మాటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే నని ఆయన మండిపడ్డారు.

# శాండియాగోలో మత విద్వేషం

మసీదులో కాల్పులు : ఐదుగురు మృతి



**శాండియాగో :** శాండియాగో మసీదులో (ఇస్లామిక్ సెంటర్) సోమవారం మధ్యాహ్నం కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో సెక్యూరిటీ గార్డు సహా ఐదుగురు మరణించారు. వీరిలో కాల్పులకు పాల్పడిన ఇద్దరు టీనేజర్లు అనంతరం తమను తాము కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆ సమీపంలోనే కారులో ఇద్దరు టీనేజ్ యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వారే ఈ కాల్పులకు కారణమని, కాల్పుల అనంతరం వారు తమను తాము కాల్చుకుని మరణించారని పోలీసులు ప్రాథమికంగా విశ్వసిస్తున్నారు. ఈ మసీదులో ప్రార్థనలు చేసేందుకు వచ్చిన పిల్లలను ఆ తర్వాత సురక్షితంగా బయటకు తరలించారు. ఈ మత విద్వేష చర్యను తీవ్రంగా పరిగణించిన ఎఫ్‌బిఐ ఈ కాల్పుల ఘటన వెనుక అసలు కారణాలు తెలుసుకునేందుకు, కేసు దర్యాప్తు నిమిత్తం రంగంలోకి దిగింది. ఈ కాల్పుల ఘటన సమయంలో సెక్యూరిటీ గార్డులు కథనాయకులుగా వ్యవహరించారు. వీరోచితంగా వ్యవహరించి పిల్లల ప్రాణాలను సెక్యూరిటీ గార్డులు కాపాడారని పోలీసు ఉన్నతాధికారులు ప్రశంసించారు. మసీదులో ఉన్నవారిని కాపాడేందుకు సెక్యూరిటీ గార్డు వీరోచితంగా ప్రతిఘటించాడని, ఆయన చివరకు ప్రాణత్యాగం చేశాడని పోలీసులు చెప్పారు. ఐతే ఈ కాల్పుల ఘటన జరగడానికి రెండు గంటలు ముందుగా కుమారుడు, ఇంట్లో కొన్ని ఆయుధాలు కూడా కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత కాల్పలు జరిపిన యువకులలో ఉన్న తన కుమారుణ్ణి గుర్తించింది. ఈ ఇద్దరు టీనేజర్లు సైనిక దుస్తులు ధరించి ఉన్నారు. ఈ విధమైన చర్యలతో ఈ ప్రాంతంలో మొదట ఊహించిన దానికంటే చాలా పెద్ద ప్రమాదం దీర్ఘకాలంలో పొంచి ఉందని పోలీసు అధికారులు సందేహిస్తున్నారు.

## అక్టోబరు 30–31 తేదీల్లో జి–20 విదేశీ మంత్రులకు అమెరికా ఆతిథ్యం

**వాషింగ్టన్ :** జి–20 విదేశీ మంత్రులు ఈ ఏడాది అక్టోబరు 30, 31 తేదీలలో నిర్వహించే సమావేశాలకు ఈసారి అమెరికా ఆతిథ్యం ఇస్తుంది. అమెరికా విదేశీ వ్యవహారాలమంత్రి మార్కో రుబియో జి–20 విదేశీ మంత్రలందరినీ ఒక్కచోట చేరుస్తున్నారు. ప్రపంచ స్థిరత్వానికి,ప్రగతికి జి–20 ఆర్థిక వ్యవస్థలు ఒక కీలకమైనదని ఆయన చెప్పినట్లు అధికార ప్రతినిధి టామ్మీ పిగోట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
అమెరికా జార్జియా రాజధాని అట్లాంటా నగరం ఈ సమావేశాలకు ఒక సరైన వేదికగా పేర్కొన్నారు. అదేవిధంగా దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఈ ఏడాది డిసెంబరు 14–15 తేదీలలో ఫ్లోరిడాలోని మియామి నేషనల్ డోరల్‌లో జి–20 దేశాల నాయకుల శిఖరాగ్ర సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నారు.

## రాబోతోంది!

**(మొదటి పేజీ తరువాయి)**

భరించాల్సి వస్తుందని, మరో మాటలో చెప్పాలంటే, వారు తమ రాజప్రాసాదాల్లోనే ఉండిపోతారు, కానీ ఆ ఆర్థిక షాక్ ప్రభావాన్ని మాత్రం యువత, ఉత్తరప్రదేశ్ ప్రజలు అనుభవిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నాడు, రాయ్ బరేలి లోక్‌సభ సభ్యుడైన గాంధీ లక్నో విమానాశ్రయంలో దిగి, అక్కడి నుంచే నేరుగా తన నియోజకవర్గానికి బయలుదేరారు. విమానాశ్రయంలో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్, కాంగ్రెస్ శాసనసభ పక్ష నాయకురాలు ఆరాధన మిశ్రా ఆయనకు స్వాగతం పలికారు.

**ప్రజలను విదేశాలకు వెళ్లొద్దని... తానెందుకు వెళ్లారు...**

ప్రజలను విదేశాలకు వెళ్లవద్దని కోరిన వెంటనే నార్వే పర్యటనకు వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని మార్చేంత వరకు ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉంటుందని ఆయన అన్నారు. మంగళవారం రాహుల్ ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలిలోని బచ్చరవన్‌లోని ఒక వివాహ మందిరం ప్రారంభోత్సవం అనంతరం జరిగిన ఒక కార్యక్రమంలో గాంధీ ప్రసంగించారు. 'ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధం చెలరేగింది. ఆ ఘర్షణ సమయంలో, ప్రపంచ చమురులో అధిక భాగం ప్రయాణించే వ్యూహాత్మక ప్రదేశమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ స్వాధీనం చేసుకుంది. తమ పట్టును వదులుకోబోమని ప్రకటించింది. ఫలితంగా, ఇప్పుడు ప్రపంచమంతా చమురు, ఎరువులు, డీజిల్ తీవ్ర కొరతను వేగంగా ఎదుర్కోవడం ప్రారంభించింది' అని ఆయన పశ్చిమ ఆసియా సంక్షోభంపై అన్నారు. ఆ తర్వాత గాంధీ మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బంగారం కొనవద్దని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని, విదేశాలకు వెళ్లవద్దని మోదీ పౌరులను కోరతారని, కానీ ఆ వెంటనే ఆయన విదేశీ పర్యటనకు బయలుదేరతారని గాంధీ అన్నారు. విచారకరమైన విషయం ఏమిటంటే, ఎవరూ ఆపలేని, మన జీవితంలో ఎన్నడూ చూడని ఒక తీవ్రమైన ఆర్థిక తుఫాను రాబోతోందన్నారు. నష్టపోయేది ఎవరు? అంబానీ లేదా అదానీ కాదు. నాలుగు వైపులా భద్రత ఉన్న వారి రాజభవనాలలోనే వారు ఉంటారు. నష్టపోయేది భారతదేశ రైతులు, కార్మికులు, యువత, ఉపాధి కల్పించే చిన్న వ్యాపారులు మరియు చిన్న పరిశ్రమలే అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. తాను కొంతకాలంగా ఆర్థిక తుఫాను గురించి హెచ్చరిస్తున్నానని, అది ప్రజలకు భారీ దెబ్బ కొడుతుందని గాంధీ అన్నారు. 'పెట్రోల్ ధరలు పెరగనున్నాయి, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతుంది. అయినా, రాహుల్ గాంధీకి అవగాహన లేదని అంటారు. ఈ రోజు కూడా మేం వారికి చెబుతూనే ఉన్నాం: చర్యలు తీసుకోండి. ప్రజలను రక్షించండి. రైతులను రక్షించండి. కానీ వారు ఏమీ చేయరు. కొన్నిసార్లు నార్వేకి, తర్వాత జపాన్‌కి, ఆపై మరెక్కడికో ఎగిరిపోతారు. ఎందుకు?' అని ఆయన అన్నారు. 'కార్మికులను, చిన్న వ్యాపారులను ఆదుకోవడం ప్రారంభించాలని మేము రోజురోజుకీ నరేంద్ర మోదీని కోరుతూనే ఉన్నాము. మీరు అలా చేయడంలో విఫలమైతే, దేశం అపారమైన నష్టాన్ని చవిచూడబోతోంది. అయినా, ఆయన ఏం చేస్తారు! నార్వేకు వెళ్ళిపోతారు.
నార్వేలో, 'సోదరా! అదానీకి సహాయం చేయండి, అంబానీకి సహాయం చేయండి' అని అంటారు' అని గాంధీ ఎద్దేవా చేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ హయాంలో ఎంజి నరేగా వంటి పథకాలను క్రమంగా నిర్వీర్యం చేస్తారని రాయ్‌బరేలీ లోక్‌సభ ఎంపి ఆరోపించారు. 'అదానీ, అంబానీ మరింత ధనవంతులు అవుతారు. మీ డబ్బంతా వారి జేబుల్లోకి వెళ్ళిపోతుంది. పెద్ద పెద్ద ఇళ్ళు, రాజభవనాలు నిర్మిస్తారు. మీ జేబుల నుండి డబ్బును దోచుకోవడానికే ఈ వ్యవస్థ మొత్తాన్ని తయారు చేస్తారు. మేము మీకు గట్టిగా అండగా ఉంటాము. మీకు ఎక్కడ కావాలంటే అక్కడ, నేను ఎప్పుడు అవసరమైతే అప్పుడు నన్ను పిలవవచ్చు' అని ఆయన అన్నారు. ముకేష్ అంబానీ కుటుంబంలో జరిగిన ఒక పెళ్లికి మోదీ, అమిత్ షా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరయ్యారని, కానీ తాను మాత్రం హాజరు కాలేదని గాంధీ అన్నారు.

**మోదీ వ్యక్తిగత అభ్యర్థనను నార్వే అంగీకరించిందా?**

పెన్షన్ ఫండ్ బ్లాక్ లిస్ట్ నుంచి అదానీని తొలగించాలన్న వ్యక్తిగత అభ్యర్థనకు నార్వే అంగీకరించిందా అని ప్రధాని నరేంద్రమోదీని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఈ అంశానికి సంబంధించి మోదీపై విమర్శలు గుప్పించారు. ఫిబ్రవరిలో నార్వే సార్వభౌమ సంపద నిధి తన పోర్ట్‌ఫోలియో నుంచి అదానీ గ్రీన్‌ను తొలగించిన నేపథ్యంలో గాంధీ ఈ ప్రశ్న సంధించారు. రాహుల్ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు.
'నార్వే సార్వభౌమ సంపద నిధి తన పోర్ట్‌ఫోలియో నుండి అదానీ గ్రీన్ ఎనర్జీని తొలగించింది' అని ఫిబ్రవరి 27న నివేదికను పంచుకుంటూ ప్రధాని మోదీ చరిత్రాత్మక నార్వే పర్యటనను ప్రారంభించారని, 43 ఏళ్లలో ఒక భారత ప్రధాని చేస్తున్న తొలి పర్యటన అని మే 18న వచ్చిన వార్తా నివేదికల చిత్రాన్ని ఆయన ఉపయోగించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో, ప్రపంచంలోనే అతిపెద్దదైన, 1.2 ట్రిలియన్ డాలర్ల సార్వభౌమ సంపద నిధి, ఆర్థిక నేరాలతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై ఆందోళన కారణంగా అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎజిఇఎల్)ను తన పోర్ట్‌ఫోలియో నుండి మినహాయించాలని నిర్ణయించింది.

## 44 ఏళ్లకు పెంపు!

**(మొదటి పేజీ తరువాయి)**

వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచారు. ఈ వయోపరిమితి సడలింపు జి.ఓ విడుదలైన తేదీ ఈనెల 18, 2026 నుండి ఒక సంవత్సరం పాటు అమలులో ఉంటుంది. రాబోయే ఏడాది కాలంలో వివిధ నియామక సంస్థలు (టిజిపిఎస్‌సి తదితర బోర్డులు) నోటిఫై చేసే అన్ని రకాల ఉద్యోగాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థుల గరిష్ట వయసు 34 సంవత్సరాల నుండి 44 సంవత్సరాలకు పెరిగింది. ఈ సడలింపు కేవలం ఒక సంవత్సరం పాటు వచ్చే నోటిఫికేషన్‌లకు మాత్రమే వర్తిస్తుంది. ఈ వయోపరిమితి సడలింపు యూనిఫామ్ సర్వీసులకు వర్తించదు. అంటే పోలీస్, ఎక్సైజ్, ఫైర్, జైళ్లు, అటవీ శాఖల్లో శారీరక ప్రమాణాలు అవసరమయ్యే పోస్టులకు ఈ 10 ఏళ్ల సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వివిధ రిజర్వ్‌డ కేటగిరీలకు (ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఈడబ్ల్యుఎస్ మొదలైనవి) తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్ (రూల్ 12) ప్రకారం అమలయ్యే అదనపు వయో సడలింపులు యధావిధిగా కొనసాగుతాయి. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత నుండి వచ్చిన అనేక విజ్ఞప్తులను పరిశీలించిన తర్వాతే ప్రభుత్వం ఈ సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వయసు పైబడి ఉద్యోగ అవకాశాలు కోల్పోతామనే ఆందోళనలో ఉన్న వేలాది మంది అభ్యర్థులకు మళ్లీ పోటీ పడే అవకాశం లభించింది.

# 21న మంత్రివర్గ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ సమావేశంలో చర్చించే ఎజెండాను రూపొందించేందుకు వెంటనే మంగళవారం రాత్రిలోగా ప్రాధాన్యత గల అంశాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అన్ని శాఖల ప్రత్యేక కార్యదర్శులను, ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక సర్క్యులర్ జారీ చేశారు. కాగా మంత్రివర్గ సమావేశంలో ప్రధానంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విధివిధానాలు, పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, పలు ప్రజా ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలనా అంశాలు, వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ నిర్ణయాలపై చర్చ జరగనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఈనెల 21వ తేదీన సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవ ఉన్నందున మంత్రివర్గ సమావేశాన్ని ఈనెల 23న యాదగిరిగుట్టలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. గతంలో సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించిన సందర్భంగా అక్కడే మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర రాజధాని వెలుపల మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించడం అదే తొలిసారి. ఒకవేళ యాదగిరిగుట్టలో మంత్రివర్గ సమావేశం జరిగితే హైదరాబాద్ వెలుపల మంత్రివర్గ సమావేశం జరగడం రెండవసారి అవుతుంది. యాదగిరిగుట్టలో నిర్వహించే ఈ కేబినెట్ భేటీ ద్వారా ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియను జిల్లాల స్థాయికి తీసుకెళ్లాలన్న సంకేతం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## మరోసారి

**(మొదటి పేజీ తరువాయి)**

న్యూఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 97.77 నుంచి రూ. 98.64కు, డీజిల్ ధర రూ. 90.67 నుంచి రూ. 91.58కు పెరిగింది. ముంబయిలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 107.59, డీజిల్ ధర రూ. 94.08 కాగా, కోల్‌కతాలో ధరలు వరుసగా రూ. 109.70, రూ. 96.07 కు పెరిగాయి. చెన్నైలో పెట్రోల్ ధర రూ. 104.49గా, డీజిల్ ధర రూ. 96.11గా ఉంది. హైదరాబాద్ లీటర్ పెట్రోల్ ధర రూ. 111.88కి చేరగా, డీజిల్ ధర రూ. 99.95కు పెరిగింది. స్థానిక పన్నుల కారణంగా రాష్ట్రాల వారీగా ధరలు మారుతూ ఉంటాయి. నాలుగేళ్లకు పైగా కాలంలో ఇంధన ధరల సవరణలో భాగంగా శుక్రవారం లీటరుకు రూ. 3 పెంచిన తర్వాత ఈ తాజా పెంపు చోటు చేసుకుంది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు, కీలకమైన ప్రపంచ చమురు రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయం కలగడంతో ఫిబ్రవరి చివరి నుంచి ప్రపంచ ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగిన నేపథ్యంలో ఈ వరుస పెంపులు చోటుచేసుకున్నాయి. కీలక రాష్ట్ర ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రభుత్వం ధరల సవరణను ఆలస్యం చేస్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. పశ్చిమ బెంగాల్‌తో సహా ఐదు రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికలలో మూడింటిలో గెలిచి అధికార బిజెపి తన ఎన్నికల ప్రభావాన్ని విస్తరించుకున్న నేపథ్యంలో పెట్రో ధరలను పెంచింది. ఈ పెంపులు జరిగినప్పటికీ, ఇంధన రిటైలర్లు గణనీయమైన నష్టాలను చవిచూస్తూనే ఉన్నాయని, మే 15న జరిగిన పెంపు వల్ల నష్టాలు సుమారు నాలుగో వంతు తగ్గినప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇప్పటికీ రోజుకు సుమారు రూ. 750 కోట్లు నష్టపోతున్నాయని పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ సోమవారం తెలిపారు. ఢిల్లీ, ముంబయి వంటి నగరాల్లో మే 15న కిలోకు రూ. 2 పెంచిన తర్వాత, ఆదివారం కిలోకు రూ. 1 పెరగడంతో సహా, ఈ కాలంలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి) ధరలు కూడా రెండుసార్లు పెరిగాయి. ప్రభుత్వ రంగ సంస్థల కంటే ముందే ప్రైవేట్ రిటైలర్లు ధరలను పెంచారు. నయారా ఎనర్జీ మార్చిలో పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు వరుసగా రూ. 5, రూ. 3 వరకు పెంచగా, షెల్ ఏప్రిల్ 1 నుండి పెట్రోల్ ధరను లీటరుకు రూ. 7.41, డీజిల్ ధరను రూ. 25 పెంచింది. భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం మార్చిలోని 3.40 శాతం నుండి ఏప్రిల్‌లో 3.48 శాతానికి పెరిగింది. అదే సమయంలో, ప్రధానంగా పెరిగిన ఇంధన, శక్తి వ్యయాల కారణంగా టోకు ద్రవ్యోల్బణం 42 నెలల గరిష్ఠ స్థాయి అయిన 8.3 శాతానికి చేరింది.

## హాస్యాస్పదం

**(మొదటి పేజీ తరువాయి)**

అనుమతులు తీసుకురాలేదని అన్నారు. పంపులు, మోటార్లు, సర్జ్ పూల్స్ కోసం రూ.35 వేల కోట్లు కేటాయించినా, పదేళ్లలో కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పులోకి నెట్టినా పాలమూరుకు తగిన నిధులు కేటాయించలేదన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను బిఆర్‌ఎస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని, తాము 62 శాతం వాటా కోసం పోరాడుతున్నామని పేర్కొన్నారు.

**పాలమూరు ప్రజలను మోసం చేసింది బిఆర్‌ఎస్: మంత్రి వాకిటి శ్రీహరి**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై బిఆర్‌ఎస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. ఒక్క మోటార్ బటన్ నొక్కితే ప్రాజెక్టు పూర్తయినట్టుకాదు అని వ్యాఖ్యానించారు. సంగెం బండలో రాళ్లు కూడా పగలగొట్టలేని గత ప్రభుత్వం, ఇప్పుడు పాదయాత్రలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించాలనుకుంటోందన్నారు. తమ ప్రభుత్వం సంగెం బండ పనులు పూర్తి చేసి 22 వేల ఎకరాలకు నీరు అందిస్తోందని తెలిపారు.

**పాలమూరుకు ఆంధ్రా నాయకుల కంటే ఎక్కువ అన్యాయం చేసింది కెసిఆర్ :ఎంఎల్‌సి వంశీకృష్ణ**

కెసిఆర్ పాలమూరు ఎంపిగా ఉన్నప్పటికీ జిల్లాకు న్యాయం చేయలేదని ఎంఎల్‌సి వంశీ కృష్ణ విమర్శించారు. తెలంగాణ నీటిని రాయలసీమకు తరలిస్తున్నా ఒక్కరోజు కూడా ప్రశ్నించలేదని మండిపడ్డారు. పాలమూరుకు ఆంధ్రా నాయకుల కంటే ఎక్కువ అన్యాయం చేసింది కెసిఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

**పాలమూరు ప్రాజెక్టుల పూర్తి కోసం కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సిఎం రేవంత్ రెడ్డి అనేకసార్లు సమీక్షలు నిర్వహించారని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు కూడా తీసుకురాలేకపోయిందన్నారు. 2022లోనే డిపిఆర్ సమర్పించినా పనులు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు.

**బిఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ లేదు:** ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సిగ్గుశరం లేకుండా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ విమర్శించారు. ఒరిజినల్ పార్టీ బిఆర్‌ఎస్సా, టిఆర్‌ఎస్సా అన్నది ముందుగా తేల్చుకోవాలని అన్నారు. బిజెపిలో కలవడానికి బిఆర్‌ఎస్ సిద్ధంగా ఉందని ఆరోపించారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో నల్గొండ జిల్లాకు జగదీష్ రెడ్డి చేసింది ఏమీ లేదని విమర్శించారు. కంకర, ఇసుక అక్రమాలకే పరిమితమయ్యారని, దొంగ నోట్ల కేసుల్లో కూడా ఉన్నారని ఆరోపించారు.

**తెలంగాణ హక్కులకు రక్షణ కవచం కాంగ్రెస్ పార్టీ: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

తెలంగాణ హక్కులకు రక్షణ కవచంగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బిఆర్‌ఎస్ నాయకులను ఫాంహౌజ్‌కు పిలిపించి 'మీరు ఏం చేస్తున్నారు' అంటూ కెసిఆర్ తిట్టారని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై బిఆర్‌ఎస్ నాయకులు మాట్లాడటం కేవలం తమ పార్టీ ఇంకా ఉందని చెప్పుకునేందుకేనని వ్యాఖ్యానించారు.

## సేకరించండి

**(మొదటి పేజీ తరువాయి)**

సభ్యులకు హెల్త్ కార్డులు జారీ చేసేందుకు వీలుగా సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్ ఒక ముఖ్యమైన అధికారిక ప్రకటన (మెమో) విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని సచివాలయ శాఖలు, విభాగాధిపతులు (హెచ్ఓడి), పెన్షన్ మంజూరు అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డిడిఓలు) తమ పరిధిలోని ఉద్యోగులు, పెన్షనర్ల వివరాలను సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్దేశిత ప్రోఫార్మాలో సేకరించిన ఈ సమాచారాన్ని ఈనెల 31లోపు విధిగా ఐఎఫ్ఎంఐఎస్ హెచ్ఆర్ మాడ్యూల్‌లో డిడిఓ లాగిన్ ద్వారా అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనిని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించాలని స్పష్టం చేసింది.

**ఎవరెవరి వివరాలు సేకరిస్తారు?** తెలంగాణ ఇంటిగ్రేటెడ్ మెడికల్ అటెండెన్స్ రూల్స్, 1972 (సెక్షన్7) ప్రకారం అర్హులైన కింది వారి వివరాలను సేకరిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, సర్వీస్, ఫ్యామిలీ, డిపెండెంట్ పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు. ఉద్యోగులు, పెన్షనర్ల పేరు, ఉద్యోగ వివరాలు, ఆధార్ నెంబర్, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్, ఈమెయిల్, ప్రస్తుత, శాశ్వత చిరునామాలతో పాటు కుటుంబ సభ్యుల వయస్సు, వైవాహిక స్థితి, ఉద్యోగం, చదువు, డిపెండెంట్ స్టేటస్ వంటి వివరాలను ఈ ప్రోఫార్మా ద్వారా సేకరిస్తారు. ఈ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసేలా పరిపాలనా విభాగాలు నిరంతరం పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# వైభవ్ ఊచకోతకు లక్నో విలవిల

## పంజాబ్‌ను కిందకు నెట్టేసిన రాజస్థాన్..!



చావోరేవో పోరులో వైభవ్ సూర్యవంశీ(93) ఊచకోతకు లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లు బలయ్యారు. వైభవ్ విధ్వంసంతో ప్లే ఆఫ్స్ చివరి బెర్తుపై కన్నేసిన రాజస్థాన్ రాయల్స్‌కు కీలకమైన రెండు పాయింట్లు వచ్చాయి. జైపూర్‌లో లక్నో బౌలర్లపై తుఫాన్లా విరుచుకుపడిన వైభవ్.. భారీ అర్ధ శతకంతో లక్ష్యాన్ని మంచుముక్కలా కరిగించాడు. యశస్వీ(43) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు, జురెల్(53 నాటౌట్) మెరుపులు తోడవ్వగా రాజస్థాన్ అదిరే విజయంతో పంజాబ్ కింగ్స్‌ను వెనక్కి నెట్టి నాలుగో స్థానానికి ఎగబాకింది. ప్లే ఆఫ్స్ నిలవాలంటే గెలవ తప్పని మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ పంజా విసిరింది. హ్యాట్రిక్ ఓటముల నుంచి తేరుకుంటూ అదిరే విజయంతో నాకౌట్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది. లక్నో నిర్దేశించిన 221 పరుగుల భారీ ఛేదనలో ఆశ్చర్యంగా వైభవ్ సూర్యవంశీ(93 , 38 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్సర్లు) బదులు ఓపెనర్ యశస్వీ జైస్వాల్(43) చితక్కొట్టాడు. తొలి ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు.. ఆపై మొహ్సిన్ ఓవర్లో సిక్స్, మూడు ఫోర్లతో 19 పరుగులు పిండుకున్నాడు. మొదట్లో టైమింగ్ కుదరక నెమ్మదించిన వైభవ్ పవర్ ప్లే ఆఖరి ఓవర్లో రెండు ఫోర్లు, సిక్సర్ బాదగా రాజస్థాన్ అజేయంగా 71 పరుగులు చేసింది. చెలరేగుతున్న యశస్వీని ఔట్ చేసి ఈ జోడీని ఆకాశ్ విడదీశాడు.

**92 పరుగుల వద్ద...** లక్నోకు తొలి వికెట్ అందించిన ఆకాశ్కు చుక్కలు చూపిస్తూ.. 6, 4, 4, 6, 4 తో 26 రన్స్ రాబట్టి 23 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు వైభవ్. ఆ తర్వాత మరింత ఉతికేసిన చిచ్చరపిడుగు ధ్రువ్ జురెల్(53 నాటౌట్)తో కలిసి లక్ష్యాన్ని కరిగించాడు. 92 పరుగుల వద్ద మొహ్సిన్ పొరపాటుతో రనౌట్ తప్పించుకున్నాడు. కానీ, అదే ఓవర్లో సమద్ చేతికి చిక్కాడు. అప్పటికే రాజస్థాన్ విజయానికి చేరువవ్వగా జురెల్, ఫెరీరా(16 నాటౌట్)లు లాంఛనం పూర్తి చేశారు. ఫెరీరా సిక్సర్తో 7 వికెట్ల తేడాతో గెలుపొందిన రాజస్థాన్ ప్లే ఆఫ్స్ పోటీలో నిలిచింది.

**మార్ష్, ఇంగ్లిస్ విధ్వంసం**

టాస్ ఓడిన లక్నోకు ఓపెనర్లు మిచెల్ మార్ష్(96), జోష్ ఇంగ్లిస్(60)లు మెరుపు ఆరంభాన్నిచ్చారు. జైపూర్ మైదానంలో ప్రేక్షకులను అలరిస్తూ రాజస్థాన్ బౌలర్లను బెంబేలెత్తిస్తూ ఇద్దరూ పోటీపడి బౌండరీలు బాదారు. దాంతో, పవర్ ప్లేలోనే స్కోర్ 80 దాటింది. పిడుగుల్లే విరుచుకుపడిన ఇంగ్లిస్ను బౌల్ చేసిన యశ్ రాజ్ ఎట్టకేలకు ఈ జోడీని విడదీసి రాజస్థాన్కు ఉపశమనమిచ్చాడు. ఇంగ్లిస్ ఔటైనా మార్ష్ జోరు తగ్గించలేదు. రాజస్థాన్ పేలవ ఫీల్డింగ్ కూడా కలిసి రావడంతో.. పూరన్(16), కెప్టెన్ రిషభ్ పంత్(35) లతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన మార్ష్ స్కోర్ రెండొందలు దాటించాడు. కానీ, ఆర్చర్ వేసిన ఆఖరి ఓవర్లో మార్ష్, పంత్ రనౌటవ్వగా.. అయుశ్ బదొని(0) బౌల్డయ్యాడు. టపటపా మూడు వికెట్లు పడడంతో లక్నో నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది.

# ఆసియా గేమ్స్‌కు మన చికిత

### భారత ఆర్చరీ జట్టులో తెలంగాణ బిడ్డకు చోటు

**సోనేపట్:** భారత ఆర్చర్, తెలంగాణ బిడ్డ తానిపర్తి చికితరావు ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్‌కు ఎంపికైంది. మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన సెలక్షన్ ట్రయల్స్‌లో అద్భుత ప్రదర్శన చేసిన చికిత మహిళల కాంపౌండ్ విభాగానికి ఎంపికైంది. జపాన్‌లోని ఐచి నగోయా వేదికగా సెప్టెంబర్–అక్టోబర్‌లో జరగబోయే ఆసియా గేమ్స్‌తో పాటు వరల్ కప్ స్టేజ్ 3, స్టేజ్ 4 టోర్నీల్లోనూ ఆమె దేశానికి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ మేరకు భారత జట్టును ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సోమవారం ప్రకటించింది. మహిళల కాంపౌండ్ విభాగంలో స్టార్ ఆర్చర్, ఏపీకి చెందిన వెన్నం జ్యోతి సురేఖ భారత జట్టులో చోటు దక్కించుకున్న అత్యంత సీనియర్గా నిలిచింది.తెలంగాణ సమాచారం. ట్రయల్స్లో 15.5 పాయింట్లతో టాప్ ప్లేస్ సాధించిన ఆమె చికిత, యువ ఆర్చర్ పృతిక ప్రదీప్తో కూడిన కాంపౌండ్ బృందాన్ని నడిపించనుంది. తీవ్రమైన గాలి వీస్తున్న పరిస్థితుల్లో సాగిన ఈ ట్రయల్స్లో దీపికా కుమారి, అటాను దాస్, ఆసియా గేమ్స్ మల్టిపుల్ మెడలిస్ట్ అభిషేక్ వర్మ లాంటి దిగ్గజాలు జట్టులో చోటు కోల్పోయారు.ఏపీకి చెందిన ధీరజ్ పురుషుల రికర్వ్ జట్టుకు, తిరుమూరు గణేష్ మణిరత్నం కాంపౌండ్ జట్టుకు ఎంపికయ్యారు.



## మహిళ

# ఊబకాయులకు బీమా అడ్డంకులు!



ఆరోగ్య బీమా సంబంధిత అడ్డంకుల కారణంగా ఊబకాయంతో బాధపడుతున్న వారు బారియాట్రిక్, మెటబాలిక్ శస్త్రచికిత్సలు సకాలంలో చేయించుకోలేకపోతున్నారు. ఇండియన్ ఒబెసిటీ అండ్ మెటబాలిక్ సర్జరీ సొసైటీ (ఒఎస్ఎస్ఐ) నిర్వహించిన సర్వే ప్రకారం, ఆరోగ్య సేవలకు ప్రవేశాన్ని మెరుగుపరిచేందుకు ఇన్స్యూరెన్స్ ప్రక్రియల్లో భారీ మార్పులు అవసరమని అన్ని రకాల శస్త్రచికిత్స నిపుణులు భావిస్తున్నారు. 2019లో ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ) బారియాట్రిక్, మెటబాలిక్ శస్త్రచికిత్సలను ఇన్స్యూరెన్స్‌లో చేర్చిన తర్వాత, 87.2 శాతం శస్త్రచికిత్సల పట్ల రోగులకు ఆసక్తి పెరిగింది. అయితే, అవగాహన లేమి, బీమా కిందకు రాని ఖర్చులు కూడా అధికం గా ఉండడంతోపాటు, క్లిష్టమైన పేపర్‌వర్క్ కారణంగా బీమా ప్రయోజనాలు పొందుతున్న వారి సంఖ్య చాలా పరిమితంగా ఉంది. బీమా కంపెనీ లు ఈ శస్త్రచికిత్సలకు క్లెయిమ్‌లను ఆమోదించడానికి తాత్సారం చేస్తున్న కారణంగా, సరైన సమయంలో ఆపరేషన్స్ జరగడం లేదని సర్వేలో పాల్గొన్న 95.4 శాతం మంది శస్త్రచికిత్స నిపుణులు, రోగులు స్పష్టం చేశారు. ఇన్స్యూరెన్స్ ఆమోద ప్రక్రియ అత్యంత సంక్లిష్టంగా ఉందని 69.7 శాతం మంది అభిప్రాయపడ్డారు. కాగా, బారియాట్రిక్ సర్జరీకి ఇన్స్యూరెన్స్ కవరేజ్ ఉన్న విషయాన్ని తెలియకపోవడం వల్ల వాస్తవ వినియోగం చాలా తక్కువగా ఉందని 76.1 శాతం పేర్కొన్నారు. వైద్య నిపుణులు మెటబాలిక్ సర్జరీ కోసం సిఫారసు చేసినప్పుడు, దానిని వాయిదా వేయకూడదు. ఎందుకంటే చికిత్సను వాయిదా వేయడం వల్ల ఊబకాయంతో సంబంధిత రోగాలు మరింత తీవ్రమవుతాయి. సకాలంలో చికిత్స చేయించుకోవడం వల్ల వేగంగా కోలుకుంటారు. మెరుగైన ఆరోగ్య ఫలితాలు పొందుతారు. కాగా, జీవరక్షకమైన బారియాట్రిక్ , మెటబాలిక్ శస్త్రచికిత్సలకు మన దేశంలో బీమా అడ్డంకులు ఏఏ రకాలుగా ఉన్నాయో అర్థం చేసుకోవడానికి ఒఎస్ఎస్ఐ 2024 నవంబర్ నుండి 2025 మార్చి మధ్యకాలంలో అనేక రాష్ట్రాలకు చెందిన 109 మంది బారియాట్రిక్ సర్జన్స్‌తో క్రాస్‌సెక్షనల్ సర్వే నిర్వహించింది. భారతదేశంలో ఊబకాయం ఆందోళనకరంగా పెరుగుతోందని, 2040 నాటికి దీని ప్రబలత మూడు రెట్లు పెరుగుతుందని ఒఎస్ఎస్ఐ అభిప్రాయపడుతున్నది. ఊబకాయం చిన్న వారి నుండి పెద్దవారి వరకు కోట్లాది మందిని ప్రభావితం చేస్తోంది. ఇది జీవనశైలి లోపం కాకుండా, క్లిష్టమైన, దీర్ఘకాలిక, ప్రగతి చెందే, పునరావృతమయ్యే వైద్య స్థితి అని వైద్యులు చెబుతున్నారు. ఇది టైప్–2 మధుమేహం, రక్తపోటు, నిద్ర అప్నియా, గుండె వ్యాధి, సంధివాతం, వంధ్యత్వంతోపాటు కొన్ని సందర్భాల్లో కేన్సర్ల ప్రమాదాన్ని పెంచుతుంది. తీవ్ర ఊబకాయం కోసం బారియాట్రిక్, మెటబాలిక్ సర్జరీ అత్యంత ప్రభావవంతమైన చికిత్సా ఎంపికల్లో ఒకటి. ఇది మొత్తం శరీర బరువు 30–40 శాతం వరకు తగ్గడమే కాకుండా అనుబంధ రోగాలను కూడా తగ్గిస్తుంది లేదా అదుపు చేస్తుంది. సర్వే ప్రకారం, ఎక్కువ మంది శస్త్రచికిత్స నిపుణులు అర్హత ప్రమాణాలను విస్తరించాల్సిన అవసరంపై బలమైన ఏకాభిప్రాయంతో ఉన్నారు. చాలా మంది బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) మోతాదులను తగ్గించడం, ఐఆర్‌డిఏ జాబితాలో లేని మరిన్ని సహవ్యాధులను చేర్చడం అవసరమని స్పష్టం చేశారు. 99.1 శాతం మంది శస్త్ర చికిత్సా నిపుణులు వివిధ రకాల ఆరోగ్య సేవలను బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు అన్ని రకాల ప్రక్రియలను అత్యంత వేగంగా సరళీకృతం చేయాల్సిన అవసరం ఉందని అంగీకరించారు.

## చదువు వంటబట్టలేదు..పాటల ప్రపంచానికి రారాణి

ఆమె పేరు చెరిలిన్ సర్కిసియన్. కానీ, చెర్‌గా సంగీత ప్రియులందరికీ సుపరిచితురాలు. ఆమెది పాతాళం నుంచి ఎదిగి, అత్యున్నత శిఖరాలు చేరుకున్న స్ఫూర్తిదాయక యువతి కథ. పట్టుదలకు కూడా స్ఫూర్తినిచ్చే వాస్తవం. చెర్ పాఠశాలలో అన్యమనస్కంగా ఉండేది. పాఠాలు ఒక పట్టాన అర్థమయ్యేవి కావు. 'చదువుపై శ్రద్ధ చూపడం లేదు' అనే మాట ప్రొగ్రెస్ రిపోర్డులోని ప్రతి కాలమ్‌లోనూ కనిపించేది. 1946 మే 20న, కాలిఫోర్నియాలోని ఎల్ సెంట్రో అనే చిన్న పట్టణంలో చెర్ పుట్టింది. ఆమె బాల్యం సుఖంగా మొదలుకాలేదు. తండ్రి మత్తు, జూదం అలవాట్లతో కుటుంబాన్ని వదిలేశాడు. తల్లి జార్జియా హోల్ట్ ఒక నటిగా, గాయనిగా అవకాశాల కోసం పోరాడే మహిళ. కొద్దిపాటి ఆదాయాలతో జీవిస్తూ, చెర్‌ను పెంచింది. 'భిన్నంగా ఉండటం తప్పు కాదు' అని తల్లి నేర్పిన పాఠం ఆమె వెంటనే ఉంది. ఆర్మేనియన్, చెరోకీ, ఐరిష్, ఇంగ్లీష్ రక్తాల కలయికగా చెర్ పుట్టింది. అందరూ ఒకేలా కనిపించాలనుకునే రోజుల్లో, ఆమె భిన్నంగా కనిపించింది, భిన్నంగా వినిపించింది, భిన్నంగా ఆలోచించింది. పదహారవ ఏట ఆమె స్కూల్ వదిలేసింది. డిప్లొమా లేదు. భద్రత లేదు. కానీ ఒక కల మాత్రం ఉంది. అందుకే కలల నగరమైన లాస్ ఏంజెల్స్‌కి వెళ్లింది. నటనలో శిక్షణ పొందింది. ఖర్చుల కోసం ఎన్నో చిన్నచిన్న పనులు చేసింది. అక్కడే ఆమె సన్నీ బోనోను కలిసింది. అతడు ఆమె ప్రత్యేక గొంతును, వ్యక్తిత్వాన్ని గుర్తించాడు. కలిసి సంగీతం, ప్రేమ, ప్రయాణం మొదలైంది. 1965లో 'ఐ గాట్ యు బేబ్' పాట ప్రపంచాన్ని కదిలించింది. సన్నీ – చెర్ ఒక తరం స్వరంగా మారారు. కానీ ఆ విజయానికి వెనుక మరో విషాదం ఉంది. కాంట్రాక్టులు చదవడం చెర్‌కు కష్టం. సన్నీ అన్నింటినీ చూసేవాడు.. చివరకు ఆమె సంపాదన అంతా అతని చేతిలోనే ఉంది. కానీ, సన్నీఅనుకున్నంత విశ్వాసం చూపలేదు. తగవు పడ్డాడు. విడిపోయాడు. విడాకులు ఇచ్చాడు. ఆ తర్వాత చెర్ ఖాళీగా మిగిలింది. మహిళా కళాకారులకు ఇరవై తొమ్మిదేళ్లు అంటే ముగింపు అనుకున్న కాలం అది. కానీ చెర్ అంగీకరించలేదు. టీవీ స్టార్‌గా మారింది. తర్వాత సోలో గాయనిగా ఎదిగింది. అనంతరం నటిగా మరో జన్మ ఎత్తింది. 'మూన్‌స్ట్రక్' సినిమాతో ప్రపంచం మొత్తాన్ని తన వైపు ఆకర్షించింది. ఆ సినిమాకే అత్యంత ప్రతిష్టాత్మక 'ఆస్కార్' అవార్డును గెల్చుకుంది. చదవలేకపోయిన ఒక అమ్మాయి... తన స్వయం శక్తితో హాలీవుడ్ శిఖరాగ్రానికి చేరింది. కొంత కాలం స్థిరంగా ఉన్నప్పటికీ, ఆమెలోని కళాకారిణి చెర్‌ను నిద్రపోనియ్యలేదు. 1998లో, 52 ఏళ్ల వయసులో, చెర్ 'బిలీవ్' పాట విడుదల చేసింది. ఆ పాటలోని ఆటోట్యూన్ శబ్దం సంగీత ప్రపంచాన్ని మార్చేసింది. ఆ పాట ప్రపంచవ్యాప్తంగా నంబర్ వన్ అయింది.



## మాదక ద్రవ్యాలకు బానిసలు చేసే వారిని కఠినంగా శిక్షించాలి

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** పాఠశాలలే దేవాలయాలు అలాంటి పవిత్ర ప్రదేశాలలో గాంజా, మత్తు, మాదక ద్రవ్యాలను విక్రయిస్తు విద్యార్థులకు, యువతకు అలవాటు చేస్తున్న వారిపై కఠిన శిక్షలు విధించాలని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ పోలీసు కమిషనర్‌కు జిల్లాలో మాదకద్రవ్యాల విక్రేతలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో గాంజా, మత్తు, మాదక ద్రవ్యాలను విక్రయిస్తూ విద్యార్థులు, యువత జీవాతాలను నాశనం చేస్తున్న పోలీసులు పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిరంతరం గస్తీ తిరుగుతూ, తనిఖీలు చేస్తూ మాదకద్రవ్యాల విక్రేతల ఆట కట్టించాలని కోరారు. కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఆనుకొని ఉన్న శ్మశాన వాటిక స్థలం, దామర చెరువు వద్ద గల ఖాళీ స్థలంలో, రాంపూర్ రోడ్డులోగల గుట్ట ప్రాంతంలో రాత్రిపూట గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అమ్ముతున్నారని, వాటిని సేవిస్తూ యువత బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రాధాన్యత ఇస్తూ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు. గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై నిఘా మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా నిరోధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు, యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వం అహర్నిశలు ప్రయత్నిస్తున్నప్పటికి వీరిలో ఏ మార్పు లేదన్నారు. ఇందుకు కారణమైన గంజాయి విక్రయిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు, గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్న వారికి మెడికల్ టెస్టులను నిర్వహించి తగిన చికిత్స చేయించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓమయ్య, సిపిఐ కోటగిరి మండల కార్యదర్శి అంబాటి విఠల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్ల హక్కుల పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ఎఐటియుసి పోరాటం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ట్రాక్టర్ డ్రైవర్ల హక్కుల పరిరక్షణ కార్మిక సంక్షేమం కోసం పోరాటం చేయాలని ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు చిలువేరు అంజయ్య, దుబ్బాక సంజీవలు పిలుపునిచ్చారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహించిన ట్రాక్టర్ డ్రైవర్ యూనియన్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు ట్రాక్టర్ డ్రైవర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రమాద బీమా, కనీస వేతనం, డ్రైవర్లకు గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెన్నెముకలా పని చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లను కార్మికులుగా గుర్తించి అన్ని హక్కులు కల్పించాలని కోరారు. అనంతరం యూనియన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పర మోని యాదగిరి, ఉపాధ్యక్షుడిగా చిలువేరు నరసింహ, కార్యదర్శిగా బోయిన వెంకటేష్, గౌరవ అధ్యక్షుడిగా నేనావదీప్లా, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, దేవరాజు, లింగస్వామి, శివ, పావని, సంతోష్, సీత, సతీష్‌లను ఎన్నుకున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దారుణం



### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి

**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** పెట్రోల్, డీజిల్ ధరలు 90 పైసలు మళ్లీ పెంచడం దారుణమని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి విమర్శించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ ఇప్పటికే దేశ ప్రజలు అనేక అవస్థలు, ఇబ్బందులు పడుతున్న, వారిపై కనికరం చూపకుండా, కార్పొరేట్ కంపెనీల ఆస్తులను కూడపెట్టడంలో కేంద్రప్రభుత్వం ముందుచూపు చూస్తుందని ఆరోపించారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం మళ్లీ డీజిల్, పెట్రోల్ ధరలు 90 పైసలు పెంచడం దారుణమన్నారు. 10 రోజుల క్రితం వాణిజ్య అవసరాల గ్యాస్ ధరలు పెంచడంతో, దాని ప్రభావంతో నిత్యావసర వస్తువులపై భారం పడిందని, దీంతో ధరాభారం సామాన్యులపై పడిందన్నారు. మరో పక్క డీజిల్, గ్యాస్, పెట్రోల్, సిఎన్జి, మూడు రూపాయల పెంచి, సామాన్య మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపి, సామాన్య మధ్యతరగతి ప్రజలను నడ్డి విరిచిందని భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, సిఎన్జి ధరలను పెంచుతూ ప్రజలపై బాదుడు మొదలపెడుతూ, ఇంకా ఎన్నిసార్లు పెంచి, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ధరలు పెంచడం మానుకొని వెంటనే ప్రజలకు అందుబాటులో నిత్యావసర వస్తువుల ధరలు పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలు తగ్గించాలని భిక్షపతి కోరారు. ధరలను తగ్గించకపోతే కేంద్ర ప్రభుత్వం ప్రజల చేతుల్లో తిరుగుబాటు ఎదుర్కొనక తప్పదన్నారు. ప్రజల సంక్షేమం కోసం ధరలు తగ్గించాలన్నారు. 2015 సంవత్సరం నుండి నరేంద్ర మోదీ ప్రభుత్వం లక్షల, కోట్ల రూపాయలు కార్పొరేటు సంస్థలకు రాయితీలు కల్పించిం, పేదలపై, మధ్యతరగతి ప్రజలపై ధరల బాదుడు బాదుతూ ప్రజలను ఇబ్బందులు పెడుతుందని భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని భిక్షపతి డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు ఊట్కూరి రాములు, శనగరపు రాజ్ కుమార్ లక్ష్మణ్, మర్రి శ్రీనివాస్, గడ్డం రాజనర్స్, మర్రి విజయ్, తండ ముందయ్య, చంద్రమౌళి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### పేదలపై కుట్రతోనే ఉపాధి పథకాన్ని

# రద్దు చేస్తున్న కేంద్రం

### బికెఎంయు హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్

**ప్రజాపక్షం/హనుమకొండ :** పేదలపై కుట్రతోనే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని రద్దు నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకుని దాని స్థానంలో విబిజి రాంజీ పేరుతో కొత్త పథకాన్ని రూపొందించిందని, ఈ పథకాన్ని రద్దుచేసి యధావిధిగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కర్రె లక్ష్మణ్ మాట్లాడుతూ పేదలకు ఆర్థికంగా మేలు జరుగుతున్నటువంటి పథకాన్ని యధావిధిగా మరింత పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో లోపాలు సవరిస్తూ పేదలకు దినసరి కూలీ గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, పని చేసే చోట నీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని, అడిగిన ప్రతిఒక్కరికి పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బికె ఎంయు జిల్లా అధ్యక్షుడు మునిగాల బిక్షపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకటరాజం, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల ఎల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు బొట్టు బిక్షపతి, జిల్లా నాయకురాలు జూకంటి పద్మ పాల్గొన్నారు.



# ప్రజా సంస్కృతి పరిరక్షణకు కళాకారులంతా ఐక్యం కావాలి

### ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సంస్కృతి పరిరక్షణ కోసం కళాకారులంతా ఐక్యం కావాలని, కళల ద్వారా ప్రజల్లో అభ్యుదయ భావాజాలన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు అన్నారు. తెలంగాణ ప్రజానాట్య మండలి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ బహుళ సంస్కృతిని దెబ్బతీసే మనువాద ఫాసిస్టు భావజాలాన్ని ఓడిద్దాం అనే నినాదంతో ఈ మహాసభలు జరుగుగున్నాయన్నారు. మే 25,26 తేదీల్లో రాష్ట్ర మహాసభలు హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయని ఆయన వెల్లడించారు. మే 25న ఇప్టా 84వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియూసి రాష్ట్ర కార్యాలయం నుండి నారాయణగూడా మార్వెల్ ఫంక్షన్ హాల్ వరకు ఐదు వేల మంది కళాకారులతో నిర్వహించే భారీప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 26న హిమాయత్ నగర్‌లోని తేరాపంథ్ పంక్షన్ హాల్లో జరగబోయే ప్రజానాట్యమండలి మహాసభలు, ఇప్టా ఆవిర్భావ ఉత్సవాలకు ఎంఎల్‌సి ప్రొ.కోదండరామ్, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ఎంఎల్‌సి గోరేటి వెంకన్న, సిపిఐ నాయకులు ఈటె నర్సింహా, చాడా వెంకటరెడ్డి పాల్గొంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు శనిగారపు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి నిమ్మల రాంబాబు,ఉపాధ్యక్షురాలు మేదిని లక్ష్మీ, సహాయ కార్యదర్శులు కటకం కొమరయ్య, దార్ల లక్ష్మీ, కోశాధికారి రామడుగు రామాచారి పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌లను మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీలలో హైదరాబాద్ లో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాకారులకు పిలుపునిచ్చారు. ప్రజా నాట్యమండలి పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఎజ్జ రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, గౌతమ్ గోవర్ధన్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, కళాకారులు జే.రాజు, రేణికుంట్ల రమాదేవి, నూకల మొండయ్య, జె.మోహన్, ఎఐటియుసి నాయకులు తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### పార్లమెంట్ నియోజకవర్గాల

# పునర్ వ్యవస్థీకరణపై దేశవ్యాప్త చర్చ జరగాలి

### మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ (డీలిమిటేషన్) కేవలం సీట్ల పెంపు లేదా జనాభా లెక్కల అంశం కాదని, భారత సమాఖ్య వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రక్రియ అని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ప్రముఖ మార్క్సిస్టు నాయకులు పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా 41వ సార్మకోపన్యాసం ఖురేషి చేశారు. 'ప్రతిపాదిత డీలిమిటేషన్‌దక్షిణాది రాష్ట్రాల స్థితి' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సభకు సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘువులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ భారత్ వంటి విభిన్నత్వంతో కూడిన దేశంలో ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదని, అన్ని ప్రాంతాలకు సమాన రాజకీయ ప్రాతినిధ్యం లభించే విధంగా వ్యవస్థ కొనసాగాలన్నారు. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ముందంజలో ఉండగా, అదే కారణంగా భవిష్యత్తులో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 1971 జనాభా లెక్కల ఆధారంగా కొనసాగుతున్నాయని, 2027 జనగణన తర్వాత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు మార్గం సుగమం కానుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల్లో వ్యక్తమవుతున్న ఆందోళనలను విస్మరించరాదని తెలిపారు. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగిన జనాభాకు కూడా తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తికి ఒక ఓటు, ప్రతి ఓటుకు సమాన విలువ అనే సూత్రాన్ని కాపాడుతూనే సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టే సమతుల్య విధానం అవసరమని ఖురేషి సూచించారు. ఇందుకోసం జనాభా ప్రమాణాలతో పాటు మానవ అభివృద్ధి సూచీలు, జనాభా నియంత్రణలో సాధించిన పురోగతి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకునే మిశ్రమ విధానంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి సమాఖ్య దేశాల్లో అమలులో ఉన్న ప్రాతినిధ్య నమూనాలను ఉదాహరణగా ప్రస్తావించిన ఆయన, భారతదేశం కూడా తన పరిస్థితులకు అనుగుణంగా పరిష్కార మార్గాన్ని రూపొందించుకోవాలని సూచించారు.డీలిమిటేషన్ ప్రక్రియపై తొందరపాటు నిర్ణయాల కంటే విస్తృత చర్చలు, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు, రాజకీయ ఏకాభిప్రాయం ఆధారంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా 'నా సొంతగడ్డపైనే నేనొక పరాయివాణ్ణి' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యుడు జి.బుచ్చిరెడ్డి, నవతెలంగాణ పత్రిక ఎడిటర్ కె.ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.

### జలమండలి కార్మికుల సంక్షేమం

# ఐఎన్‌టియుసి వల్లే సాధ్యం

### త్రిశూలం గుర్తుకు ఓటు వేయండి : మొగుళ్ళ రాజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అనేక దశాబ్దాలుగా కార్మికుల సమస్యల పరిష్కారం కొసం పాటుపడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించిన ఐఎన్‌టియుసి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి కార్మికులను కోరారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని వివిఎస్‌టి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొగుళ్ళ రాజిరెడ్డితో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యే కాలే యాదయ్య, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు చల్ల నరసింహా రెడ్డి, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, యరగోని నాగన్న గౌడ్, అదిల్ షరీఫ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘువేంద్ర రాజ్, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు కె. రాజి రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం జలమండలి కార్మికుల పట్ల కర్కశత్వంగా వ్యవరించడంతో పాటు యూనియన్ అధ్యక్షులుగా జి. రాంబాబుయాదవ్ ఉన్నప్పుడు కార్మికుల ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోకుండా అన్యాయం చేసారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గుర్తింపు సంఘం నాయకునిగా జలమండలిలోని వివిధ పనుల కాంట్రాక్టులను తానే సొంతం చేసుకొని, ఆర్థికంగా రూ.కోట్లకు పడగలెత్తాడని విమర్శించారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోరే కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టియుసి తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చల్ల నరసింహా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టియుసి తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపిస్తే భవిష్యత్తులో కార్మికుల సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నేతలు మహేష్, అక్తర్ అలీ, విశ్వనాథ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఐఎన్‌టియుసికి ఎఐటియుసి మద్దతు**

జూన్ 6న జరిగే జలమండలి ఎన్నికల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై ఐఎన్‌టియుసికి ఎఐటియుసి మద్దతు ప్రకటిస్తున్నదని మంగళవారం జరిగిన ఎఐటియుసి అనుబంధ హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సేవరేజ్ బోర్డు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రిజిస్టర్ నెంబర్ బి 1934 ప్రకటించింది. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ జలమండలిలో గత నాలుగు సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పెరిగిపోతున్నాయని, జలమండలిలో పనిచేయుచున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో చేర్చి, సంస్థ ద్వారానే జీతాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేయాలన్నారు. ఐఎన్‌టియుసి తరపున పోటీ చేస్తున్న మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ ఎఐటియుసి ఇచ్చిన డిమాండ్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి నిదర్శనంగా ఉన్నాయన్నారు. గత యూనియన్ లా కాకుండా ఐఎన్‌టియుసి యూనియన్ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని ఎఐటియుసి మద్దతు తెలియజేసినందుకు వారి సంఘానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఆర్.డి.చంద్రశేఖర్, రాఘువేందర్ రాజు, ఎఐటియుసి యూనియన్ అధ్యక్షులు కె.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. సత్యనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి జి.బి. సర్వేశ్వర్ రావు, కోశాధికారి జి. ఆనంద్, అశోక్, దాస్, ఎ.మురళి, ఆర్.జంగయ్య, ఏం. బాబు తదితరులు పాల్గొన్నారు

### అధిక ఉష్ణోగ్రతలతో

# అట్టుడుకుతున్న భారత్

### దేశవ్యాప్తంగా మండుతున్న ఎండలు

### 48 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

**న్యూఢిల్లీ :** దేశం ఎండ వేడిమితో అట్టుడుకుతోంది. అనేక ప్రాంతాల్లో గతంలో ఎప్పుడూ లేని ఎండలు నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో గరిష్టంగా 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకర స్థాయి. దేశ రాజధాని ఢిల్లీతోపాటు మహారాష్ట్రలోని విదర్భలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు ఈ ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు.

రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగి, వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. మహారాష్ట్రలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విదర్భ, అమరావతి పట్టణాల్లో 46.8 డిగ్రీలు, వార్ధాలో 46.5 డిగ్రీలు, అకోలాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇతర పట్టణాల్లో కూడా ఇదే స్థాయిలో టెంపరేచర్ పెరుగుతోంది. మహారాష్ట్ర, ఢిల్లీలాంటి చోట్ల ఇప్పుడప్పుడే ఎండలు తగ్గే అవకాశం లేదని ఐఎండీ హెచ్చరించింది. అనేక ప్రాంతాల్లో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రాంతంలో ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

ఢిల్లీలో ఉష్ణోగ్రతలతోపాటు వాయు కాలుష్యం కూడా కలవరపెడుతోంది. ఈ వారం అంతా నార్త్ ఇండియా, సెంట్రల్ ఇండియా, వెస్టర్న్ ఇండియాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. భారీ ఎండల నేపథ్యంలో ఐఎండి.. ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, ఎండ ప్రభావానికి గురి కాకుండా చూసుకోవాలని, ఇండ్లలోనే ఉంటూ తగినన్ని నీళ్లు తాగాలి, ముఖ్యంగా పగటి పూట బయటకు వెళ్లొద్దని సూచించింది.

## న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సుకు పుతిన్

**మాస్కో:** న్యూఢిల్లీలో ఈ ఏడాది సెప్టెంబరు12-13 తేదీల్లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరవుతారు. వంతులవారీ పద్ధతి ప్రకారం బ్రిక్స్‌కు భారత్ ప్రస్తుతం అధ్యక్ష బాధ్యతల్లో ఉంది. సెప్టెంబరులో జరిగే వార్షిక బ్రిక్స్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుంది. రష్యా ప్రభుత్వ కేంద్ర కార్యాలయం క్రెమ్లిన్‌లో పుతిన్ అంతర్జాతీయ వ్యవహారాల సహాయకుడు యూరీ ఉషకోవ్ మంగళవారం చెప్పిన సమాచారం ప్రకారం, భారత్‌లో బ్రిక్స్ సదస్సుకు పుతిన్ హాజరవుతారు.



# జూన్ 1న 'చలో సిఎం క్యాంప్ ఆఫీస్'

### రాష్ట్ర సర్పంచుల సంఘం జెఎసి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయం ముట్టడికి తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జెఎసి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ పిలుపునిచ్చారు. యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద మీడియాతో మాట్లాడారు. మాజీ సర్పంచులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన రాలేదన్నారు. అలాగే ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో 11 సార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మాజీ సర్పంచుల పదవీకాలం ముగిసి 32 నెలలు గడిచినా అభివృద్ధి పనుల బిల్లులు విడుదల కాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనికి నిరసనగా జూన్ 1న చలో సిఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. పెండింగ్ బిల్లులు రావాల్సిన మాజీ సర్పంచులందరూ భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, వై. అరవింద్ రెడ్డి, ఆనబోయిన సుధాకర్, గౌరీ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గంధం మల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లపై

# తప్పుడు ప్రచారం తగదు

### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొడంగల్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేసే ముందు అధికారిక లెక్కలు పరిశీలించాలని, అవసరమైతే సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించాలని సూచించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.6,462.73 కోట్ల చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. పదే పదే అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.వికారాబాద్ జిల్లాలో మే రెండో వారంలో వరి కోతలు ప్రారంభమయ్యాయని, ఇప్పటివరకు 3,608 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో 15,186 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.21.43 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైస్ మిల్లర్లపై ఎలాంటి ఫిర్యాదులు లేవని, గన్నీ బ్యాగుల పేరుతో రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలను ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 రబీ సీజన్‌కు 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 18 నాటికి 40.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని వెల్లడించారు. గత రబీ సీజన్లతో పోలిస్తే ఈసారి కొనుగోళ్ల అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం రైతు సంక్షేమంతో పాటు పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, పేదలకు సన్న బియ్యం, రేషన్ కార్డులు, రూ.2 లక్షల రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

# తల్లీకూతుర్ని హత్య చేసిన నిందితుల అరెస్ట్

### విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన రుద్రాక్షి సుమలత(45) హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. కుటుంబ భూవివాదాలు, ఆస్తి పంపకాల విషయంలో ఏర్పడిన విభేదాల కారణంగా నిందితులు పూర్వ ప్రణాళిక ప్రకారం హత్యకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది. మృతురాలు లావణ్య పేరు మీద ఉన్న సుమారు 5.24 ఎకరాల భూమిని భూమిని స్వాదీనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో నిందితులు ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితులు తల్లికూతుళ్ల హత్యకు పన్నిన కుట్ర ప్రకారం ఈనెల 17న ఉదయం మృతులు రుద్రాక్షి సుమలత, ఆమె కుమార్తె రుద్రాక్షి లావణ్యలు ఇబ్రహీంపేట గ్రామ శివారులో గల పామాయిల్ తోట వద్దకు పని నిమిత్తం వెళ్లగా నిందితులు అయిన గుర్రం నవీనీత, అంగడి రణుక, గుండ్లపల్లి స్వామి, గుర్రం రమేష్, రుద్రాక్షి మహేష్, నిమ్మల శశికళ, నిమ్మల వెంకన్న, రుద్రాక్షి నరసింహాలు ఏడుగురు వారిని వెంబడించి హఠాత్తుగా దాడిచేసి కారం పొడి చల్లి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం పరారైన నిందితులు హలియా పోలీసులు సాంకేతిక ఆధారాలు, సెల్‌ఫోన్ వివరాలతో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నేరస్తులకు హత్యకు ఉపయోగించిన బైక్, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాదీనం చేసుకోగా నిమ్మల శశికళ, నిమ్మల వెంకన్న, రుద్రాక్షి నరసింహులు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటుమాన్నారు. ఎస్‌పీ ఆదేశాల మేరకు సీఐ బి.శ్రీనునాయక్ పర్యవేక్షణలో త్రిపురారం, హలియా ఎస్ఐలు నరేష్, సాయిప్రశాంత్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది కృష్ణ, కోటి, శివ, ముని, వెంకటేశ్వర్లు, రమేషు నిందితులను పట్టుకున్నారని అన్నారు.

# గడువుకు ముందే నక్సలిజాన్ని నిర్మూలించాం




### అమిత్ షా

**జగదల్‌పూర్ :** భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, అత్యున్నత త్యాగాల ఫలితంగా, మార్చి 31 గడువు తేదీ కంటే ముందే దేశం నుండి నక్సలిజం పూర్తిగా నిర్మూలించబడిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం తెలిపారు. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షా మాట్లాడారు. నక్సల్ రహిత భారతదేశం సాధించే ప్రచారంలో కొన్ని తేదీలకు చారిత్రక ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. అందులో మొదటిది డిసెంబర్ 13, 2023; ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన ఆ రోజు నుండే నక్సలిజం పూర్తి నిర్మూలన కోసం దృఢమైన పోరాటం ప్రారంభమైందని ఆయన తెలిపారు. రెండవ తేదీ ఆగస్టు 24, 2024 అని షా చెప్పారు. మార్చి 31, 2026 నాటికి దేశాన్ని నక్సల్ రహితంగా మార్చాలనే సంకల్పంతో, అన్ని రాష్ట్రాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజి) అధికారులతో ఆ రోజున ఒక సమావేశం నిర్వహించబడిందని ఆయన వివరించారు. మూడవ తేదీ మీ అందరికీ తెలిసినదే మార్చి 31, 2026 (దేశం నుండి నక్సలిజాన్ని నిర్మూలించడానికి కేంద్రం విధించిన గడువు) అని అన్నారు. భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, అత్యున్నత త్యాగాల కారణంగా, నిర్ణీత గడువు కంటే ముందే దేశం నుండి నక్సలిజం పూర్తిగా నిర్మూలించబడిందని షా విలేకరులతో అన్నారు. నక్సలిజం నిర్మూలన ప్రణాళికలలో కేంద్ర ప్రభుత్వానికి వివిధ రాష్ట్రాల్లోని అనేక బిజెపియేతర ప్రభుత్వాలు సహకరించాయని, అయితే ఛత్తీస్‌గఢ్‌లోని గత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎటువంటి సహకారం అందించలేదని తాను ఎటువంటి సంకోచం లేకుండా చెప్పగలనని హోం మంత్రి పేర్కొన్నారు. డిసెంబర్ 2023 తర్వాత, ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే, మేము బస్తర్ ప్రాంతంలో నక్సలిజాన్ని నిర్మూలించగలిగామన్నారు. ఈ ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు చేరకపోవడం వల్లే నక్సలిజం విస్తరించిందని, కొందరు మేధావులు ఏళ్లుగా వాదిస్తున్నారని మంత్రి ప్రస్తావించారు. 'కానీ వాస్తవం దీనికి పూర్తిగా విరుద్ధం... ఆ ప్రాంతాల్లో నక్సలిజం ఉండటం వల్లే అభివృద్ధి అక్కడికి చేరలేకపోయింది' అని ఆయన స్పష్టం చేశారు. నక్సలైట్ల కారణంగా, ఆ ప్రాంతం మొత్తం అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడిపోయిందని హోం మంత్రి తెలిపారు. వారికి రేషన్ కార్డులు లభించలేదు, ఉచిత ఆహార ధాన్యాల పథకం ప్రయోజనం దక్కలేదు, అలాగే రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కూడా వారు పొందలేకపోయారు, ఉపాధి అవకాశాలు అసలు ఎక్కడా కనిపించలేదు అని ఆయన వివరించారు. దేశంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల కంటే కూడా ఆర్థికంగా, సామాజికంగా మరింత వెనుకబడిన ప్రాంతాలు చాలా ఉన్నాయని, అయినప్పటికీ ఆ ప్రాంతాల్లో నక్సలిజం లేదని ఆయన పేర్కొన్నారు.

### సైనిక-సాంకేతిక, వ్యవహార దక్షతలకు

# సంపూర్ణ ప్రతిబింబమే ఆపరేషన్ సిందూర్

### ఆర్మీచీఫ్ ఉపేంద్ర ద్వివేది



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ భారతదేశ సైనిక-ఆధునిక సమాచార సాకేంతిక, ఆర్థిక,దౌత్యపరమైన శక్తిసామర్థ్యాలకు, వ్యవహార దక్షతకు సంపూర్ణ ప్రతిబింబమని సైనిక బలగాల ప్రధానాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేదీ చెప్పారు. సందర్భ శుద్ధితో, చాలా పొందికగా, పొదుపుగా దేశ ప్రయోజనాలకు అనుగుణంగా గురిపెట్టి ఉగ్రవాద మౌలిక లక్ష్యాలను ధ్వంసం చేశామని చెప్పారు. న్యూఢిల్లీ మానేక్ షా సెంటర్‌లో దేశ సౌభాగ్యం కోసం భద్రత-స్థిరమైన జాతీయ వృద్ధికోసం ''స్మార్ట్ పవర్'' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ భారత బలగాలు ఉగ్రవాదశక్తుల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశాయని, దీర్ఘకాలికంగా ఉగ్రవాదులు చేసిన వ్యూహాత్మక అంచనాలకు తూట్లుపొడిచి చిందర వందర చేసిందని ఆ తర్వాత ప్రయోజనం నెరవేరిన తర్వాత ఉద్దేశపూర్వకంగా 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేసిందని చెప్పారు. ఒక వైపు భారత సైనిక శక్తిసామర్థ్యాలను, మరోవైపు వివేకంతో కూడిన దౌత్యనీతిని కలగలిపి జాతీయ లక్ష్యాలను సాధించడానికి ఉద్దేశించిన ఒక వ్యూహాత్మక విధానాన్ని ఈ ''స్మార్ పవర్'' సంపూర్ణస్థాయిలో ప్రతిబింబించిందని చెప్పారు. సైనిక సామర్థ్యం-సాంకేతిక, దౌత్య సామర్థ్యాలను ఉమ్మడిగా కలగలిపి ఏ విధంగా ఆ స్మార్ట్ పవర్‌ను ప్రతిబించాలన్న ప్రశ్నకు ఒక పాక్షిక సమాధానాన్ని పన్నెండు నెలల క్రితం భారత దేశం తెలియజేసిందని చెప్పారు. 2025 మే ఆరోతేదీ రాత్రి పొద్దుపోయాక ఏడో తేదీ తెల్లారకముందుగానే భారతదేశం సరైన చర్యలు తీసుకుందని చెప్పారు. చాలా సంక్షిప్తంగా, లక్ష్యాలను గురిచూసి 22 నిమిషాల వ్యవధిలోనే ఆపరేషన్ విండో, ఆపరేషన్ సిందూర్‌ను సైనిక బలగాలు పూర్తిచేశాయని చెప్పారు. ఒక వైపు సైనికులు లక్ష్యాలను గురిచూసి దాడి చేస్తుంటే, సమాచార నియంత్రణ,దౌత్యపరమైన సంకేతాలతో ఆర్థిక పరిష్కారాలకు ఆపరేషన్ సిందూర్ ఒక సంపూర్ణ ప్రతిబింబంగా నిలిచిందని అన్నారు. శత్రుదేశం లోలోతుల్లోకి చొరబడి ఉగ్రవాద మౌలిక వ్యవస్థను ధ్వంసం చేశామని, ఉగ్రవాదులు దీర్ఘకాలికంగా వ్యూహాత్మకంగా కన్నకలలను ఛిద్రం చేశామని చెప్పారు. 88 గంటలసేపు చాలా జాగ్రత్తగా వివేకంతో ఉద్దేశపూర్వక ఆలోచనలతో వ్యవహరించి భారత దేశ సమ్మిళిత ''స్మార్ట్ పవర్''ను సంపూర్ణ స్థాయిలో వ్యక్తీకరించామని చెప్పారు. పరికరాలను చాలా చక్కగా పొందిగా లక్ష్యంవైపు గురిచూసి ఉపయోగించామని, ఇదెంతో వ్యూహాత్మకమైన చర్య అన్నారు.

దేశ రక్షణరంగ బుద్ధిజీవుల యుద్ధ నైపుణ్య అధ్యయనాల కేంద్రం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. సీనియర్ సైనిక అధికారులు,వివిధ రంగాలకు చెందిన సైనిక అధికారులు,అనేక దేశాలకు చెందిన ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. మన చుట్టూ ఉన్న ప్రపంచం ఇప్పుడు ఎంతో సంక్లిష్టమైన సంకేతాలను ఇస్తోంది, అశాంతి,క్రమరాహిత్యం,అపనమ్మకం,అవిశ్వాసం, మిత్రపక్షాలు,కూటములలో ద్వైధీభావాలు కనిపిస్తున్నాయి, అధికార రాజకీయాలను ఉపయోగించుకుని సౌభాగ్యాన్ని,సమృద్ధినీ పునర్వవస్థీకరించి,వృద్ధిని కేంద్రీకరించే ప్రపంచం మనకు ఉందని, కానీ దానికి బదులుగా మనం అధికార సమృద్ధి ఉన్నచోట అధికార రాజకీయాలు చెల్లుబాటు కాబోవని అలాంటి ప్రపంచం ఉంటుందని మనం స్మార్ట్ పవర్ ద్వారా చాటి చెప్పామన్నారు. స్థిరమైన జాతీయ వృద్ధికోసం స్మార్ట్ పవర్ ఒక నిర్ణయాత్మక సాధనంగా ఉంటుందా లేక రాక్షస బలం తిరిగి ప్రపంచంలో కేంద్ర స్థానాన్ని ఆక్రమిస్తుందా? అని ఆయన ప్రేక్షకులను ప్రశ్నించారు. ప్రపంచం యథాతథంగా ఉన్నప్పటికీ ఒకే ఉద్దేశాలు, ఒకే కోరికలు,ఆశయాలు మాత్రం ప్రపంచానికి లేవని ఆయన హెచ్చరించారు. 21వ శతాబ్దంలో వాణిజ్యం,సరఫరా వ్యవస్థలు,అదనపు అనుసంధానాల శక్తులు దేశాల మధ్య స్వతంత్రకు సంఘర్షణగా ఉన్నాయని అన్నారు. అదేసమయంలో ఈ దేశాలన్నీ ఒక్కటిగా కలిసి ఉన్నాయన్నారు. హోర్ముజ్ జలసంధి ఇప్పుడు ప్రపంచంలో అతిపెద్ద కేంద్రస్థానాన్ని ఆక్రమించిందని, ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయాలు కూడా 2.70 ట్రిలియన్ డాలర్లు దాటిపోయిందని, ఈ వ్యయం ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల బడ్జెట్‌ను దాటి పోయిందన్నారు. భద్రత, దేశ సమృద్ధి, సౌభాగ్యం మధ్య సరిహద్దులు ఇంకెంతోకాలం సరిహద్దుగా ఉండవన్నారు. భద్రతా వ్యయం ఇక దేశ సమృద్ధికి ఒక ముందస్తు షరతుగా మారుతుందన్నారు. భారతదేశంలో జాతీయతాబలం,వ్యూహాత్మక వివేకం శాంతిని కాపాడతాయని, వృద్ధిని వేగవంతం చేస్తాయని, ప్రపంచ వాతావరణాన్ని మనకు అనుకూలంగా మలుస్తాయని అన్నారు.

## ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్టుపెయిడ్ సేవలు ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ తన పోస్టు పెయిడ్ వినియోగదారుల కోసం ఎయిర్‌టెల్ ప్రయారిటీ సేవలను ప్రారంభించింది. ఈ సేవల ద్వారా 5జి నెట్‌వర్క్‌లో వేగవంతమైన కనెక్టివిటీ, ప్రత్యేక కస్టమర్ సపోర్ట్, అలాగే ప్రీమియం ప్రయోజనాలు అందనున్నాయని సంస్థ వెల్లడించింది. ఈ ప్లాన్‌లలో ఫాస్టెస్ట్ 5జి యాక్సెస్‌తో పాటు అమెజాన్ ప్రైమ్, జియో హాట్‌స్టార్, ఆపిల్ టివి, ఆపిల్ మ్యూజిక్ వంటి ఓటిటి సేవలు కూడా లభించనున్నాయి. అదనంగా అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం, 100జిబి క్లౌడ్ స్టోరేజ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. రూ.449నుంచి ప్రారంభమయ్యే ఈ ప్లాన్‌లు ఎయిర్‌టెల్ యాప్ ద్వారా లేదా సమీప ఎయిర్‌టెల్ స్టోర్‌లలో పొందవచ్చని సంస్థ పేర్కొంది.



## శ్యామ్‌ప్రసాద్ లాల్‌కు కవుల ఘన సన్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పౌరసరఫరా శాఖ రాష్ట్ర సంచాలకులుగా ఇటీవల పదోన్నతి పొందిన జి.వి. శ్యామ్‌ప్రసాద్ లాల్‌ను కవి సాయంత్రం వేదిక కవులు ఘనంగా సన్మానించారు. నగరంలోని ఎర్రమంజిల్‌లో గల పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కవులు, సాహితీవేత్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు కవులు, శ్యామ్‌ప్రసాద్‌లాల్ అంచెలంచెలుగా పదోన్నతులు సాధించడం ఆయన క్రమశిక్షణ, కార్యదీక్షకు నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కవి సాయంత్రం గ్రూప్ అధ్యక్షుడు ముక్కెర సంపత్‌కుమార్, హైదరాబాద్ మహానగర పట్టణ అధ్యక్షురాలు బేతి కవిత, సినీ గేయకవి మౌనశ్రీ మల్లిక్, సీనియర్ పాత్రికేయుడు బోయిన భాస్కర్, జలమండలి పి.ఆర్.ఓ సుభాష్ చంద్రబోస్, కవులు దేవర కనకయ్య, వాసుదేవ, చేపూరి కుమార్, రవి ప్రసాద్ సాండేసరి, నూకల అశోక్ యాదవ్, శ్రావ్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.



## జనగణన సిబ్బందికి సహకరించాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రభుత్వం కొనసాగిస్తున్న జనగణన–2027 కార్యక్రమానికి తమ వద్దకు వచ్చే సిబ్బందికి సహకరించాలని మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటి కమిషనర్ కోరారు. సిబ్బందికి సరైన సమాచారం ఇవ్వటం తప్పనిసరన్నారు. జనగణన సమాచారం దేశ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక రూపకల్పనలో ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. గృహ యజమానులు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీ సంక్షేమ సంఘాలు స్థానిక ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా ఈ విషయంలో ఉండాలన్నారు.

## బండమీదిపల్లిలో గాలి బీభత్సం

*లేచిపోయిన ఇంటి పైకప్పులు * విరిగిపోయిన విద్యుత్ స్థంభాలు

**ప్రజాపక్షం/తాండూరు:** ఈదురు గాలులు సృష్టించిన గాలి బీభత్సంతో బండమీదిపల్లి ఉలికి పడింది. ఎన్నడు లేని విధంగా భీకరంగా వీసిన ఈదురు గాలులతో ఒక్కసారిగా బండమీదిపల్లి, తట్టేపల్లి తదితర గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. పెద్దేముల్ మండల పరిధి బండమీది పల్లి గ్రామంలో ఈదురు గాలులు సృష్టించిన గాలీ భీభత్సవంతో చెట్లు, విధ్యుత్ స్థంభాలు విరిగి విధ్యుత్ వైర్లు సైతం తెగిపోయ్యాయి. మరో పక్క ఇంటి పైకప్పులు, రేకులు గాలీ భీభత్సంతో లేచిపోయి అర కిలో మీటరు దూరంలో పడిపోయ్యాయి. ఆ సమయంలో బయట ఎవ్వరైన ఉంటే ప్రాణాలు సైత పోయేవని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలీ సృష్టించిన భీభత్సవంతో బండమీపదిపల్లి గ్రామ ఒక్కసారి ఉలికిపడింది. దీంతో రెండు రోజులుగా సగం గ్రామం అంధకారంలో ఉందని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.



## పదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు,మెమొంటో

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం సెరినిటీ పాఠశాలలో ఎస్‌ఎస్‌సిలో అత్యున్నత మార్కులు సాధించిన మొదటి 11 మంది విద్యార్థులకు దమ్మాయిగూడ శ్రీ శారదాంబ బ్రహ్మణ సంక్షేమ సంఘం వారు 588 మార్కులు సాధించిన జి. అక్షరరెడ్డికి 2500, 587 మార్కులు సాధించిన దివ్య గాయత్రికి 2300, 586 మార్కులు సాధించిన మౌనికకు 2000, మిగతా విద్యార్థులకు 1000 రూపాలయ నగదుతో పాటు మెమొంటోలను స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డితో కలసి సంఘం అధ్యక్షులు గంగాధర్‌రావు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సభ్యులు ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ‘ఓ పిలగో రాజిరెడ్డి, జానపద పాట’ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/వికారాబాద్ రూరల్:** ‘ఓ పిలగో రాజిరెడ్డి’ జానపద పాటను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆవిష్కరించారు. వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు భాస్కర్ కుమారుడు వినీత్ రూపొందించిన పాటను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జానపద పాటలు మన భారతదేశ సంస్కృతిలో భాగమని , ఆ కళలను ఆదరించాలని కోరారు. అదేవిధంగా భవిష్యత్తులో వనీత్ ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేసి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మండలం, పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలే మార్గం

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం మున్సిపల్ క్రీడా మైదానాల్లో నిర్వహిస్తున్న పోటీలను ఆయన పరిశీలించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఎదులాబాద్ వాలీబాల్ మైదానంలో కొనసాగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సందర్శించిన కమిషనర్, కోచ్‌లు, క్రీడాకారులతో మాట్లాడి శిక్షణకు అవసరమైన సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యువతలో క్రీడా స్ఫూర్తి, శారీరక దారుఢ్యం పెంపొందించేందుకు ఎంఎంసి పరిధిలో పలు క్రీడా పోటీలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

**రోడ్డుపై చెత్త వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు**

ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్, ఎన్ఎఫ్‌సి నగర్, ఎదులాబాద్ చెరువు, మర్రిపల్లిగూడ ప్రాంతాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్యం, దోమల నివారణ, జనగణన పనులను సమీక్షించారు. ఎన్ఎఫ్‌సి నగర్ చెరువు వద్ద దోమల లార్వా నివారణ చర్యలను పరిశీలించిన కమిషనర్, పర్యావరణానికి హాని కలగకుండా రసాయనాల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.





అనంతరం ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, ప్రతి ఇంటిని సాట్ ఆటో సేవలకు అనుసంధానం చేసి చెత్త సేకరణను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచేందుకు సాట్ ఆటోల సంఖ్య పెంచాలని సూచించిన ఆయన, జనగణన కార్యక్రమాల్లో ఏ ఇల్లు మిస్ కాకుం డా ఖచ్చితమైన డేటా సేకరణ చేపట్టాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. సూపర్‌వైజర్లు, కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎదులాబాద్ చెరువులో యాంటీ లార్వా చర్యలు, మర్రిపల్లిగూడలో నాలాల శుభ్రత పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. శుభ్రత సిబ్బందికి అవసరమైన పరికరాలు అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**ఉప్పల్ ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయండి**

ఉప్పల్ ఎక్స్‌రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ పనుల కారణంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాం టి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారుల బృందం తో కలిసి క్షేత్రస్థాయి లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతాల్లో వాహనదారులకు స్పష్టమైన మార్గదర్శకత్వం అందించేలా, ఎటువైపు వెళ్లాలో తెలిపే సరైన డైవర్షన్ (రహదారి మళ్లింపు) సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతరం రద్దీగా ఉండే ఉప్పల్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం పెంచుకోవాలని సంబంధిత అధికారులకు కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆదేశించారు. ఫ్లైఓవర్ పిల్లర్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు.

నగర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలను శాశ్వతం గా తగ్గించడం, మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధీక గుప్త, చీఫ్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఉప్పల్, ఎల్.బి. నగర్ ట్రాఫి క్ డిసిపిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టార్పాలిన్‌ల కొరతపై రైతుల ఆవేదన



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మేరకు టార్పలిన్, సుతిలి బ్యాగ్‌లు అందుబాటులో ఉండటం లేదని, దీని వల్ల ధాన్యాన్ని తరలించటంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఉన్నతాధికారులు ఇక్కడికి వచ్చి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్నారే తప్ప ఆ దిశగా ముందుకు రావటం లేదని రైతులు వాపోయారు.

మంగళవారం ఘట్‌కేసర్ మండలంలోని మాదా రం, ఏదులాబాద్ గ్రామాల్లోని ధాన్యం సేకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కల్సి తనిఖీకి వచ్చిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి తో ఈ మేరకు రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ వెంటనే టార్పాలిన్, సుతిలి బ్యాగ్‌లను తెప్పించాలని అధికారులను ఆదేశించటంతో పాటు రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లాలోని 15 ధాన్యం సేకరణ కేంద్రాలకు గాను 15 ధాన్యాన్ని శుభ్రం పరిచే ప్యాడీ క్లీనర్ మిషన్లు అందించాలని సివిల్ సప్లయిస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం తూకం, నిలువ, రవాణా ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకుండా రైతులకు సమగ్ర సేవలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేయగానే వెంటనే డాటా ఎంట్రీ చేయ టం ద్వారా 24 గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బులు అందేలా చూడాలన్నారు. సివిల్ సప్లయిస్ డిఎం సుగుణ, డిసిఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ‘పది’లో 565 మార్కులు సాధించిన విద్యార్థినికి అవార్డు





**ప్రజాపక్షం/నవాబుపేట :** నవాబుపేట మండల పరిధిలోని అక్నపూర్ గ్రామానికి చెందిన మన్సూర్ కుమార్తె పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గా ను 565 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, రాజ్యసభ సభ్యులు నరసింహారెడ్డి చేతుల మీదుగా విద్యార్థిని అవార్డు అందుకుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 560కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్య అతిథులు విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివితే విజయాలు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

## పలు ప్రాంతాల్లో సిసి రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గం యాప్రాల్ కౌకూర్ డివిజన్ ప్రాంతాల్లో రూ. 3.71 కోట్ల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజ శేఖర రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేసారు. లక్ష్మి పురం కాలనీలో రూ. 1.33కోట్లు, మహా లక్ష్మి పురంలో రూ.43లక్షలు, మెహర్‌బాబా కాలనీ లో రూ.62లక్షలు, భాను ఎన్‌క్లేవ్ ఫేజ్ 2లో రూ.57లక్షలు, సాయి క్రిష్ ఎన్‌క్లేవ్ ఫేజ్ 2లో రూ.43లక్షలు, మల్లారెడ్డికాలనీ, కౌకూర్‌లో రూ.33లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఆయన నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి ఇంజనీరింగ్ విభాగ అధికారులు పద్మలత, సత్యలక్ష్మి, బిఆర్ఎస్ శ్రేణులు జికె హన్మంత రావు, జెఎసి వెంకన్న, కరంచంద్, శోభ, రమేష్, శివగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**రూ.42 కోట్లతో ఆర్‌యుబి నిర్మాణం :** దశాబ్ద కాలంగా గౌతంనగర్ గేట్ వద్ద ఆర్‌యు బి నిర్మాణానికి రూ.42 కోట్ల ప్రతిపాదనలతో సిద్ధం అయిందని, త్వరలో ఈ పనులు ప్రారంభమవుతా యని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి పేర్కొ న్నారు. మంగళవారం ఆయన హెచ్ఎండబ్ల్యు, ఎంఎంసి ప్రాజెక్టు అధికారులు, రైల్వే ప్రాజెక్టు అధికారులు కల్సి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొ రేటర్ మేకల సునీత, రైల్వే సీనియర్ డీన్ రాజేంద్రప్రసాద్, ఎఎంసి ప్రాజెక్టు ఎఇ సుజీత్, జలమండలి జిఎం సునీల్ కుమార్, డిజిఎం రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలు

### కలెక్టర్ దీపక్‌తివారి అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/వికారాబాద్:** బూత్ లెవల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్ల నియామకనికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బిఎల్‌ఏల నియామకం జాబితాను నిర్ణీత ఫార్మాట్ ప్రకారం అందించాల్సిందిగా రాజకీయ పార్టీలను మరోమారు లఖితపూర్వకంగా లేఖల ద్వారా ఇవ్వాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అమలుతీరుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియ విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్ఐఆర్ అమలు కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను వెలువరించి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి నిర్ణీత పార్మాట్‌లో వివరాలు సమర్పించేలా చూడలాన్నారు. ఎస్ఐఆర్ షెడ్యూల్ పక్కాగా పూర్తిచేయలని ఆదేశించారు. అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రముఖుల ఓటరు మ్యాపింగ్ పూర్తి అయ్యిందా లేదా అన్నది ఈఆర్‌ఓలు స్వయంగా పరిశీలన జరపాలని సూచించారు. జున్ 5వ తేదీలోపు అన్ని క్లెయిమ్‌లు పరిష్కారం కావాలని గడువు విధించారు. ఎలాంటి పొరపాట్ల కు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదన పు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, నేమత్ హలి తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా స్థాయిలో సభను ఏర్పాటు చేయా లి**

జిల్లా పరిధిలో ఉన్న జిల్లాలో ఉండే వివిధ శాఖల అధికారులు జిల్లా స్థాయి డేటా ఇవ్వాలని, వివిధ శాఖలలో ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమపథకాలపై చేసిన పురోగతిపై వివరించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై చేసిన పురోగతిపై వివరించాలని సూచించారు. మండల, నియోజకవర్గం స్థాయిలో సభలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్ట ర్ ఉమాశంకర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## కోతీనార్ చెరువు కట్ట ఆక్రమణపై చర్యలు చేపట్టిన అధికారులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** కోతినార్ చెరువు కట్ట అక్రమణకు గురికావడంతో ‘ప్రజాపక్షం’ పత్రికలో మంగళవారం ‘కోతినార్ చెరువు కట్ట అక్రమాలపై గ్రామస్తుల ఆందోళన’ అనే వార్త కథనం రావడంతో అధికారులు చర్యలు శ్రీకారం చుట్టారు. కట్టకు ఆనుకొని ఓ ప్రైవేట్ నిర్మాణం సంస్థ నిర్మాణం చేపట్ట




దంతో వాటిని తొలగించి మట్టితో గుంతలను పూడ్చారు. అతి త్వరలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ మూడు శాఖల సమన్వయంతో సర్వే నిర్వహించి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. కుంటలు, చెరువులు, కట్టు కాలువలు, పూర్తిగా ఇరిగేషన్ అధికారుల ఆధీనంలో ఉండడంతో దృష్టి సారించి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## క్రికెట్‌లో సూరారం యువకుల సత్తా





**ప్రజాపక్షం/దుండిగల్ :** క్రికెట్ టోర్నమెంట్లలో కుత్బు ల్లాపూర్ సూరారం కు చెందిన యువకులు బత్తుల రేవంత్ కుమార్, వల్లెపు మూర్తి సత్తా చాటుతున్నారు. ఇటీవలే అజిత్ నగర్ లోని బృంద స్టేడియంలో జరిగిన టోర్నమెంట్లలో బౌలింగ్ బ్యాటింగ్ లలో తమ ప్రతిభ చాటారు. ఇదే విధంగా మునుముందు జరగబోయే టోర్నమెంట్లలో మ్యాచ్ లలో సత్తా చాటాలని తల్లిదండ్రులతో పాటు కోచ్లు కోరుతున్నారు.

## ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా సామ్రాజ్యలక్ష్మి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** నిజాంపేట్‌కు చెందిన నల్లమల్లి సామ్రాజ్య లక్ష్మి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంగళవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఖైరతాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ చేతులమీదుగా ఆమె నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు రాయపూడి భవాని, మేడ్చల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వినయ్ కుమార్, స్రవంతి తదితరు లు పాల్గొని సామ్రాజ్యలక్ష్మి కి అభినందనలు తెలిపారు. మహిళా విభాగ బలోపేతానికి ఆమె సేవలు ఉపయోగపడతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జిహెచ్‌ఎంసి ఎన్నికలకు సన్నద్ధం కావాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న జిహెచ్‌ఎంసి ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. భర్కత్‌పుర బిజెపి నగర కార్యాలయంలో ఆయన డివిజన్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులతో సమావేశం అయ్యారు. ఈ భేటీలో రాజ్యసభ సభ్యురాలు రేఖా శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి వార్డుల పునర్విభజన అనంతరం వార్డుల సంఖ్య 300కు పెరిగిందని, అది 350 వరకు చేరే అవకాశముందని తెలిపారు. సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున, పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో బూత్ స్థాయి నుండి సన్నద్ధం కావాలన్నారు. 2020 ఎన్నికల్లో బిఆర్ఎస్, ఎంఐఎం కలిసి పోటీ చేసినా బిజెపి ఒంటరిగానే 48 స్థానాలు గెలిచిందని, ప్రస్తుతం పార్టీకి బలమైన పార్లమెంటరీ ప్రాతినిధ్యం ఉందన్నారు. ప్రజల్లో చురుకుగా ఉంటూ, నిరంతరం పనిచేసే నిబద్ధత గల కార్యకర్తలకే ఈసారి టికెట్లు ఇస్తామని, అంతర్గత విభేదాలను ఏమాత్రం సహించబోమని రాంచందర్ రావు స్పష్టం చేశారు. సర్వేలు, ప్రజాదరణే అభ్యర్థుల ఎంపికకు ప్రామాణికమని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ప్రజల ఆలోచనల్లో లేదని, ఆ పార్టీకి చెందిన వందలాది మంది నేతలు బిజెపితో సంప్రదింపుల్లో ఉన్నారన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

మహబూబ్‌నగర్
బుధవారం
20-05-2026
www.prajapaksham.in

ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సమ్మర్ హాలిడేస్ అనే చిల్డ్రన్ మూవీని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సమ్మర్ హాలిడేస్ సినిమాను చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు.

రీల్



## 'పెద్ది' నా కెరీర్‌లో మోస్ట్ ఇన్‌స్పైరింగ్ మూవీ

ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రామ్ చరణ్

రామ్ చరణ్ హీరోగా జాన్వీకపూర్ హీరోయిన్‌గా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం ముంబైలో ఘనంగా జరిగింది. సంగీత దర్శకుడు ఎ.ఆర్ రెహ్మాన్ సహా సినిమా ప్రధాన నటీనటులు ఈ ట్రైలర్ విడుదలకు హాజరైయ్యారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రాన్ని, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈవెంట్‌లో రామ్ చరణ్ మాట్లాడుతూ ఈ సినిమా కోసం గత రెండేళ్లుగా ప్రాణం పెట్టి పని చేశాం. బుచ్చిబాబు అయితే గత ఐదేళ్లుగా ఈ సినిమాతోనే ట్రావెల్ అవుతున్నారు. బుచ్చిబాబుకి ఒక విషయంలో ప్రత్యేకంగా థ్యాంక్స్ చెప్పాలి. రెహమాన్‌ని ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకొచ్చేలా కన్విన్స్ చేశారు. ప్రతి ప్రాజెక్ట్‌కు నాలుగు పిల్లర్లు ఉంటాయి. కానీ మా ప్రాజెక్ట్‌కు సెంటర్ పిల్లర్ రెహమాన్. రెహమాన్ మ్యూజిక్ అంటే నాకు ఎంతో అభిమానం. ఆయన 'పెద్ది'లో భాగం కావడం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. దివ్యేందు ఒక గ్యాంగ్‌స్టర్. తనకంటూ ఓ స్టైల్ స్వాగ్ కనిపిస్తాడు. రత్నవేలుతో ఇది నాకు ఐదో చిత్రం. ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. జాన్వి చాలా హార్డ్‌వర్కింగ్ పర్సన్. తనలో చాలా డెడికేషన్ ఉంది. తన పాత్రను ఎంతో నిజాయితీగా చేసింది. మా నాన్న, శ్రీదేవి మేడం కలిసి సినిమాలు చేశారు. జాన్వీ, నేను కలిసి నటించాలని ఫ్యాన్స్ ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. ఇది మాకు ఒక నోస్టాల్జిక్ మూమెంట్. ఈ క్యారెక్టర్ చేయడం ఫిజికల్‌గా చాలా చాలెంజింగ్. 'సుల్తాన్', 'దంగల్' లాంటి చిత్రాలతో మాకు ఒక ఇన్‌స్పిరేషన్ ఇచ్చారు. బుచ్చిబాబు కథ చెప్పినప్పుడే ఈ పాత్ర కోసం ట్రాన్స్‌ఫర్మ్ అవ్వాలని తెలుసు. ఇది చాలా నిజాయితీగా చేసిన సినిమా. అందరికీ ఒక ఐడెంటిటీ కావాలి. అలాంటి ఐడెంటిటీ కోసం చేసే ప్రయాణం.ఈ కథని దర్శకుడు చాలా ఆర్గానిక్‌గా, అలాగే హైలీ కమర్షియల్‌గా చూపించారునిర్మాత సతీష్ కిలారు, దివ్యేందు శర్మ, దర్శకుడు బుచ్చిబాబు సానా, డిఓపి రత్నవేలు పాల్గొన్నారు.

## సమ్మర్ హాలిడేస్‌లో 'ఖుషి' పోస్టర్ విడుదల



ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సమ్మర్ హాలిడేస్ అనే చిల్డ్రన్ మూవీని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సమ్మర్ హాలిడేస్ సినిమాను చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బాలనటి ఖుషి పుట్టినరోజు సందర్భంగా సమ్మర్ హాలిడేస్ చిత్రం నుంచి ఆమె బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. బాలనటి ఖుషి మన శంకర వర ప్రసాద్ గారు సినిమాలో మెగాస్టార్ చిరంజీవి కూతురి పాత్రలో నటించి అందరిని ఆకట్టుకుంది. సమ్మర్ హాలిడేస్ మూవీ ఖుషికి మరింత పేరు తీసుకురానుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి డిఓపి సాయి ప్రకాశ్, మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి.

## 'పురుష' ట్రైలర్ రిలీజ్

కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'పురుష:'. ఈ మూవీతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను 22న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.'బ్రహ్మచారి భర్తగా మారాలని నిర్ణయించుకున్న తరువాత జీవితం యుద్ధభూమిలా మారుతుంది' అని వెన్నెల కిషోర్ డైలాగ్‌తో ట్రైలర్ స్టార్ట్ అవుతుంది. ఆ తరువాత వచ్చే సీన్‌లు, భార్యల చేతిలో భర్తలు నలిగిన తీరు అందరినీ ఆకట్టుకునేలా ఉంది. 'ప్రేమ ఉన్న చోట నిజాయితీ ఉంటుంది.. నిజాయితీ లేని నీలాంటి వాడితో నేను ఉండలేను' అని చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ ఎమోషనల్ టర్న్ తీసుకుంటుంది. 'పెళ్లాం తిట్టినప్పుడు మన లోపల ఉన్న మగాడు పవర్ ఫుల్‌గా బయటకు వస్తాడు' అనే డైలాగ్స్ ఎంటర్‌టైనింగ్‌గా ఉన్నాయి. ఫ్యామిలీ, యూత్, మాస్ ఇలా అన్ని వర్గాలను ఆకట్టుకునే అంశాలతో ట్రైలర్‌ను కట్ చేశారు.ఈ మూవీకి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్ని అందిస్తున్నారు. సతీష్ ముత్యాల కెమెరామెన్‌గా, కోటి ఎడిటర్‌గా పని చేశారు. పవన్ కళ్యాణ్ బత్తుల, సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్, అనంత్ శ్రీరామ్, వెన్నెల కిషోర్ తదితరులు నటించారు.



## చిరు చిత్రానికి డిఓపిగా విజయ్ కార్తీక్ కన్నన్



మెగాస్టార్ చిరంజీవి 'వాల్తేర్ వీరయ్య' తర్వాత మరో మాస్ ఎంటర్‌టైనర్ కోసం సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లితో మరోసారి సినిమా చేస్తున్నారు. ఈ చిత్రాన్ని కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. చిరు బాబీ2 / చిరు158 మే 21న షూటింగ్ ప్రారంభం కానుంది. 'జైలర్', 'డాకూ మహారాజ్', 'జైలర్ 2' చిత్రాలతో తన విజువల్ స్టైల్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ ఈ చిత్రానికి డీవోపీగా అధికారికంగా జాయిన్ అయ్యారు. గతంలో బాబీ కొల్లితో కలిసి పని చేసిన విజయ్ కార్తీక్ కన్నన్, ఈసారి కూడా తన ప్రత్యేక విజువల్ టచ్‌తో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లనున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌ను గ్రాండ్‌గా తెరకెక్కించడంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న బాబీ కొల్లి, ఈసారి చిరంజీవిని ఇప్పటివరకు చూడని అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించబోతున్నారు. మెగాస్టార్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా రూపొందుతున్న ఈ చిత్రం పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్, హై వోల్టేజ్ ఎలివేషన్స్, థియేటర్‌లను షేక్ చేసే మాస్ మూమెంట్స్‌తో ఉండబోతోంది.



## 'ఫస్ట్ టైం' ప్రీరిలీజ్ ఈవెంట్ సాంగ్

### పాటను ఆవిష్కరించిన తమ్మారెడ్డి భరద్వాజ

హేమంత్ ఇప్పలపల్లి కథ రాసుకుని తానే దర్శక నిర్మాతగా వ్యవహరిస్తూ తక్కువ బడ్జెట్ తో హై టెక్నికల్ వాల్యూస్ తో నిర్మిస్తు వి ఎఫ్ ఎక్స్ సినిమాగా నిర్మించబడుతున్న సినిమా 'ఫస్ట్ టైం'. ఈ సినిమాకి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ సాంగ్ లాంచ్ ఘనంగా జరిగింది. ఈ సినిమాలో సౌరబ్ ధింగ్ర హీరోగా పరిచయం అవుతుండగా 'బిగ్ బాస్' ఫేమ్ అఖిల్ సార్థక్ సెకండ లీడ్‌గా అనిక్క విక్రమన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకట్, సూరజ్ ఎస్ కురుప్ సంగీతాన్ని అందించగా వేణు మురళీధర్, రామ్ సినిమాటోగ్రాఫర్లుగా పనిచేశారు. హై రేంజ్ గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాకి సంబంధించిన ట్రైలర్ లాంచ్ ఘనంగా జరిగింది. ఈవెంట్‌కి అతిథులుగా సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్, మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, బిగ్ బాస్ ఫేమ్ దివ్వెల మాధురి, జీ చీఫ్ ఎడిటర్ భరత్ కుమార్ విచ్చేయగా ముఖ్య అతిథిగా అందాల తార పాయల్ రాజ్ పుత్ విచ్చేశారు. దర్శకుడు హేమంత్ ఇప్పలపల్లి మాట్లాడుతూ ఈ సినిమాకు వెనుక ఉండి మాకు ధైర్యం ఇచ్చిన వ్యక్తి పాయల్. ఈ కార్యక్రమానికి వచ్చి మమ్మల్ని సపోర్ట్ చేస్తున్న అందరికీ థాంక్స్. అందరూ ఈ సినిమాను ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాను అందరూ సినిమా థియేటర్‌లో చూడాలి అన్నారు. సంగీత దర్శకుడు శ్రీ వెంకట్, నటి గాయత్రి గుప్తా, నటి అనిక్క విక్రమన్ , బిగ్ బాస్ ఫేమ్ దివ్వెల మాధురి, మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నటుడు సౌరబ్ ధింగ్ర, నటి పాయల్ రాజ్ పుత్ పాల్గొన్నారు.

## వీర జవానుల సాహసాన్ని తెలిపే 'ఆర్ కె దీక్ష' : హీరో సుమన్

ఆర్ కె ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్ బ్యానర్‌లపై డా. ప్రతాని రామ కృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం ఆర్ కె దీక్ష. డి.ఎస్. రెడ్డి సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్షఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్‌లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూన్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లో ఈ చిత్ర సాంగ్స్, టీజర్ లాంచ్‌ఈ వెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్‌మాట్లాడుతూ మూవీ సాంగ్స్, టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ప్రతి మనిషిలో దీక్ష, పట్టుదల ఉంటాయి. వాటితో పనిచేస్తే ఏదైనా సాధించగలం అని చెప్పే చిత్రమిది. వీర జవాన్ మురళీనాయక్ గొప్పతనాన్ని తెలియజేసేలా ఒక స్పెషల్ సాంగ్ రూపొందించాం. జూన్ 12న విడుదల కానున్న 'ఆర్ కె దీక్ష' చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలి అన్నారు. నటుడు సుమన్ మాట్లాడుతూ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ సినిమాపై ప్యాషన్ ఉన్న వ్యక్తి. వీర జవాన్ సాహసాన్ని చెప్పే పాటను థ్రిల్లింగ్‌గా రూపొందించారు. ఈ చిత్రంలో మంచి కంటెంట్ ఉంది. కిరణ్, అక్సా ఇద్దరూ చాలా బాగా నటించారు అన్నారు.బి ఆర్ ఎస్ నాయకుడు గ్యాదరి బాలమల్లు మాట్లాడుతూ సిద్ధిపేట ప్రాంతం నుంచి వచ్చిన డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ రాజకీయంగా, సినీ రంగంలో ఎంతోకాలంగా కొనసాగుతున్నారు. అనేక చిత్రాలు నిర్మించి, దర్శకత్వం వహించారు. నటుడిగానూ రాణించారు. 'ఆర్కే దీక్ష' చిత్రం కూడా ఆయనకు సక్సెస్ అందించాలి అన్నారు. మన వీర జవాన్ల సాహసాలపై రూపొందించిన స్పెషల్ సాంగ్ ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ రాజ్ కిరణ్, హీరో కిరణ్ ,హీరోయిన్ అక్స ఖాన్, ఫైట్ మాస్టర్ రవి, నటి తులసి పాల్గొన్నారు.





## బస్సు పయ్య ఆగుతది

(మొదటి పేజీ తరువాయి)

నిరంకుశ పోకడలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రతి కార్మికుడికి ఊపిరి అందిస్తున్న సంఘం ఎంప్లాయిస్ యూనియన్, ఎఐటియుసి అని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశం మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని విఎస్‌టి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. తొలుత బస్‌భవన్ నుంచి సమావేశ ప్రాంగణం వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ హాజరయ్యారు. ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కె.పద్మాకర్, అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న పాల్గొన్నారు. ఇటీవల సమ్మె నేపథ్యంలో బలవన్మరణానికి పాల్పడిన డ్రైవర్ కె.శంకర్‌గౌడ్‌కు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులు కన్నెర్ర చేస్తే టాటాలు, బిర్లాలు, అంబానీలు కూడా కార్మికుల కాళ్ల దగ్గరికి రావాల్సిందేనని తేల్చి చెప్పారు. కార్మికవర్గాన్ని ఏదైనా చేయవచ్చని పాలకులు భావిస్తున్నారని, దానిలో భాగంగానే బ్రిటిష్ కాలం నుంచి ఉన్న కార్మిక సంఘాలను కెసిఆర్ నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు, కార్మికుల హక్కులు లేకపోతే ఇదేం ప్రజాపాలన అని పలుమార్లు ముఖ్యమంత్రిని ప్రశ్నించానని తెలిపారు. శంకర్ గౌడ్ ఆత్మబలిదానంతో ప్రభుత్వం దిగి వచ్చి, ఆర్‌టిసి ఉద్యోగుల డిమాండ్లకు అంగీకరించిందన్నారు. తొలుత యూనియన్లు ఏర్పాటు చేసుకుని, ఆ తర్వాత విలీనం ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. విలీనానికి ముందు ఎన్నికలు జరిగితే ఎంప్లాయిస్ యూనియన్ తరపున, విలీనం తర్వాత ఎన్నికలు జరిపితే ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్‌గా మనమే గెలవాలని పిలుపునిచ్చారు. రామారావు, రంగారావు, మగ్ధూం మోహియిద్దీన్, కె.ఎల్.మహేందర్ లాంటి అనేక మంది ఆర్‌టిసి కోసం ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. ఆర్‌టిసి ఉన్నంతకాలం ఎంప్లాయిస్ యూనియన్ ఉండాల్సిందేనని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఎస్.బాబు మాట్లాడుతూ తెలంగాణలో ఆర్‌టిసి యూనియన్లు ఉనికి కోల్పోవడానికి బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కారణమని విమర్శించారు. దాదాపు 80 వేల పుస్తకాలు చదివిన మహానుభవుడు కెసిఆర్ ట్రేడ్ యూనియన్లపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఆర్‌టిసి జెఎసి గా ఏర్పడి కార్మికుల హక్కులను సాధించుకున్నామన్నారు. జూన్ 2న అపాయింటెడ్ డేట్ ప్రకటించకపోతే, ట్రేడ్ యూనియన్ ఎన్నికలకు వెళ్లి అన్ని డిపోల్లో ఎంప్లాయిస్ యూనియన్ జెండా ఎగురవేసి, హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. వి.ఎస్.బోస్, ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమానికి శ్రీకాంతాచారి ఊపిరి పోస్తే, ఆర్‌టిసి హక్కులను సాధించుకోవడానికి శంకర్‌గౌడ్ ఆత్మబలిదానం ఊపిరి పోసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్ అలీ, ముఖ్య ఉపాధ్యక్షులు వెంకన్న గౌడ్, డి.గోపాల్, ఉపాధ్యక్షులు, ఉప ప్రధాన కార్యదర్శులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల నుంచి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హాజరయ్యారు.

## బంధం అపూర్వం

(మొదటి పేజీ తరువాయి)

సహకారం, పరస్పర మద్దతు, గౌరవప్రదమైన సంభాషణలు ఇరుదేశాల మధ్యా సంబంధాల్లో ప్రత్యేకతను ప్రతిబింబిస్తుందన్నారు. అమెరికాతో వివాదాలు లేని సమాన గౌరవభావన,సమాన మర్యాదలతో కూడిన స్థిరమైన సంబంధాలను కోరుకుంటున్న చైనా, రష్యాతో బలమైన,శక్తిమంతమైన సంబంధాలను ఆకాంక్షిస్తున్నది. ఈ సారి సమావేశంలో వారు క్యూబాలో అమెరికా దిగ్బంధనం వల్ల నెలకున్న సంక్షోభం, ఇతర ప్రపంచ పరిస్థితులుతోపాటు రష్యా—చైనా మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలు,సహకారాన్ని మరింతగా విస్తరించుకోవడంపై దృష్టి సారిస్తారు. రెండు దేశాలూ ఉన్నత స్థాయీ దౌత్య సంబంధాల పటిష్టతపై ప్రధానంగా దృష్టి సారించాయి. రెండు దేశాలమధ్యా స్థిరమైన సంబంధాలు ప్రపంచానికి ఒక సానుకూలమైన బలం చేకూరుస్తాయని చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి చెప్పారు. గతనెలలో రష్యా విదేశీ వ్యవహారలమంత్రి లావ్‌రోవ్ చైనాలో పర్యటించారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక సంబంధాలను ఎంతో అమూల్యమైనవిగా ఆయన అభివర్ణించారు.

## ఎసిబికి చిక్కిన జలమండలి జిఎం



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఆదాయానికి మించిన అక్రమ ఆస్తుల కేసులో హైదరాబాద్ జలమండలి విభాగంలో రెడ్‌హిల్స్ జిఎంగా విధులు నిర్వహిస్తున్న అనంతకుమార్ ఇంట్లో ఎసిబి అధికారులు మంగళవారం సోదాలు జరిపారు. అక్రమంగా కూడబెట్టిన ఆ స్తులను భారీగా గుర్తించారు. ఈ తనిఖీల్లో రూ. కోటి 5 లక్షలు స్వాధీనం చేసుకొన్నట్లు అధికారులు వెల్లడించారు. మల్లాపూర్‌లోని ఆయన నివాసంతో పాటు నిజామాబాద్‌లోని 8 ప్రాంతాల్లోని అతడి బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మల్లాపూర్ నివాసంలో రూ. 1.10 కోట్ల నగదు, 2.1 కిలోల బంగారు ఆభరణాలు, 9.2 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకొన్నారు. ఓ కారు, బైక్‌ను స్వాధీనం చేసుకొన్నారు. నిజామాబాద్‌లో మూడెకరకాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో 6 ఓపెన్ ప్లాట్లు, గేటెడ్ కమ్యూనిటీలో 3 ప్లాట్లు ఉన్నట్లు గుర్తించి వాటికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకొన్నారు. మొత్తం ఆస్తుతల విలువ 5..88 కోట్లుగా ఉంటుందని, మార్కెట్ రేట్ ప్రకారం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంద ని పేర్కొంటున్నారు. ఎసిబి అధికారులు అతడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొన్నారు.

## ఇంటింటి చెత్త సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 జాతీయ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సిఎం పాల్గొన్నారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పిపిపి విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4 వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తమ ప్రభుత్వం చేపడుతోందన్నారు. క్యూర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఆయన తెలిపారు. వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీని వల్ల వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లకు వెళ్లే ఆర్‌డిఎఫ్ నాణ్యత కూడా మెరుగుపడుతుందని వివరించారు. పాత డంప్ యార్డుల శాస్త్రీయ శుద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటి బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఆయన తెలిపారు. ఆటోనగర్ డంప్ సైట్లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయో మైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. జపాన్ దేశంలో ని కిటాక్యుష నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్ధాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. వ్యర్థాల నుంచి విద్యుత్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టుల అమలుకు రాష్ట్రాలకు కేంద్రం తగిన ఆర్థిక సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ముఖ్యంగా ఈ రంగంలో ఆధునిక మౌలిక సదుపాయాలు, శాస్త్రీయ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందించే అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని అన్నారు.

## 'ఇరాన్‌పై దాడి ఆపేశా'

(మొదటి పేజీ తరువాయి)

ఆస్తులు, నిధులను విడుదల చేయాలని ఇరాన్ కోరుతుండగా, శుద్ధిచేసిన యురేనియం తిరిగి ఇచ్చేయాలని, అణు కార్యక్రమం ఆపేస్తున్నట్లు మధ్యవర్తి ద్వారా ముందుగానే తెలియజేయాలని ట్రంప్ రాయితీలు అడుగుతున్నారు. ఈ విషయంలోనే ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో ప్రధానంగా చర్చలు స్తంభించిపోయాయి. ట్రంప్ చైనా పర్యటన ముగించుకుని వచ్చిన తర్వా త ఇరాన్‌పై మళ్ళీ దాడులు పునరుద్ధరించేందుకు సైనిక అధికారులతో మంతనాలు ప్రారంభించా రు. దాడులు అనివార్యమని హెచ్చరిస్తూ కృత్రిమ మేధతో సృష్టించిన ఊహా చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇదే సమయంలో ఈ రెండు దేశాలకూ అధికారిక మధ్యవర్తి పాకిస్థాన్ హోం మంత్రి నక్వీ ఇరాన్ పర్యటనకు వెళ్ళి సంప్రదింపులు జరిపారు. ఇరాన్ ఇచ్చిన తాజా ప్రతిపాదనను ట్రంప్‌కు అందజేశారు. ఈ ప్రతిపాదన అరకొరగా ఉందని, పాత విషయం తప్ప అణు పదార్థాన్ని వదులుకునే విషయం గురించి చెప్పలేదంటూ ట్రంప్ తోసిపుచ్చారు. మళ్ళీ తెల్లారగానే మంగళవారం ప్రకటన చేస్తూ గల్ఫ్ దేశాల విజ్ఞప్తి మేరకు దాడులు వాయిదా వేసినట్లు చెప్పారు. ఐతే ట్రంప్ కొద్దిగా మెత్తబడ్డారంటూ ఇరాన్ అనుకూల ప్రకటనలు వచ్చాయి. 400 కేజీలు శుద్ధిచేసిన యురేనియంను తమకు ఇవ్వాలని, అణు కార్యక్రమాన్ని ఆపేయా లని ట్రంప్ డిమాండ్ చేస్తుండగా, స్తంభింపజేసిన ఆస్తులు విడుదల చేయాలని ఇరాన్ అడుగుతోంది. ఐతే ట్రంప్ మెత్తబడ్డారని, విదేశీ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్లో నాలుగోవంతు విడుదల చేసేందుకు, కొంత మేరకు శాంతియుత అణు కార్యక్రమానికి ట్రంప్ పట్టువిడుపులు ప్రదర్శించారని ఇరాన్ వర్గాలు చె ప్పినట్లు సోమవారం తెల్లవారకముందే ఇరాన్‌కు చెందిన తస్నిమ్ న్యూస్ ఏజన్సీ అనధికారిక వర్గాల ను ఉటంకిస్తూ తెలియజేసింది. దీనిపై ఇరాన్ వ ర్గాలు అధికారికంగా స్పందించలేదు. మరోవైపు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెషభాజ్ షరీఫ్ స్పం దిస్తూ, మరో విడత అమెరికా—ఇరాన్ చర్చలకు ఇ స్లామాబాద్ ఆతిథ్యం ఇస్తుందని ఆశాభావం వ్య క్తం చేశారు. ఈ పరిస్థితుల మధ్య ఒక సానుకూల పరిణామం చోటు చేసుకుందని ట్రంప్ తాజాగా స్పందించడం విశేషం.

**సీరియస్‌గా చర్చలు జరుగుతున్నాయి**

ఇదిలా ఉండగా పిటిఐ వార్తాసంస్థ మంగళవారం పేర్కొన్న కథనం ప్రకారం, ప్రస్తుతం చాలా సీరియస్‌గా చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌పై కొత్తగా దాడులు చేయవద్దని ఖతార్, సౌదీ అరేబియా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు అమెరికాకు విజ్ఞప్తి చేశాయి. దీంతో ట్రంప్ సానుకూలంగా స్పందించారు. ఖతార్ ఎమిర్ తమిమ్ బిన్ హమద్ అల్—థానీ, సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, యుఎఇ అధ్యక్షుడు మహ్మద్ బిన్ జాయేద్ అల్—నహ్యాన్ తనకు విజ్ఞప్తులు చేశారని ట్రంప్ చెప్పారు. ''వాస్తవానికి మేం చాలా పెద్దస్థాయిలో దాడి చేసేందుకు సిద్ధమయ్యాం,కానీ ఎందుకో నేను వాయిదా వేశా, బహుశా ఇరాన్‌తో చర్చ గురించి కావచ్చు, ఈ విషయంలో ఆశాభావంతో ఉన్నా, రెండు మూడు రోజులు దాడులు వాయిదా వేస్తే వారు ఒక ఒప్పందం చేసుకోవడానికి దగ్గరగా వచ్చే అవకాశం ఉంటుంది, కానీ ఇరాన్ చేతుల్లో ఎట్టి పరిస్థితుల్లో అణ్వాయుధం ఉండకూడదు, వారు సంతృప్తి చెందితే బహుశా మేం కూడా సంతృప్తి చెందుతాం'' అన్నారు. ఇరాన్ ఉద్దేశం ప్రకారం, గొప్ప నాయకులు,మిత్రులు ఒక ఒప్పందం కుదురుస్తారు, ఆ ఒప్పందం అమెరికాకు చాలా సమ్మతంగా ఉంటుందని భావిస్తున్నాం, ఈ ఒప్పందం పశ్చిమాసియాలోనూ, ఆ వెలుపల ప్రపంచ దేశాలకు కూడా సమ్మతంగా ఉంటుందని భావిస్తున్నాం అన్నారు. ఇరాన్ వద్ద ఎలాంటి అణ్వాయుధం ఉండకూడదనే అంశం ఈ ఒప్పందంలో అనివార్యంగా ఉండాలని ఉద్ఘాటించారు. ''యుద్ధ మంత్రి పెట్ హెగ్సెత్,త్రివిధ దళాల ఉమ్మడి అధిపతి జనరల్ డాన్ కైన్,దేశ మిలిటరీ అధిపతికి నేను ఆదేశాలు జారీ చేశా, నిర్ణీత ప్రకారం మంగళవారం ఉదయం నుండీ దాడులు చేయవద్దని చెప్పా,కానీ ఇంకో విషయం కూడా చెప్పా, ఏ క్షణంలోనైనా దాడులకు పూర్తి సన్నద్ధంగా ఉండమని చెప్పా'' అని ట్రంప్ తెలియజేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com